ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 208 పేజీలు: 10+4 వెల: 6.50

**నోబెల్ కోసం ట్రంప్ స్వయంగా లాబీయింగ్!** 5లో

**75 యేళ్లకే రిటైరవ్వాలని చెప్పలేదు: మోహన్ భగవత్** 7లో

# కరిగిపోతున్న ఉత్తరాది

## హిమాచల్, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్, యుపి రాష్ట్రాల్లో వరద విలయం

### రావి, బియాస్ నదులు భీకరం

### భారీగా విరిగిపడుతున్న కొండ చరియలు, 11 మంది మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** ఉత్తరభారతదేశాన్ని వరదలు వర్షాలు వణికించేస్తున్నాయి. జమ్ముకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఈ వరదల భయం మరింతగా ఉంది. కొండ చరియలు విరిగిపడుతుండటంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుండటంతోపాటు పురాతన ఇళ్లుకూలి నివాసితులు కూడా చనిపోతున్నారు. రావి, బియాస్ నదులు భీకరరూపకం చూపిస్తు >>2





రాజన్న సిరిసిల్ల జిల్లాలో డ్రోన్ ద్వారా వరద బాధితులకు ఆహార పదార్థాలను అందజేస్తున్న దృశ్యం

# జలదిగ్బంధం



శబరి ఉగ్రరూపం

మెదక్ జిల్లాలో గురువారం మంత్రి ఉత్తమ్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఏరియల్ సర్వే జరిపిన సిఎం రేవంత్ రెడ్డి

## భారీ వర్షాలతో స్తంభించిన తెలంగాణ

### పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, నిర్మల్ మరికొన్ని జిల్లాలు వరదల్లో అతలాకుతలం

### తెగిన రోడ్లు, మునిగిన గ్రామాలు, పొంగుతున్న వాగులు, వంకలు, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

### మూడు జిల్లాల్లోని వరద ప్రాంతాల్లో మంత్రులతో కలిసి ఏరియల్ సర్వే జరిపిన సిఎం రేవంత్

### ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన సిఎం

### వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష

### నేడు, రేపు కొన్ని జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 28:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజా జీవనం అస్తవ్యస్తమయింది. భారీ వర్షాలతో వరదలు రావడంతో పలుచోట్ల చెరువులకు గండ్లు పడటంతో రహదారులు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రెండు మూడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలా ప్రాంతాల్లో జన >>2

**రాష్ట్ర పరిస్థితిపై రాజ్‌నాథ్, నడ్డా ఆరా** 2లో

## ఎగువ మానేరులో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన వైమానిక దళం

**సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 28, ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎగువమానేరు జలాశయం మత్తడి దూకుతుండడం..వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పశువులను మేపేందుకు వెళ్లిన రైతులు వరదలకు చిక్కుకుపోయారు. ప్రాజెక్ట్ అవతల వైపు ఉన్న వాగులో ఐదుగురు రైతులు చిక్కుకోవడంతో విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ >>2



భారీ వరదలకు కామారెడ్డిలో కొట్టుకుపోయిన రోడ్డు



గురువారం హైదరాబాద్‌లో జరిగిన స్పోర్ట్స్ హబ్ మొదటి సమావేశంలో పాల్గొన్న సిఎం రేవంత్, కపిల్‌దేవ్, ఉపాసన తదితరులు

# కామన్వెల్త్, ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధం

### క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక

### తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశంలో సిఎం రేవంత్

### క్రీడా పోటీలు, సబ్‌కమిటీలపై హబ్ తీర్మానాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు28:** ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానంచేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీరంగంలో ఉండాలని కోరుకుంటున్నారని... అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సిఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని సిఎం తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు.
హైదరాబాద్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్దఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడారంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణా >>2



# అన్నా.. బాగున్నావా!

### ఎదురుపడిన కేంద్రమంత్రి బండి సంజయ్‌ని పలకరించిన కెటిఆర్

**గంభీరావుపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజకీయాల్లో నిత్యం ఒకరినొకరు మాటలు తూటాలు సంధించుకునే నాయకులు ఒకరినొకరు పలకరించుకు న్నారు. అన్నా బాగున్నావా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కాన్వాయ్ వద్దకువచ్చి రాష్ట్ర బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కెటిఆర్ ఆత్మీయంగా పలకరించారు. గంభీ రావుపేట మండలం నర్మాల ప్రాజెక్టు వరదలో చిక్కు కొన్న బాధితులను గురువారం పరామర్శించడానికి రాగా




# యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

### దక్షిణ డిస్కం పరిధిలో నేలకూలిన 1357 కరెంటు స్తంభాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు28:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పలుప్రాంతాల్లో చెరువులు, కుంటలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద కారణంగా పలు సబ్ స్టేషన్లలో నీరుచేరడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వలన పలు గ్రామాల్లో విద్యుత్ పంపిణి వ్యవస్థ స్తంభించింది. తమ సిబ్బంది జోరు వాన, భారీ వరదను సైతం లెక్కజేయకుండా, నదులు ఈదుకుంటూ విద్యుత్ స్తంభాలు ఎక్కి మరీ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు గావిస్తున్నారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ చీఫ్ ఇంజినీర్ల, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో సరఫరా పరిస్థితిని సమీక్షించారు. వర్షం ప్రభావంతో మెదక్ జిల్లాలో విద్యుత్ శాఖకు భారీ స్థాయిలో నష్టం జరిగిందని అధికారులు తెలియజేసారు. మెదక్ జిల్లాలో వరద ప్రభావానికి కొన్ని చోట్ల సబ్ స్టేషన్లలో నీళ్లు చేరాయన్నారు. 33 కేవి ఫీడర్స్ 11, 11 కేవీ ఫీడర్స్ 175, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 262, విద్యుత్ >>2



## ట్రంప్ సుంకాలకు భారత్ కౌంటర్

### అమెరికా తిరోగమన విధానాలపై 40 దేశాల్లో ప్రచారం

### ఎగుమతులు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు నిన్నటి నుంచి అమల్లోకి వచ్చినవేళ భారత్ కౌంటర్ ప్రణాళికలురూపొందిస్తోంది. ఈ అదనపు టారిఫ్‌లు, జరిమానాలతో తక్షణం ప్రభావితమయ్యే రంగాలను రక్షించుకునేందుకు మోడీ సర్కార్ చర్యలు చేపట్టింది. ఇప్పటికే జీఎస్టీలో సంస్కరణలు తెచ్చి పన్నుల రంగాన్ని కొంతమేర సరళీకృతంచేసి కేవలం రెండుశ్లాబులు మాత్రమే అమలులోకి తెస్తోంది. అలాగే భారత్ జౌళి వస్తువులు, దుస్తులు, జెమ్స్, ఆభరణాలు వంటి ఎగుమతులపై 40దేశాల్లో ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహించబోతున్నట్టుఅధికారికవర్గాలు వెల్లడించాయి. ఇంగ్లాండ్, రష్యా, >>2

## సిఎస్ రామకృష్ణారావు సర్వీస్ పొడిగింపు

### మార్చి 31 వరకు పదవిలో కొనసాగింపు

2లో



# అసెంబ్లీలో పిపిపికి అనుమతించండి

### కాళేశ్వరం కమిషన్ నివేదిక ముందుగా మా పార్టీకే ఇవ్వాలి

### బిఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఎమ్మెల్యేలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు28:** తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీని పలువురు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. గురువారం అసెంబ్లీకి బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, వివేకానంద గౌడ్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్ స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లారు. స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులుకు వినతిపత్రం అందజేసే ప్రయత్నం చేశారు. అయితే తాను తీసుకోలేనని, స్పీకర్‌ను కలసి ఇవ్వాలని సెక్రటరీ తేల్చి చెప్పారు. మరోవైపు స్పీకర్ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని సెక్రటరీకి ఎమ్మెల్యేల మధ్య సంభాషణ జరిగింది. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కాళేశ్వరం కమీషన్ నివేదిక ముందుగా తమ పార్టీకి ఇవ్వాలని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. అసెంబ్లీలో కాళేశ్వరం నివేదికపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ (పిపిపి) ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తిచేశారు. ఈక్రమంలోనే స్పీకర్ అపాయింట్మెంట్ కోసం బిఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కొద్దిసేపు ఎదురు చూసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పారద్రోలిన ప్రాజెక్టు కాళేశ్వరం అని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.
సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బిజెపి అందరూ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి వాస్తవాలు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత బిఆర్‌ఎస్ పార్టీపై ఉంది. బనకచర్ల, అనుసంధానం పేరిట ఏపీ, కేంద్రం తెలంగాణ హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలు ప్రజలకు తెలవాల్సిన అవసరం ఉంది. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దాదాపు 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందింది. కేవలం రెండు పిల్లర్లు >>2



మెదక్‌జిల్లా ఎస్పీ కార్యాలయంలో వరదల చిత్రాలను పరిశీలిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్ తదితరులు



కామారెడ్డిలో ఊరంతా చెరువుగా మారిపోయిన దృశ్యం



చింతూరు వద్ద భారీ వరదలతో ఎన్.హెచ్.326పై మునిగిన లారీ

# జలదిగ్బంధం

>> జీవనం అతలాకుతలమవుతోంది. ప్రత్యేకించి కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో కురిసిన కుండపోత వర్షాలతో వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతూ వరద నీరు రోడ్లను ఎక్కడికక్కడ బ్లాక్ చేశాయి. ఇప్పటికే మెదక్ జిల్లాలోని పలు మార్గాల్లో వరదలు పోటెత్తడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అత్యవసరం అయితే తప్ప ప్రజలెవరూ ఇండ్లలో నుంచి బయటకు రావొద్దని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉదయం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ముఖ్యమంత్రి స్వయంగా ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితిని సమీక్షి ంచారు. ఏరియల్ సర్వే అనంతరం సిఎం ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి, వరద ప్రవాహాన్ని పరిశీలించారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి అక్కడి నుంచి మెదక్ జిల్లా పర్యటనకు వెళ్లారు. వరద పరిస్థితులపై మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలకు సంబంధించి అధికారులకు సిఎం దిశానిర్దేశం చేశారు. వరద ముప్పు ఇంకాపోలేదని అప్రమత్తంగా ఉండాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి నివేదిక సమర్పించాలని అధికారులను సిఎం ఆదేశించారు. రోడ్లు తెగిన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లతో కలిసి సిఎం ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టే మనకు ప్రాణవాయివు అని, గోదావరి జలాల విషయంలో ఇది చాలా కీలకమన్నారు. చాలా వ్యూహాత్మక ప్రాంతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించారని వివరించారు. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టుల మధ్య చాలా తేడా ఉందన్న రేవంత్ రెడ్డి ..ఇంజినీరింగ్ నిపుణులు సూచించిన చోటనే ఎల్లంపల్లిని నిర్మించారని, నిపుణులు కట్టిన ప్రాజెక్టు కనుకే దశాబ్దాల పాటు నిలబడిందన్నారు.

మేడిగడ్డ విషయంలో సాంకేతిక కమిటీ సూచనలతో ముందుకు వెళ్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్, పోలీస్ శాఖ డిజిపి మరియు అడిషనల్ డిజి మహేష్ భగవత్ ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వాటితో పాటు ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ప్రాథమిక నివేదికలతో పాటు జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు, వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సి.ఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు కురిసే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని సూచించారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్ గ్రేషియాను అందచేయాలన్నారు.

## అన్నా.. బాగున్నావా!

>> వారుఇరువురు ఎదురుపడ్డారు. బండి సంజయ్‌ను చూడగానే ఆయన కాన్వాయ్ వద్దకు కెటిఆర్‌వచ్చారు. వాహనం దిగి కెటిఆర్ వద్దకు వచ్చిన బండి సంజయ్ అభివాదం చేశారు. బాగున్నారా? అంటూ ఒకరికొకరు పలకరించుకున్నారు. కష్టపడుతున్నావంటూ కెటిఆర్ ఈ సందర్భంగా బండి సంజయ్‌ను ఉద్దేశించి మాట్లాడారు. నిన్నటి నుండి నిరంతరం నర్మాల బాధితులను కాపాడేందుకు సంజయ్ చేసిన ప్రయత్నాలను అభినందించారు. కాసేపు వారు ముచ్చటించుకున్నారు. అనంతరం కెటిఆర్ వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిపోయారు. ఇరువురు నేతలు ఒకే దగ్గర కలిసి మాట్లాడుకోవడం అక్కడ సందడి వాతావరణం కనిపించింది.

## ఆదిలాబాద్ వాహనాలు కొండాపూర్ దారికి మార్పు

**హైదరాబాద్, ఆగస్టు28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ వర్షాలపైవాహనదారుల రాక పోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. రోడ్లపై వరదలు పెద్దఎత్తున పారడంతో ఆదిలాబాదునుండి వెళ్లే వాహనాలను కొండాపూర్ బ్రిడ్జి దారిలోకి మళ్లించినట్లు నిర్మల జిల్లా ఎస్పి జి. జానకి షర్మిల తెలిపారు. కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వచ్చే వాహనాలు నిర్మల్‌లోని కొండాపూర్ బ్రిడ్జి నుండి ఎడమవైపు దారిలో కొండాపూర్, మామడ, ఖానాపూర్ మెట్ పల్లి, జగిత్యాల్, కరీంనగర్ మీదుగా వెళ్లాలని సూచించారు.

## ఆదిలాబాద్‌కు వెళ్లే వాహనాలు మేడ్చల్‌వైపు మళ్లింపు

**హైదరాబాద్, ఆగస్టు28, ప్రభాతవార్త:** జాతీయ రహదారి-44పై కుండపోత వర్షాలతో కామారెడ్డి సమీపంలో దెబ్బతిన్న రోడ్డుపై టూ వీలర్స్, భారీ వాహనాలను మళ్లించారు. ఈ దారిలో కేవలం 25 వాహన రాకపోకలే సాగుతుండడంతో, భారీ వాహనాలను మేడ్చల్‌లో మరో దారికి అనుసంధానం చేశారు. ఇక చిన్నస్థాయి కార్లను రామాయంపేట నుంచి మళ్లించారు. ఇక మేడ్చల్ - రామాయంపేట, డిచ్‌పల్లి మార్గం కాకుండా ప్రత్యామ్నాయ రూట్లలో రాకపోకలు సాగించాలన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలు (నాగ్‌పూర్ హైవే) మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి మళ్లించారు.

## ట్రంప్ సుంకాలకు భారత్ కౌంటర్

>> బెల్జియం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో తదితర దేశాల్లో భారత్ ప్రత్యేక ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించబోతోంది. ఈ దేశాల్లో మన ఉత్పత్తులకు మార్కెట్‌ను మరింత విస్తరించేలా ఈ ప్రోగ్రామ్‌లు ఉండనున్నాయి. మన వస్తువుల నాణ్యత, సుస్థిరత గురించి ఆయా దేశాలకు చాటిచెప్పేలా ఈ ప్రోగ్రామ్స్ డిజైన్ చేస్తున్నారు. సరికొత్త టెక్స్‌టైల్ ఉత్పత్తులతో ఆయా మార్కెట్లలో మన దేశం ప్రధాన పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ కార్యాచరణ ప్రతిపాదించారు. ప్రస్తుతం భారత్ 220 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఇందులో ఈ ప్రతిపాదిత 40 దేశాలు కీలకమైనవి. ఈ దేశాలన్నీ కలిపి ఏటా 590 బిలియన్ డాలర్లకు పైగా విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ యూరోప్ దేశాల్లో మార్కెట్ షేర్ పెంచుకుంటే అది మన పరిశ్రమలకు విస్తృత అవకాశాలు కల్పించనుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. మార్కెట్ మ్యాపింగ్, డిమాండ్ ఎక్కువగా ఉండే ఉత్పత్తులను గుర్తించడం, సూరత్, పానిపట్, తిరుపూర్, బదోహి వంటి ప్రాంతాల్లో పేరొందిన స్వదేశీ ఉత్పత్తులకు ఈ 40 దేశాల్లో ప్రచారం కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ఇప్పుడు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్లు, వాణిజ్య మేళాలు, అమ్మకం కొనుగోలుదారులతో సమావేశాలు, యునిఫైడ్ బ్రాండ్ ఇండియా విజన్ కింద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించబోతోంది భారత్. తద్వారా భారత వాణిజ్య రంగాన్ని రక్షించుకోవాలని చూస్తోంది.

## అసెంబ్లీలో పిపిపికి అనుమతించండి

>> కుంగితే కాళేశ్వరం కుంగిపోయిందని అంటున్నారు. భారీ వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ ఆనకట్ట నిలబడింది, కావాలంటే అక్కడకు వెళ్లి చూద్దామని అధికార పార్టీ నేతలకు వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక సీల్డ్ కవర్‌లో ఉండగానే ఏదో జరిగిందని పిసిసి అధ్యక్షుడు మాట్లాడు తున్నారు. నివేదికను తప్పుపడుతున్నాం, సెక్షన్ 8బీ ప్రకారం వివరణ కోరలేదు, న్యాయస్థానంలో పోరాడుతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలు, ప్రయోజనాలను వివరించాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారాలు, గణాంకాలు, సాంకేతిక అంశాలతో ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని సభాపతిని అడిగాం. స్పీకర్ అందుబాటులో లేరు, కార్యదర్శి తీసుకోవడం లేదు. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు శాసన సభాపతి అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. పిపిటికి అవకాశం ఇవ్వకపోతే పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లు భావించాల్సి వస్తుంది. నిజానిజాలు సమగ్రంగా వివరించేందుకు పిపిటికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. స్పీకర్ సమయం ఇస్తే శుక్రవారం అయినా కలిసి వినతిపత్రం అందిస్తాం అని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఐదుగురిని కాపాడిన వైమానిక దళం

>> బిగితేలు ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గంట గంటకు వరద ఉద్ధృతి ఎక్కువ కావడంతో ప్రాజెక్ట్ సమీపంలో చిక్కుకున్న రైతులకు డ్రోన్ సహాయంతో ఆహారాన్ని అందించారు. వరదల్లో చిక్కుకున్న రైతులను కాపాడడానికి ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని తెప్పించినప్పటికి వారిని రక్షించే అవకాశం లేకుండ పోయింది. పొంగి పొర్లుతున్న ఎగువమానేరు ఉద్ధృతికి గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన ప్రవీన్ చిక్కుకోగా ఎన్డీఆర్‌ఎఫ్ బృందం రాత్రి 12 గంటల వరకు వరకు ప్రయత్నం చేసి ఎట్టకేలకు ప్రవీన్‌ను రక్షించారు. ప్రాజెక్ట్ వద్ద చిక్కుకున్న రైతులను కాపాడడానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు రాత్రంత అక్కడే ఉండి పర్యవేక్షించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర రక్షణ శాఖ మంత్రితో మాట్లాడి హకీంపేట నుంచి వైమానిక దళానికి చెందిన రెండు హెలికాప్టర్లను తెప్పించారు. దీంతో ప్రాణ భయంతో వరదల్లో చిక్కుకున్న బాదిత రైతులు బిక్కుబిక్కుమంటూ హెలికాప్టర్ల ద్వారా భయటకు రావడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. హెలికాప్టర్లు నర్మాలకు రావడంతో బండి సంజయ్‌కూడ అక్కడకువచ్చి వరదలనుంచి భయటకు క్షేమంగా వచ్చిన భాదితులను పరామర్శించారు. అలాగే వరదల్లో గల్లెంతైన పంపుకాడి నాగయ్య నివాసానికి కేంద్ర మంత్రి బండి వెళ్లి పరామర్శించారు. నాగయ్య కుటుంబానికి కేంద్ర మంత్రి లక్ష ఆర్థిక సాయం అందించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ వరదల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరిన వెంటనే హెలికాప్టర్లను పంపారని తెలిపారు. వరదల సమయంలో రాజకీయాలు వద్దని రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి తెలిపారు. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని వారికి థ్యాంక్స్ చెప్పారు.

# యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

>> స్తంభాలు 971 దెబ్బతిన్నాయని మరియు కొన్నివందల కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ చెడిపోయిందని అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాతో పాటు, నల్గొండ, గద్వాల్, యాదాద్రి, సంగా రెడ్డి, నారాయణపేట జిల్లాల పరిధిలో కూడా నష్టం జరిగిందన్నారు. మొత్తం మీద సంస్థ పరిధిలో వరద ప్రభావానికి 33 కేవి ఫీడర్స్ 39, 11 కేవీ ఫీడర్స్ 296, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు 280, విద్యుత్ స్తంభాలు 1357 దెబ్బతిన్నాయని, వరద ఇంకా కొనసాగుతుండటం వలన నష్టాలు మరింతగా పెరిగే అవకాశం వున్నదని చీఫ్ ఇంజినీర్, రూరల్ జోన్ శ్రీ బాల స్వామి సీఎండీకి తెలియజేసారు. భారీ వర్షాల వేళ, పండుగ పర్వదినాన కూడా మొత్తం విద్యుత్ అధికారులు సిబ్బంది పని చేసారని, భారీ వరద ప్రభావంతో మెదక్ జిల్లాల్లో 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, సిబ్బంది అహర్నిశలు కృషి చేసి నిన్న రాత్రి వరకు 10 గ్రామాల్లో సరఫరా పునరుద్ధరించారు. భారీ వర్షానికి తోడు, రహదారులు కూడా పూర్తిగా దెబ్బతినడంతో మిగిలిన గ్రామాల్లో రాత్రికి సరఫరా పునరుద్ధరించలేక పోయామని, ఈ రోజు తమ సిబ్బంది రాజిపేట్ గ్రామంలో వున్న నదిలోకి దిగి ఫీడర్ మరమ్మతు చేసి సరఫరా పునరుద్ధరణ గావించారన్నారు. యావత్ విద్యుత్ సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండి, యుద్ధప్రాతిపదికన పునరుద్దరణ పనులు గావించడం వలెనే అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరా అందించగలిగామని, సిబ్బంది పునరుద్ధణ పనులు గావించేటప్పుడు భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు.

# కరిగిపోతున్న ఉత్తరాది

>> న్నాయి. నిర్దేశిత నీటిమట్టాలను అధిగమించి మరీ ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌లోని వైష్ణోదేవి యాత్ర మార్గంలో కొండచరియలు విరిగిపడటంతో మృతులసంఖ్య వరదల కారణంగా 11 మంది చనిపోయారు, 23 మంది గాయపడ్డారు. జమ్మూలో అయితే ఒక్కరోజులోనే 368 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయి 70 ఏళ్ల రికార్డులు బ్రేక్‌చేసింది. తావినది వంతెన కూలిపోవడంతో ఈ ప్రభావం జమ్మూనగరంలో మరింతగా ఉంది. నదిలో ప్రవహిస్తున్న నీటి ఉధృతి కారణంగా వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. చీనాబ్, తావి, జీలం, బసంతర్ వంటి నదులు పొంది ప్రవహిస్తున్నాయి. మాధోపూర్ వంతెనపైకి నీరుచేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంజాబ్‌లో సాధారణం కంటే 1200శాతం వర్షపాతం ఎక్కువ నమోదయింది. హరియాణాలో 700శాతం ఎక్కువ. హిమాచల్‌లో 550శాతం ఎక్కువ వర్షపాతం నమోదయింది. మరో రెండుమూడురోజులుఈ వర్షాలు తప్పవని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇక చండీగఢ్ కులు మనాలి జాతీయ రహదారిలో పలుచోట్ల రోడ్లు పైకి కొండచరియలు విరిగిపడ్డాయి. 50 కిలోమీటర్లమేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. రూ.50 కోట్ల విలువైన యాపిల్ పండ్లు వాహనాల్లో మురిగిపోతుండటంతో కుళ్లిపోతున్నాయని వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. ప్రతి ట్రక్కులో సుమారు ఐదులక్షలమేర సరుకు ఉందని కూరగాయల మండిలవద్ద ట్రక్కులు జామ్ కావడంతో యాపిల్స్ కుళ్లిపోతున్నట్లు డ్రైవర్లు చెపుతున్నారు. మండి కులూ మధ్యనే 12చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. బియాస్‌నది ఉధృతి ప్రభావం ఎక్కువ ఉంది. హిమాచల్‌లో సంభవించిన మేఘవిస్ఫోటనం కారణంగా భారీ ఎత్తున ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. 300 మందికిపైగా మృతిచెందగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు సుమారు 300 కోట్లకుపైగా నష్టం



ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న నదులు

వాటిల్లింది. ఈనెల 27వరకూ 310 మంది చనిపోయినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో సుమారు 582 రోడ్లు బ్లాక్ అయ్యాయి. కులు, మండి, కాంగ్రా, సిమ్లా జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎన్‌హెచ్03, ఎన్‌హెచ్ 305లను అధికారులు మూసివేసారు. 1155 విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 346 జలసంరక్షణ పథకాలు పనిచేయడంలేదు. మొత్తంగాచూస్తుంటే ఉత్తరాదిలోని జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ వంటి ప్రాంతాలు భారీగా నష్టపోయాయి. హిమాచల్‌లోని కులుమనాలి, మండి, సిమ్లా జిల్లాల్లో మరింత నష్టం వాటిల్లింది. పంజాబ్‌లో కూడా వర్షాల ఉధృతికి ఆర్మీ రంగంలోనికి దిగింది. కేవలం వరదలు వర్షాలకాలంలోనే సహాయక చర్యలకోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాలతో వరదల్లో చిక్కుకున్నవారిని సురక్షితప్రాంతాలకు తరలిస్తున్నారు.

# కామన్వెల్త్, ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధం

>> ళిక రూపొందించాలని సిఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సిఎం తెలిపారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ధాని ఫౌండేషన్ వీతా ధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని... వ్యాయామ అక్షరాస్యత (ఫిజికల్ లిట్రసీ)పై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయినుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని, అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు హాబ్ కో చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హాబ్ చైర్‌పర్సన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం నుంచే ఉన్నందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి అవసరమైన సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడాసామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని, అలాగే మన దగ్గర ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఉన్న స్టేడియాలను మెరుగ్గా వినియోగించుకోవాలని, వాటి నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.

క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని, తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. రానున్న మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సిఎం సూచించారు. సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోని బాల దేవి తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

29-08-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
షష్ఠి రా.8.22
స్వాతి ఉ.11.38
వర్జ్యం : సా.5.56-7.44
దు.ఉ.8.25-9.15, 2) మ.12.35-1.25
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించండి.

**వృషభం:** కారణం లేని చికాకులు ఉంటాయి. ఆర్థికంగా పొదుపు పాటించలేకపోతారు.

**మిథునం:** నూతన వ్యక్తులు పరిచయమై మీరు సహాయం అందిస్తారు. వాహనయోగం.

**కర్కాటకం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తిచేస్తారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**సింహం:** ఇంటాబయటా మీదే పై చేయిగా నిలుస్తుంది. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. సోదరుల కలయిక.

**తుల :** నిదానమే ప్రధానమని నానుడిని గుర్తుపెట్టుకొని ఒకటి రెండుసార్లు ఆలోచించడం అన్నివిధాలా మంచిది.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** ఉద్యోగావకాశాలు లభిస్తాయి. బాకీలు వసూలవుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మకరం:** బంధువులనుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సేవా కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కుంభం:** రాజకీయ, కళారంగాలలోని వారికి విదేశీపర్యటనలు ఉంటాయి. స్థలాలు కొనుగోలుచేస్తారు.

**మీనం :** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రాష్ట్ర పరిస్థితిపై రాజ్‌నాథ్, నడ్డా ఆరా

**హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వరద ప్రభావిత జిల్లాల పరిస్థితుల నేపథ్యంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకి ఫోన్ చేసి వరద పరిస్థితులను తెలుసుకుని, భరోసా ఇచ్చారు. అవసరమైతే మరిన్ని సహాయక చర్యలకు వీలుగా అవసరమైన మేరకు సిబ్బందిని, సామాగ్రిని కేంద్రం నుంచి వెంటనే పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి బూత్ స్థాయి అధ్యక్షులు, ఆపై నాయకులతో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో సహాయ చర్యల్లో పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ఆపై నాయకులందరూ ప్రజలతో అందుబాటులో ఉండి, సహాయక చర్యల్లో బిజెపి కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు.వరద ప్రాంతాలకు సిబ్బంది చేరుకోలేని పరిస్థితుల్లో లోతట్టు ప్రాంత ప్రజలకు ఆహారం, తాగునీరు, రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రత్యేకంగా బిజెవైఎం కార్యకర్తలు, కార్పొరేటర్లు తక్షణమే సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. బాధితులను సురక్షిత ప్రదేశాలకు తరలించడం, అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడం వంటి కార్యక్రమాల్లో నిబద్ధతతో ఉండాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. మరోవైపు కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ వరద పరిస్థితులపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని వివరించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కేంద్రమంత్రులు చర్చించి, వరదప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు హెలికాప్టర్లు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరింపజేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## నేడు కొన్ని జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు

### భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను రద్దుచేసిన జెఎన్‌టియు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 28:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో కురిసిన కుండపోత వర్షాలతో వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతూ వరద నీరు రోడ్లను బ్లాక్ చేశాయి. కొన్నిచోట్ల రోడ్లు తెగిపోవడంతో గ్రామాలకు రవాణాసౌకర్యం నిలిచిపోయింది. మెదక్ జిల్లాలోని పలు మార్గాల్లో వరదలు పోటెత్తడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మెదక్‌తోపాటు హన్మకొండ, కామారెడ్డి, కరీంనగర్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో వర్షం కురుస్తుందని తెలిపిన వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మెదక్ జిల్లావ్యాప్తంగా నేడు (శుక్రవారం) ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవుప్రకటిస్తున్నట్టు మెదక్ డీఈవో రాధాకిషన్ ఓ ప్రకటనలోతెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సెలవు ప్రకటిస్తున్నట్టు వెల్లడించారు. కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు మరో రెండు రోజులు సెలవులు ప్రకటించారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో హైదరాబాద్ జేఎన్టీయూపరిధిలో నేడు(శుక్రవారం), రేపు (శనివారం) జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు.

## సిఎస్ రామకృష్ణారావు సర్వీస్ పొడిగింపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 28:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 31తో ముగియనున్న సంగతి తెలిసిందే. ఈ నెల 31న రామకృష్ణారావు పదవీ విరమణ చేయవలసి ఉండగా.. ఆయన సర్వీసును పొడిగించాలని డీవోపీటీని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం మరో ఏడు నెలల పాటు రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర ఉత్తర్వుల నేపథ్యంలో రామకృష్ణారావు 2026 మార్చి 31 వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

## తెలంగాణ లా సెక్రటరీగా పాపిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28:** న్యాయ శాఖ కార్యదర్శిగా మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి. పాపిరెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ హైకోర్టు సిఫార్సు మేరకు రాష్ట్ర ప్రభుత్వం పాపిరెడ్డిని డిప్యూటేషన్ పద్ధతిలో నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గురువారం జీవో జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి యేడాదికాలంపాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వ హించను న్నట్లు జీవోలో పేర్కొన్నారు.రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా బాధ్య తలు నిర్వహించిన రేండ్ల తిరుపతి డిప్యూటేషన్ ముగియడంతో గత వారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో న్యాయశాఖ అదనపు కార్యదర్శి సునీతకు తాత్కాలిక ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో లా సెక్రటరీ పోస్టు కోసం హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ఐదు పేర్ల జాబితాను పంపించగా బి.పాపిరెడ్డి. పేరును ప్రభుత్వం ఫైనల్ చేసింది.

## నేటి నుంచి ఎడ్‌సెట్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్–2025 కౌన్సెలింగ్‌లో భాగంగా సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభించనున్నారు. నేటి నుంచి సెప్టెంబర్ 2 వరకు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి అధికారులు అవకాశం కల్పించారు. అర్హులైన అభ్యర్థుల లిస్టును సెప్టెంబర్ 4న ప్రకటించనున్నారు. అర్హులైన వారు సెప్టెంబర్ 5, 6 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 7న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 11న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు బిఇడి కాలేజీల్లో 14,295 కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి విడతలో 17,151 మంది వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారిలో 9955 మందికి సీట్ల కేటాయింపు చేశారు.



## పర్యాటక రంగంలో కొత్త ధోరణిపై దృష్టి సారించాలి

### సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించేలా భిన్న కళాకాండాలతో సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక రంగాన్ని అగ్రగామి సంస్థగా నిలుపాలని సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్)లో ఏర్పాటైన జాతీయ క్రీడా వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆగస్టు 28 నుండి 31 వరకు జరిగే వారోత్సవాల్లో ఆరోగ్యం, శ్రేయస్సు, సంస్థాభివృద్ధి అంశాలపై వివిధ కార్యక్రమాలు చేపడుతున్నరన్నారు. స్వల్పకాలిక, నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టాలని, విద్యా–శిక్షణా పరిధిని సైతం విస్తరించాలి. అదేవిధంగా ఉద్యోగ, పారిశ్రామికావకాశాలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యకార్యదర్శితో చర్చించి నిథమ్ అభివృద్ధికై సమగ్ర కార్యచరణను సిద్ధం చేయాలని డైరెక్టర్‌కు సూచించారు. నిథమ్‌ను జాతీయ స్థాయి ప్రీమియర్ ట్రైనింగ్, రీసెర్చ్, కన్సల్టెన్సీ సంస్థగా తీర్చిదిద్దడంలో సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యాటక, అతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. చారిత్రక,సాంస్కృతిక ప్రాముఖ్యం కలిగిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయిలో ప్రచారం చేయాలన్నారు.పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ప్రైవేట్ సంస్థలు దృష్టిపెట్టాలన్నారు. నిథమ్ డైరెక్టర్ ప్రొ.వెంకటరమణ, శ్రీకరా హాస్పిటల్స్ డాక్టరు. పి.ఎల్.ఎన్. పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## హోదాను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్న బిఆర్‌నాయుడు

### వైసిపి నేత భూమన విమర్శలు

**తిరుపతి,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** క్విడ్‌ప్రో క్రింద బిఆర్‌నాయుడుకి టిటిడి ఛైర్మన్ పదవి వచ్చిందని, ఆ హోదాను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని వైసిపి ఉమ్మడిచిత్తూరుజిల్లా అధ్యక్షుడు ,టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. వైసిపి నేతలపై నిరంతరం దూషణలకు దిగుతున్నారని అన్నారు. ఈ పదవి శాశ్వతం కాదనే విషయం బిఆర్‌నాయుడు గుర్తుంచుకోవాలని తెలిపారు. గురువారం ఉదయం పద్మావతిపురంలో భూమన మీడియాతో మాట్లాడారు.తప్పుడు ప్రచారాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయన మారాడన్నారు. నాపైచేసే ఆరోపణలకు సిబిఐ విచారణకైనా సిద్ధమని కరుణాకర్‌రెడ్డి సవాల్ మరోసారి సవాల్ విసిరారు. టిటిడి భూములను పర్యాటకశాఖకు ఎందుకు బదలాయిస్తున్నారని ప్రశ్నించారు. అత్యంత విలువైన భూములను ఎందుకు ఇస్తున్నారన్నారు. నా ప్రశ్నలకు బిఆర్‌నాయుడు నుండి సమాధానాలు రాలేదన్నారు.

## 35 వేల మంది మహిళలతో 'అథర్వశీర్ష' ఆలాపన

**పుణే, ఆగస్టు 28:** గణేశ్ ఉత్సవాలకు మహారాష్ట్ర పెట్టింది పేరు. ముంబయిలోని లాగ్‌బౌగ్చా గణపతి అంటే దేశంలోని నలుమూలలనుంచి అక్కడకు వచ్చి గణేశునికృపకు పాత్రులవుదామని పరితపిస్తుంటారు. కేవలం ముంబయిలోనే కాకుండా పుణే, నాసిక్ ఇతర అన్ని ముఖ్య నగరాల్లో కూడా ఇదే విధంగా భారీ ఎత్తున గణ నాథులను ఏర్పాటుచేసి కొలుస్తుంటారు. మండ పాల్లోని అలంకారాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. మహారాష్ట్రలోని పూణెలో శ్రీమంత్ దగ్దుషేత్ హల్వాయి గణపతి మందిరింలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 35 వేల మంది మహిళలు గణేశ్ అథర్వశీర్షను ఆలపించారు. 133 యేళ్లుగా ఈ ఆలయంలో గణేశ్ ఉత్సవాలు జరుగుతున్నాయి. 40 ఏళ్లగా అథర్వ శీర్ష పారాయణం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా అంర్ధరాత్రి నుంచే మహిళా భక్తులు మండపానికి సాంప్రదాయ వస్త్రధా రణలో హాజరయ్యారు. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్‌పవార్ భార్య, ఎంపి సునేత్ర పవార్ కూడా పాల్గొన్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది.



## ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వం కాపాడాలి

### స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ
### కాంగ్రెస్, సిపిఎం పార్టీలు కలిసొచ్చినచోట కలిసి పోటీ
### పొత్తులేనిచోట ఒంటరిగా బరిలోకి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. పార్టీ రాష్ట్ర 4వ మహా సభలు ఘనంగా ముగిశాయని.. మరొకసారి రాష్ట్ర కార్యదర్శిగా తనని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. పార్టీ జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు జాతీయ మహాసభలు చండీగఢ్ లో జరుగుతాయన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఫాసిస్ట్ బాటలో పయనిస్తోంది విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, బాధ్యత మరిచి నిరక్ష్యంగా వహిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పకుండా, మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై పోరాటాలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.గత పాలకులు కాళేశ్వరం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని విమర్శించారు. కాళేశ్వరాన్ని హైలెట్ చేస్తూ రాష్ట్రంలో ఇతర ప్రాజెక్ట్ లను నిరక్ష్యం చేశారన్నారు.

రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులను విస్మరించి, కాళేశ్వరం ప్రధాన ఎజెండాగా వేల కోట్ల అప్పులు తెచ్చి మట్టిలో పోశారని మండిపడానదరు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైతాంగ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. వేలాదిమంది పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని, అధికారులు వారి గుడిసెలను నిర్ధాక్షిణ్యంగా తొలిగించి నిరాశ్రయులను చేయడం సరికాదన్నారు. పేదల ఇండ్లను కూల్చడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఆర్‌టిసిని కాపాడుకో వడం కోసం నిరంతర పోరా టాలకు సిద్ధం అవుతామన్నారు.సజ్జనార్ ముఖ్య మంత్రా? లేకపోతే మంత్రినా? ఆర్‌టిసి ఎండినా? అని ప్రశ్నించారు.

సజ్జనార్ పద్ధతి మార్చు కోవాలన్నారు. ఆయన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయి ఉండొచ్చు,అట్లాంటి భయానక వాతావరణం ఆర్‌టిసి కార్మికుల పట్ల సృష్టిచడం సరైంది కాదని హెచ్చరించారు. ఆర్‌టిసి కార్మికుల పట్ల సజ్జనార్ పద్ధతి మార్చుకోక పోతే ప్రత్యేక ఉద్యమాలు రూపొందించాల్సి వస్తుందని హెచ్చరించారు. సజ్జనార్ ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడానదరు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 26న కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల సంబురాల సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నట్టు కూనంనేని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట త్యాగాల్ని, ప్రభుత్వం గుర్తించాలని.. సాయుధ వారోత్స వాలను జరిపేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఈ నెల 30న పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను రవీంద్ర భారతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సభకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిం చామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. అయితే కాంగ్రెస్, సిపిఎం పార్టీలు కలిసొచ్చిన చోట కలిసి పోటీ చేస్తామని.. పొత్తు లేని చోట ఒంటరిగా బరిలో నిలుస్తామని స్పష్టం చేశారు.

## హెచ్‌సిఏ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుకు బెయిల్



జగన్మోహన్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జగన్ మోహన్ రావుకు గురువారం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక లక్ష రూపాయల రెండు షూరిటీలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అయితే ఆయన అధ్య క్షుడుగా జగన్మోహన్‌రావు ఉన్నప్పుడు సన్‌రైజర్స్ హైదరాబాద్, హెచ్‌సీఏ వ్యవ హారంలో ఐపీఎల్ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం చెలరేగింది. దీంతో అక్రమాలకు పాల్ప డ్డారనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదు కావడంతో రిమాండ్‌కు తరలించారు.

విజిలెన్స్ నివేదిక ఆధారంగా సిఐడి సైతం కేసు నమోదు చేసి విచారించింది. ఉచిత పాస్‌ల కోసం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మో హన్‌రావు తీవ్రంగా వేధిస్తు న్నాడని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ఆరోపించింది తెలిసిందే.

హెచ్‌సీఏ అధికారులు, అధ్యక్షుడి నుంచి వేధింపులు తీవ్రమయ్యాయని ఇటీవల విమర్శలు వెలు వెత్తాయి.

ఇక ఉప్పల్ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా ఎంచుకుని మ్యాచ్‌లు ఆడటం వారికి ఇష్టం లేనట్లుగా ఉందంటూ హెచ్‌సీఏ కోశాధికారికి లేఖ సైతం రాసింది. ఈ క్రమంలో బీసీసీఐకి, ప్రభుత్వం, జట్టు యాజమాన్యానికి తెలుపనున్నట్లు విషయం విధితమే. 12 సంవత్సరాలుగా హెచ్‌సీఏతో కలిసి పనిచేస్తున్నామని, గత సీజన్ నుంచే ఈ సమస్య లు, వేధింపులు ఎదుర్కొంటున్నట్లుగా వివ రించింది.

## వినాయకచవితి పూజల్లో జగన్

**విజయవాడ. ఆగస్టు28,ప్రభాత వార్తప్రతి నిధి:**వైసిపి అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వినాయకచవితి పూజల్లో పాల్గొన్నారు.వైసిపి కేంద్ర కార్యాలయంలో నిన్న వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ అధినేత, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లంబోదరుడి తొలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విఘ్నేషుడికి హారతి ఇచ్చి.. తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్ జగన్ షెడ్యూల్ ప్రకారం.. బుధవారం ఉదయం విజయవాడ రాణిగారితోట వద్ద జరిగే వినాయక పూజలో ఆయన పాల్గొనాల్సి ఉంది. అయితే భారీ వర్షాల కారణంగా ఆ పర్యటన రద్దు అయ్యింది.

దీంతో తాడేపల్లి ఆఫీసులో జరిగే పూజలోనే ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్ సహా పార్టీ నేతలు హాజరయ్యారు.



## భారీ వర్షాలపై మాజీ సిఎం కెసిఆర్ ఆందోళన

### సహాయకచర్యలు చేపట్టాలని కెటిఆర్‌కు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28:** రాష్ట్రంలో అతి భారీ వర్ష సూచన తెలంగాణలో కురుస్తున్న కుండపోత వర్షాలు, వరదల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని పార్టీ శ్రేణులను ఆదేశిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కీలక సూచనలు చేశారు. వరద తీవ్రత ఎక్కువగా ఉన్న పలు జిల్లాల పార్టీ నేతలతో ఆయన స్వయంగా ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా నిలిచి, అవసరమైన సహాయాన్ని అందించేందుకు పార్టీ శ్రేణులను వెంటనే రంగంలోకి దించాలని కేటీఆర్‌కు స్పష్టం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం సహా అనేక జిల్లాల్లో వరదల కారణంగా నివాస ప్రాంతాలు నీట మునగడం, రహదారులు తెగిపోయి రవాణా వ్యవస్థ స్తంభించడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు, చెరువుల నుంచి నీరు పోటెత్తడంతో వందలాది ఎకరాల్లో పంటలు నాశనమై ఇసుక మేటలు వేశాయని, ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్రంలో నేడు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

## భారీ వర్షాల నేపథ్యంలో ద.మ.రైల్వే 36 రైళ్లు రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాత వార్త:** తెలంగాణలో కురుస్తున్న భారీ కుండ పోత వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే 36రైళ్లను రద్దు చేసింది. వరద నీరు ట్రైన్ మార్గాల్లో చేరడంతో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకు న్నట్లు గురువారం రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ ప్రకటనలో వెల్లడించారు. అంతే కాకుండా మరో 25 రైళ్ల మార్గాలను మార్చామని, మరో 14 రైళ్లను పాక్షి కంగా రద్దు చేసినట్లు వివరించారు.

ప్రయాణికుల సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లను కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ముఖ్యం గా హైదరా బాద్, సికింద్రా బాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాక పోకలు సాగించే కొన్ని ప్యాసింజర్ రైళ్లు, మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు అయిన కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా వెళ్లే రైళ్లను వేరే మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. దీంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోవడానికి కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

టెండర్ నం. 18_2025_26_ Sr.DEE_Tr_HYB,తేది:26.08.2025

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ DEE/ TR/ HYB, టెండర్ నం. 18_2025_26_ Sr. DEE_Tr_HYB, తేది: 26.08.2025, ముగింపు తేది: 18.09.2025 15.00 గం. వద్ద టెండర్ ఎదురుగా, ఇ-టెండర్‌లు కోరుతున్నారు. బిడ్డర్లు వారి ఒరిజినల్/సవరణ బిడ్స్ ముగింపు తేదీ, సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలరు. ఈ టెండర్‌కు మేన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. అటువంటి మేన్యువల్ ఆఫర్లు వచ్చినా పట్టించుకోబడవు.

1. పని వివరణ: హైదరాబాద్ డివిజన్: HYB డివిజన్: రెండు సంవత్సరాల కాలానికి NZB, KCG, TMX & GWD వద్ద 8-వీలర్ టవర్ కార్స్ యొక్క 4 నం.ల డీసెల్ ఇంజన్‌ల యొక్క B, C & D చెక్స్ మరియు వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ (AMC). సుమారు ధర (రూ): 82,30,619.60/-, బయానా (రూ): 1,64,600/-, పూర్తి చేయు కాలం: 02 సంవత్సరాలు (24 నెలలు), ముగింపు తేది: 18.09.2025

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in

టెండర్ పూర్తి వివరాలు చూపించగల నోటీస్ బోర్డ్ లొకేషన్: Sr.DEE/Tr/HYB, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్-500025 యొక్క కార్యాలయం.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ట్రాక్షన్), హైదరాబాద్

ఇ-టెండర్ ఆహ్వానిస్తూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరఫున CE/C-III/SC & CE/C-V/SC, నిర్మాణ సంస్థ, SC రైల్వే, సికింద్రాబాద్ వారు క్రింది పనులకు ఇ-టెండర్ కోరుతున్నారు.

1. నిట్ నం.: 19-CAO-C-SC-2025, తేది: 13.08.2025, పని యొక్క పేరు: SCR నిర్మాణ సంస్థ: గుంటూరు డివిజన్–గుంటూరు–బీబీ నగర్ స్టేషన్‌ల (239 కిమీ) మధ్య ట్రాక్ యొక్క విద్యుద్దీకరణతోసహా డబ్లింగ్ ప్రతిపాదన-GNT-BN సెక్షన్ (239 కిమీ) యొక్క ప్రతిపాదిత డబుల్ లైన్ కొరకు భూసేకరణ కార్యకలాపాల ఏర్పాటు. అంచనా ధర (రూ): 64,00,086.55, బయానా (రూ): 1,28,000.00, పూర్తి చేయు కాలం: 9 (తొమ్మిది) నెలలు, తెరచు తేది: 09.09.2025 15.00 గం.

2. నిట్ నం.: 21-CAO-C-SC-2025, తేది: 16.08.2025, పని యొక్క పేరు: SCR నిర్మాణ సంస్థ: విజయవాడ డివిజన్–రాజమండ్రి రైల్వే స్టేషన్ పునర్ అభివృద్ధికి సంబంధించి ప్లాట్‌ఫారంల నవీకరణ మరియు PF4-5 యొక్క విస్తరణ, PF1 యొక్క వెడల్పు చేయటం, ప్లాట్‌ఫారంలపై కవర్, 2. ఫుట్ ఓవర్ వంతెనల నిర్మాణ ప్రతిపాదన. అంచనా ధర (రూ): 55,28,78,753.27, బయానా (రూ): 30,64,400.00, పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు, తెరచు తేది: 16.09.2025 15.00 గం.

i) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ https://ireps.gov.in కు దయచేసి లాగిన్ అవ్వండి.
ii) టెండర్ యొక్క ముగింపుకు ముందు పదిహేను రోజుల పీరియడ్ ఏదైతే టెండర్ దాఖలు పీరియడ్‌లో టెండర్‌దారులు వారి ఆఫర్‌లను ఆన్‌లైన్ దాఖలు చేయవచ్చును.
iii) టెండర్ దాఖలు పీరియడ్ యొక్క ప్రారంభం యొక్క తేదీ వరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) ఏదైన సవరణకు టెండర్‌దారులు పరిశీలించవలెను.

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ / నిర్మాణం / సికింద్రాబాద్
A1285

తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద చూడవచ్చును.



GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

Engineering Section /SE (Works-II) / EE (Works-IV)
EXPRESSION OF INTEREST

Provide services to GVMC for a proposed "Provide Services to GVMC for the proposed "Study Tour for Hon'ble Ward Members on Developmental Activities taken up under Swachh Bharath Mission / Smart City at Urban Local bodies Jaipur, Jodhpur, Jaisalmeer and Udaipur for a period of 8 days and 7 nights.

The documents containing terms & conditions may be downloaded from website of Further details at http://www.apeprocurement.gov.in (Tender ID : 839798)
Further details at Superintending Engineer, GVMC Main Office, Visakhapatnam, e-mail : eegvmcpw3@gmail.com,
Cell No : 7729995941. For COMMISSIONER (GVMC)



ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E Procurement Short Tender Notice

NIT No. 75/MAU61/736/2025-LEG-MAU61, Dated: 26.08.2025
Name of Work : Tenders are Invited for Empanelment of Legal Firms for a Period of Two Years

NIT No. 80/Proc/MAU61-USI0HB(BG)/10/2025-HB-Part (1), Dated: 26.08.2025
Name of Work : RFP for Selection of an Agency for Conceptualization, Installation and Operation of Experience Centre @ APCRDA Project Office, Amaravati

The bid can be downloaded on AP e-procurement portal from 28.08.2025 to 06.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 06.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 06.09.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

E Procurement Tender Notice

NIT No. 19/MAU61-USI0HB(OTH)/367/2025-HB Dt.28.08.2025.
Name of Work: "Providing Un-Skilled workers for attending the services of cleaning and dusting the case records, placing in serial, making them available to the posting section and also other works in the High Court of Andhra Pradesh, Nelapadu, Amaravati for a period of 1 Year"– Estimate Cost Rs.3,41,26,000/-
The bid can be downloaded on AP e-procurement portal from 29.08.2025 to 12.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 12.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 12.09.2025 @16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

E Procurement short Tender Notice (Third Call)

NIT No. 12/MAU61-USI0HB(BG)/7/2025-IFR2/3rd call Dt.26.08.2025.
Name of Work: "Providing Comprehensive Annual Maintenance Contract to Daikin make Air Conditioning Units Installed in the buildings of the High Court (Main building and Annexe building) of Andhra Pradesh, Nelapadu, Amaravati,for the period of 1 Year"– Estimate Cost Rs.79,50,000/-
The bid can be downloaded on AP e-procurement portal from 29.08.2025 to 02.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 02.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 02.09.2025 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA, Vijayawada.


# ఖమ్మం జిల్లాలో దంచి కొట్టిన వర్షం

### రహదారులు జలమయం.. పొంగిన చెరువులు, కుంటలు.. స్తంభించిన ప్రజాజీవనం
### అధికార యంత్రాంగంగా అప్రమత్తంగా ఉండాలని
### మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు



**ఖమ్మం, ప్రభాతవార్త బ్యూరో:** రెండు రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వర్షం దంచి కొట్టింది.ఫలితంగా ప్రజాజీవనం స్తంభించింది.చెరువులు,వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి.సత్తుపల్లి లో ఎన్నడూ కురవనంత 75 మిల్లి మీటర్ల వర్ష పాతం నమోదవ్వడంతోఆప్రాంత ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రాలేక పోయారు. జలాశయాలన్ని నిండుకుండాల తలపిస్తున్నాయి. ఇల్లందు, మణుగూరు, కొయ్యగూడెం, సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ గనుల్లో 2 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది.ఓపెన్ కాస్ట్ గనులో 5.25 లక్షల వేల క్యూబిక్ మీటర్ల మట్టిదిబ్బ పనులకు ఆటంకం ఏర్పడింది.ఖమ్మంను అనుకుని ప్రవహిస్తున్న మున్నేరు నది నిలకడగా ఉంది.భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37 అడుగులకు చేరింది.రాత్రికి మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్ట్ నిండి పోవడంతో నీళ్లను కిందికి విడుదల చేస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్,ఎయిడెడ్ స్కూళ్లకు, కాలేజ్ లకు సెలవు ప్రకటించారు. ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దూరిశెట్టి,జితేష్ త్రిపాఠి, ఖమ్మం సిపి సునీల్ దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ వరద ప్రవహిత ప్రాంతాల్లో పర్యటిస్తూ...ప్రమాదకరంగా పొంగుతున్న వాగులు,చెరువుల వద్ద పోలీస్ పహారా ను ఏర్పాటు చేశారు.తీవ్ర వర్ష ప్రభావం ఉన్నందున ప్రజలు ఎవ్వరూ ఇండ్లలో నుంచి బయటకు రావొద్దని వారు సూచించారు. జిల్లాలో 8.9 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా,సత్తుపల్లి మండలంలో 17.5,ఖమ్మం రూరల్ లో 12.6,చింతకాని లో 12.4,కొనిజర్ల లో 12 సెంటిమీటర్ల వర్షం కురిసింది.సత్తుపల్లి లోని రాజీవ్ నగర్ రోడ్డు కు వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిపివేశారు. కృష్టరం,యాతాల కుంట గ్రామాల మధ్య వరదల వల్ల రహదారులు మూసివేశారు.అడవిలో నుంచి రోడ్డుపైకి నీరు ఉధృతంగా ప్రవహించడంతో కాకర్లపల్లి రోడ్డు జలమయమైంది. సత్తుపల్లి సమీపంలోని నేషనల్ హైవే పైన 2 అడుగులపై నీరు ప్రవహిస్తుండటంతో పోలీసులు పహారా కాస్తూ,వాహనాల ను నిలిపివేశారు.తల్లడ సమీపంలోని బిల్లుపాడు,రామచంద్ర పురం,వెంగన్న పేట,నూతనకల్లు గ్రామాల మధ్య వాగులు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. ఏన్కూరు మండలం రెపల్లెవాడ,నాచారం గ్రామాల మధ్య పగిడేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.వైరా మండలం హాసనాగుర్తి, ప్రొద్దు టూరు, పాలడుగు,వల్లపురాం గ్రామాల మధ్య ...చింత కాని మండలం ఖమ్మం,బోనకల్ రహదారిపై రామకృష్ణ పురం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే బోనకల్లు మండలం పెద్ద వీరవెల్లి,చిన్న వీరవెల్లి గ్రామాల మధ్య పెద్ద వాగు ఉధృతం గా ప్రవహిస్తోంది.తక్కెళ్ల పాడు,బనిగండ్ల పాడు గ్రామాల మధ్య వాగు ఉధృతికి రాకపోకలు నిలిచి పోయాయి. రఘునాథ పాలెం మండలం పాపాటపల్లి, విఆర్ బంజారా గ్రామాల మధ్య ఉన్న బుగ్గవాగు పొంగి ప్రవహిస్తోంది.

**అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు**

భారీ వర్షాల నేపథ్యంలో సెలవుల్లో ఉన్న ఉద్యోగులు తక్షణమే తమ విధుల్లో జాయిన్ అవ్వాలని ఎవరికి సెలవులు ఇవ్వొద్దని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల, ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చూడాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లా ల కలెక్టర్ల ను ఆదేశించారు. అలాగే చెరువులు,వాగులకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని మంత్రులు సూచించారు.

వార్త


నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్నవాడిగా ఎప్పుడూ ప్రవర్తించకు.

-రోజర్

# విస్తరిస్తున్న వికృత క్రీడ!

ర్యాగింగ్‌ను నిరోధించేందుకు చట్టాలు చేసి,కఠిన చర్యలు తీసుకుంటున్నామని పాలక పెద్దలు ఎంతగా చెప్తున్నా వాటిని పూర్తిగా నిరోధించలేక పోతున్నాయి. తాత్కాలికంగా తగ్గినట్లు కన్పించినా ఈ రాక్షస క్రీడకు శాశ్వతంగా మంగళం పాడలేకపోతున్నారు. ఈ ర్యాగింగ్‌లతో బాధిత విద్యార్థులు కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అలాంటి సమయంలో అధికారులు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఆ తర్వాత యధావిధిగానే మరిచిపోతున్నారు. ఫలితంగా ఈ ర్యాగింగ్ పైకి తగ్గినట్లు కన్పించినా చాపకింద నీరులా విస్తరిస్తూనేఉంది. చాలా మంది విద్యార్థులు ఈ ర్యాగింగ్‌లతో తీవ్ర ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నా భయపడి బయటకు చెప్పలేకపోతున్నారు. కొన్ని కాలేజీల్లో యాజమాన్యాలకు తెలిసినా చర్యలు తీసుకోలేని నిస్సహాయక పరిస్థితుల్లో ఉన్నారు. బాధిత విద్యార్థులు ధైర్యం చేసి తల్లిదండ్రులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే ఇవి వెలుగు చూస్తున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లాలో జూనియర్‌పై ఐదుగురు సీనియర్లు,ర్యాగింగ్ చేసిన ఉదంతం వెలుగు చూసింది. అర్థరాత్రి వైద్యకళాశాల హాస్టల్‌కు పిలిపించి ఆ విద్యార్థిని బెదిరించి ర్యాగింగ్ చేశారు. భయభ్రాంతులకు గురైన ఆ విద్యార్థి నిజామాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సంఘటన వెలుగు చూడడంతో కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సోమవారం విచారణ జరిపి పోలీసు నివేదిక ఆధారంగా ఐదుగురు సీనియర్ విద్యార్థులపై ఆరు నెలల పాటు సస్పెన్షన్ విధించింది. వారికి కళాశాల హాస్టల్ సదుపాయాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవంగా ప్రతి కాలేజీలోనూ ఈ ర్యాగింగ్ నిరోధించేందుకు కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పటిష్టమైన నిఘా వేసి ర్యాగింగ్ జరగకముందే పసిగట్టి చర్యలు తీసుకోవాల్సిన కమిటీలు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లిన తర్వాత కానీ చర్యలకు ఉపక్రమించలేకపోతున్నారు. అంతకుముందు గతంలో నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటన కూడా ఇందుకు అద్దం పడుతున్నది. పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాతనే ఆ సంఘటన కూడా వెలుగు చూసింది. తనను గదిలోకి పిలిపించి దాదాపు రెండుగంటలకుపైగా మోకాళ్లపై కూర్చోబెట్టి బట్టలు విప్పించి సెల్‌ఫోన్‌లో వీడియో తీశారని, గుండు గీసేందుకు కూడా ప్రయత్నించారని బాధిత విద్యార్థి ఆరోపించాడు. వాష్‌రూమ్ పేరుతో సీనియర్ల నుండి తప్పించుకొని జరిగిన అవమానాన్ని తన తండ్రికి ఫోన్ ద్వారా చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి కాపాడినట్లు ఆ విద్యార్థి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆలస్యంగా స్పందించిన పాలకపెద్దలు విచారణకు ఆదేశించి కారకులైన ఆరుగురు విద్యార్థులను యేడాదిపాటు కాలేజీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు.వారికి శాశ్వతంగా హాస్టల్‌లో వసతి ఇవ్వకూడదని కూడా నిర్ణయించారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పుడు కేసులు నమోదు చేయడం కొంతమేరకు చర్యలు తీసుకుంటున్నందువల్లనే ర్యాగింగ్ తగ్గుముఖం పట్టిన మాట వాస్తవమే కావొచ్చు. కానీ ఇది పూర్తిగా సమిసిపోలేదు. కొత్తగా అడుగుపెట్టిన వారికి బెరుకు, భయం పోగొట్టి పరిచయం చేసుకునే వినోద కార్యక్రమం కొందరి విద్యార్థుల కారణంగాప్రాణాంతక వికృతకేళిగా మారిపోయింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తి చేసుకొనిఎంతో భవిష్యత్‌ను ఊహించుకుంటూ ప్రొఫెషనల్ కాలేజీల్లో అడుగుపెట్టే విద్యార్థులు ఎదురయ్యే అవమానాలు భరించలేక కొందరు తమలోతాము కుమిలిపోతుండగా మరి కొందరు అర్థాంతరంగా ఏకంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. అశ్లీలసాహిత్యం,నీలిచిత్రాలు,మత్తుపదార్థాలు,మద్యం, ఇతర బలహీనతలు కూడా ఈ సంస్కృతిని మరింతగా రెచ్చగొడుతున్నాయి. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా వీరుచేస్తున్న ఈ ర్యాగింగ్‌ను సున్నిత మనస్కులు తట్టుకోలేకపోతున్నారు. ఈ ర్యాగింగ్ క్రీడకు వెరసి కొందరు ఏకంగా విద్యాభ్యాసానికే స్వస్తి చెప్పిన సంఘటనలు కూడా ఉన్నాయి. మొత్తం మీద రాష్ట్రంలోనేకాక దేశవ్యాప్తంగా ఈ ర్యాగింగ్ శృతి మించడంతో ఉన్నతస్థాయిలో ఆనాడే చర్చలు జరిగాయి. దీన్ని ఆపకపోతే మరిన్ని పసిప్రాణాలు బలయ్యే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఈ దశలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కలిగించుకొని ర్యాగింగ్ నిరోధక చర్యలు చేపట్టాల్సిందిగా ప్రొఫెషనల్ విద్యాసంస్థలకు, విద్యాలయాలకు లేఖలురాసింది. ఆ మేరకు 1997లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రమైన చట్టానికి రూపకల్పన చేసింది. 1997 మార్చి 18న రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ర్యాగింగ్ చట్టం ప్రకారం వేధింపులకు గురిచేస్తే తీవ్రమైన శిక్షలు ఖరారు చేశారు.అయినా ఈ రాక్షసక్రీడ చాపకింద నీరులా కొనసాగుతూనే ఉన్నది. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డ కళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలైపోతే ఆ గర్భశోకం వర్ణనాతీతం. ముఖ్యంగా ర్యాగింగ్ చేసేటప్పుడు ప్రత్యక్ష సాక్షులు ఉండే అవకాశం లేదు. ఉన్నా వారు న్యాయస్థానాల ముందుకు వచ్చి సాక్ష్యాలు చెప్పడానికి ఇష్టపడరు. అందువల్ల కోర్టుల్లో రుజువు కాదనే ధైర్యంతో ఇలాంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఈ విషయంలో పాలకపెద్దలు న్యాయనిపుణులతో మరింత లోతుగా చర్చించి చట్టానికి మరింత పదును పెట్టాలి. ఈ జాడ్యం విద్యార్థుల జీవితాలను కబళించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనాశక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.



వి.జాన్సన్

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్


# బీటలు వారుతున్న తెలుగు భాషా వైభవం

**తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికే తప్పమరే ఇతర అవసరాలకు పనికి రాకుండాపోవడానికి మనం మన భాషపట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే కారణమవుతున్న సంగతిని విస్మ రించరాదు. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలోని పలు దేశాల్లో మాతృభాషలు అంతరించిపోతున్నాయి. భారత దేశంలో జాతీయ భాష హిందీతో పాటు పలు ప్రాంతీయ భాషలు మనుగడలో ఉన్నాయి. అయితే ఆంగ్ల భాషపట్ల మక్కువతో పలు ప్రాంతీయ భాషలు తిరస్కరణకు గురౌతున్నాయి.శతాబ్దాల చరిత్రగల చక్కనైన తెలుగు భాష ఆంగ్ల భాషా వికాసంతో వెలవెలబోతున్నది. తెలుగు భాష మాట్లాడడం తెలుగు వారికి నామోషీగా మారడం దురదృష్టకరం. అందమైన అక్షరాలతో, మల్లెతీగలా మనసుకు హత్తుకుని, అల్లుకుపోయే మృదు మధురమైన తెలుగు భాషా పరిమళాన్ని ఆస్వాదించలేకపోవడం దురదృష్టకరం. తెలుగు భాష మన మాతృభాష అని చెప్పుకోవడంలోనే తెలుగు వారి గౌరవం వికసిస్తుంది. ఈ సత్యాన్ని మరచి, మన భాషను మనమే చిన్నబుచ్చడం, అవహేళన చేయడం కుసంస్కారం.**



సుంకవల్లి సత్తిరాజు

ప్రజల మధ్య సంబంధాలు నెలకొల్పడానికి, వారి సంస్కృతీ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను అవగతం చేసుకోవడానికి అవసరమైన భావ వ్యక్తీకరణకు వినియోగించే అర్థవంతమైన మాధ్యమాన్ని 'భాష' అని నిర్వచించవచ్చు. భాషలు వివిధ దేశాల,ప్రాంతాల ప్రజల చరిత్రను, గుర్తింపును విశ్వ వ్యాప్తం చేస్తాయి. తమ చరిత్రను విస్తరింపచేయడానికి,వివిధ ప్రాంతాల ప్రజలతో సాన్నిహిత్యం పెంపొందించుకోవడానికి,తమ వారసత్వ ఔన్నత్యాన్ని ప్రపంచం నలుదిశలకు చాటి చెప్పడానికి ప్రతీ భాషకు లిపి అవసరం. లిపి లేని భాషలను గ్రంథస్థం చేయలేము కనుక, కాలక్రమంలో అలాంటి భాషలు కనుమరుగుకాక తప్పదు. దురదృష్టవశాత్తూ ప్రపంచంలో అతికొద్ది భాషలు మాత్రమే ప్రజలు విరివిగా ఉపయోగిస్తున్నారు. ఆంగ్లం, మాండరిన్ చైనీస్,హిందీ,స్పానిష్,ఫ్రెంచ్ వంటి భాషలు ప్రపంచంలో అధికసంఖ్యాక ప్రజలు మాట్లాడుతున్నారు. భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో భిన్నమైన భాషలు మాట్లాడే ప్రజలున్నారు. అయితే ఆంగ్లభాష ప్రపంచాన్ని శాసిస్తున్న వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో భారత దేశంలో కూడా పలు ప్రాంతీయ భాషలు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. అందులో తెలుగు భాష ఒకటి. తెలుగుభాష రాయడం నేటితరం ఇప్పటికే మరచిపోయింది. తెలుగు భాష మాట్లాడంలో కూడా ఆంగ్ల భాషను మిళితం చేస్తున్నారు. పర భాషా సంగమంతో మిశ్రమంగా మారిన తెలుగు భాష తన స్వచ్ఛతను కోల్పోతున్నది.ఆంగ్లం మాట్లాడితేనే తమ స్థాయి పెరుగుతుందనే మూర్ఖ భావజాలం వ్యాపించడం దురదృష్టకరం. తెలుగు మాట్లాడే వ్యక్తులు కూడా తెలుగు భాష పట్ల అయిష్టత ప్రదర్శించడం ఆంగ్ల భాషకు అగ్రతాంబూలమివ్వడం దేనికి సంకేతం? మారుతున్న కాలానికనుగుణంగా ఆంగ్లాన్ని నేర్చుకోవడం తప్పని సరి. విద్యా, ఉద్యోగ సంబంధిత వ్యవహారాల్లో ఆంగ్ల భాష ప్రాధాన్యతను విస్మరించలేం. అయితే ఇంట్లో కూడా ఆంగ్ల భాషలోనే మాట్లాడుకోవడం, తమ పిల్లలు కూడా ఆంగ్లంలో మాట్లాడితే ఆనందపరవశులు కావడం మరీ విడ్డూరం. నగరాల్లోనే కాదు కుగ్రామాల్లో కూడా తెలుగు భాషా వికాసం మోడు వారిపోతున్న విషయం తెలుగు భాషాప్రియులకు ఆశనిపాతం. ఆంగ్ల భాషా వ్యామోహం అమృతతుల్యమైన, అత్యంత అర్థవంతమైన తెలుగు భాషను క్షీణింప చేయడం బాధాకరం. అందమైన అక్షరాల పొందికతో అత్యద్భుతంగా రూపకల్పన చేయబడ్డ రమణీయమైన ప్రాచీన భాషతెలుగు. క్రీ.పూ 400 సంవత్సరాల క్రితమే తెలుగు భాష మనుగడలో ఉన్నట్టుగా అనేక శిలాశాసనాలు తేటతెల్లం చేస్తున్నాయి. తెలుగు భాషలో ఎన్నో మండలికాలు,యాసలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది భాషలు సజీవంగా ఉన్నప్పటికీ, కేవలం కొన్ని వందల భాషలకు మాత్రమే లిపి ఉన్నది. ఎన్నో భాషలు అంతరించిపోయాయి. మరెన్నో భాషలు కేవలం మాట్లాడుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతూ, లిపి లేకుండా పోయాయి. ఇంకొన్ని భాషలు అంతరించడానికి అతి దగ్గరలో ఉన్నాయి.మన భారతదేశంవిభిన్న భాషలకు నిలయం. భాషా వైవిధ్యంగల భారతీయ సమాజంలో కొన్ని రాష్ట్రాల్లోని భాషలు వాటికున్న ప్రాచీన చారిత్రక నేపథ్యం ఆధారంగా ప్రాచీన హోదా సంపాదించాయి. అందులో తెలుగు భాష ఒకటి. తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కడంలో ఆలస్యమైనా తుదకు ఆ మైలు రాయిని కూడా అధిగమించి,అనుకున్న లక్ష్యం సాధించడంలో సఫలీకృతమైనది. తెలుగు ప్రజలు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ, వేర్వేరు యాసల్లోభాషను వినియోగిస్తూ, భావాన్ని వ్యక్తీకరిస్తున్నప్పటికీ, వారంతా తెలుగు భాష మాట్లాడే




ప్రజలే. ప్రాంతాలు వేరైనా తెలుగు వారంతా ఒక్కటే. తెలుగు భాషకున్న వైభవం చరిత్ర చాటి చెబుతున్నది. త్రిలింగ అనే పదం నుండి 'తెలుగు' ఏర్పడిందని పరిశోధకుల అంచనా. కొన్ని ప్రాచీన గ్రంథాల్లో తెలుగు పదాలు ఉన్నట్టు అంచనా. శాతవాహనులకు ముందునుంచే తెలుగు ఉనికిలో ఉందని, కృష్ణ,గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు తెలుగు మాట్లాడే వారని కొంతమంది అభిప్రాయం. 11వ శతాబ్ధంలో తెలుగు ముద్రితమైనదని కొందరు, తెలుగు భాష 2400 సంవత్సరాల క్రిందటే అస్థిత్వంలో ఉందని మరికొందరు చెబుతారు. ఏది ఏమైనప్పటికీ తెలుగు భాషకు అత్యంత ప్రాచీన చరిత్ర, వైభవం ఉన్న మాట వాస్తవం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికార భాషగా చెలామణీ అవుతూ, హిందీ,బెంగాలీ వంటి భాషల సరసన ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో మాట్లాడే భాషగా తెలుగు భాష ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇతర దేశాల్లోని తెలుగు వారు తెలుగును గౌరవిస్తుంటే, తెలుగునేలపై తెలుగు అపహాస్యానికి గురౌతున్నది. తెలుగు మాట్లాడడం నేరమన్న భావన ప్రబలడం హాస్యాస్పదం. మాతృభాషను గౌరవించడం మన కర్తవ్యం. తెలుగు భాషా పరిరక్షణ ప్రతీ తెలుగు వాడి బాధ్యత. తెలుగుదనాన్ని ఆస్వాదించకుండా కేవలం ఆంగ్లాన్ని నెత్తిన పెట్టుకుని ఆరాధించడం భావ దారిద్ర్యం అనక తప్పదు. భారతదేశం గుర్తించిన ఆరు ప్రాచీన భాషల్లో తెలుగు కూడా ఒకటి. కన్నడ, ఒడియా, మలయాళం, సంస్కృతం వంటి భాషలతో పాటు తెలుగు అత్యంత ప్రాచీన భాషగా గుర్తింపబడింది. రాబోవు కొద్ది కాలంలో మన దేశంలో హిందీ, మళయాళం, తమిళం, బెంగాలీ వంటి కొద్దిభాషలు మాత్రమే మిగులుతాయి.తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికే తప్పమరే ఇతర అవసరాలకు పనికి రాకుండాపోవడానికి మనం మన భాష పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే కారణమవుతున్న సంగతిని విస్మరించరాదు. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలోని పలు దేశాల్లో మాతృభాషలు అంతరించిపోతున్నాయి. భారత దేశంలో జాతీయ భాష హిందీతో పాటు పలు ప్రాంతీయ భాషలు మనుగడలో ఉన్నాయి. అయితే ఆంగ్ల భాష పట్ల మక్కువతో పలు ప్రాంతీయ భాషలు తిరస్కరణకు గురౌతున్నాయి.శతాబ్దాల చరిత్రగల చక్కనైన తెలుగు భాష ఆంగ్ల భాషా వికాసంతో వెలవెలబోతున్నది. తెలుగు భాష మాట్లాడడం తెలుగు వారికి నామోషీగా మారడం దురదృష్టకరం. అందమైన అక్షరాలతో, మల్లెతీగలా మనసుకు హత్తుకుని, అల్లుకుపోయే మృదు మధురమైన తెలుగు భాషా పరిమళాన్ని ఆస్వాదించలేకపోవడం దురదృష్టకరం. తెలుగు భాష మన మాతృభాష అని చెప్పుకోవడంలోనే తెలుగు వారి గౌరవం వికసిస్తుంది. ఈ సత్యాన్ని మరచి, మన భాషను మనమే చిన్న బుచ్చడం,అవహేళన చేయడం కుసంస్కారం. తెలుగు భాష చాలా ప్రాచీనమైనదైనప్పటికీ తెలుగులో పురాణేతిహాసాలు ,పాఠ్యాంశాలు గ్రాంథిక భాషలో లిఖించడం వలన అవి సామాన్య జనవాహినికి చదవడానికి కష్టసాధ్యంగా ఉండేవి. కవివర్యులకు, రచయితలకు మాత్రమే గ్రాంథిక భాష సౌలభ్యంగా ఉండేది. ఇలాంటి అర్థం కాని సంస్కృత పదాలతో, పద్యాలతో కొరకరాని కొయ్యగామారి, తెలుగు జనాలకు దూరమౌతున్న తెలుగును సామాన్యులకు, విద్యార్థులకు అర్థవంతమైన పద్ధతిలోవ్యవహారిక శైలిలో రూపొందించి, తెలుగుభాషను తెలుగు హృదయాలకు చేరువ చేయాలన్న తపనతో విశేష కృషి చేసిన గిడుగురామ్మూర్తి తెలుగు భాషాభిమానులకు అత్యంత ప్రీతిపాత్రుడు.'గిడుగు' తెలుగు వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషకు గొడుగు పట్టింది. తెలుగు ప్రజలకు చేరువైనది. గ్రామీణ నేపథ్యం గల తెలుగు జనాలకు సైతం తెలుగు వ్యావహారిక భాష అమృతతుల్యంలా అగుపించింది. తెలుగు భాషను వ్యావహారిక శైలిలో తెలుగు ప్రజలకు చేరువకావడానికి గిడుగు వేంకట రామ్మూర్తి చేసిన అనితర సాధ్యమైన, అనిర్వచనీయమైన సేవలకు గుర్తింపుగా ఆయన జయంతి ఆగష్టు 29వ తేదీని "తెలుగు భాషాదినోత్సవం"గా జరుపుకోవడం గిడుగు వారి పట్ల తెలుగు వారికున్న అపారమైన గౌరవానికి నిదర్శనం. అయితే నేటితరం తెలుగు భాష పట్ల చూపుతున్న నిర్లక్ష్యం, నిర్లిప్తత తెలుగు జాతి ప్రాచీన వారసత్వ ఔన్నత్యానికి గొడ్డలిపెట్టు.ఆంగ్ల భాషను అభ్యసించడం అవసరం. అంతర్జాతీయ భాషగా ఉద్యోగావకాశాలకు అనుగుణంగా ఆంగ్లభాషను నేర్చుకుంటూనే,తెలుగు భాషనుకూడా కొనసాగించాలి. తెలుగు ఖ్యాతిని ఇనుమడింప చేయాలి. ●

# ఉద్యోగాల కల్పనలో ఇక ఎఐదే కీలకపాత్ర

ఎస్.సీతారామయ్య

దేశంలో రానున్నకాలంలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇది వరకు డిగ్రీలుంటే కానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా,ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి. దేశంలో ఎఐ(కృత్రిమ మేధ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88శాతంవరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతున్నాయి. ఉత్పాదక ఆధారిత ఎఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత్ దేశాలు ముందుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఎఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఎఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఎఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు. ఎఐ నైపుణ్యానికి సంబంధించి దేశంలో 67 కంపెనీలు కొత్త విచిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్లుఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి.ఎఐ, రోబోటిక్స్,ఎనర్జీ టెక్నాలజీ వంటిరంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దేశంలో బిగ్ డేటా, ఎఐ, మెషిన్లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10మిలియన్ వరకు రెట్టింపు చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5మిలియన్ వరకే సాధించగలమని ఆయా రంగ నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం ఎఐ విస్తరించడంవల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే. ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తోంది. ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్,ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలుపారిశ్రామిక, వాణిజ్యసంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టంకడుతున్నారు. ఎఐ, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఉద్యోగాల నియామక ప్రక్రియలను క్రమబద్ధంచేస్తున్నాయి. ఈ మార్పులు,అత్యంత విలువైన సాంకేతిక సేవలు,నూతన ఆవిష్కరణలవైపు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనేఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి.ఈమేరకు ఉద్యోగ అవ కాశాలు 80శాతంవరకు సాంకేతిక నిపుణులతో 2025-26 నాటికి 20వరకు పెరుగుతాయని ఐటి రంగవర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150బిలియన్ డాలర్ల వరకుఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనావేస్తున్నారు.జనరేటివ్ ఎఐ వంటిసాంకేతికతలే ఐటిరంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్తఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికలవల్ల తెలుస్తోంది. ●

# అణుబాంబు నీడలో మానవ జీవితం!



రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ చరిత్రలో అణుశక్తి మానవ మేధస్సు ఆవిష్కరణకు ప్రతీకగా నిలిచినప్పటికీ, అదేశక్తి మానవ నాగరికతను నాశనం చేసే భయంకర శక్తిగా కూడా పరిణమించింది. ప్రపంచ శాంతి, మానవ రక్షణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలు నేటి యుగంలో అత్యంతప్రాధాన్యం సంతరించుకున్నాయి. అణు ఆయుధాలు మానవజాతికి శక్తి, ఆధిపత్యం, సాంకేతిక ప్రగతి చిహ్నాలుగా భావించబడినా వాటి విధ్వంసకర శక్తి ప్రపంచాన్ని పునరావృతంగా ఆలోచించేలా చేస్తోంది. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 29న అంతర్జాతీయ అణుపరీక్షల వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటారు. 1991లో కజిఖిస్తాన్‌లోని సెమిపాలటిన్స్క్ అణు పరీక్షా క్షేత్రం మూతపడిన రోజు గుర్తింపుగా ఐక్యరాజ్య సమితి 2009 డిసెంబర్ 2న తీర్మానం ఆమోదించి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ నిర్ణయం అణు పరీక్షలు మానవ జాతిపై మోపిన విపరీతమైన దుష్పరిణామాలను స్మరింపజేయడమే కాక భవిష్యత్తులో అణు ముప్పులను నివారించే ప్రయత్నాలకు ఒక బలమైన ఆహ్వానం. ప్రపంచ చరిత్రలో అణు పరీక్షల మొదటి దృశ్యం 1945 జూలై 16న అమెరికా న్యూ మెక్సికోలోని అలమోగోర్డోలో ట్రినిటీ పేరిట జరిగిన ప్రయోగమే. తరువాత అదే సంవత్సరం జపాన్‌పై హిరోషిమా, నాగసాకిపై అణు బాంబులు ప్రయోగించబడినప్పుడు ప్రపంచం అణుశక్తి భయానకతను ప్రత్యక్షంగా చూచింది. ఆ ఘోర వినాశనం లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నదే కాక తరతరాల పాటు ఆప్రాంతాల్లో వికలాంగత్వం, కేన్సర్లు, పర్యావరణ కాలుష్యం వంటి అపరిమిత కష్టాలను మిగిల్చింది. ఆ తర్వాత అమెరికా, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా తదితర దేశాలు యుద్ధ కాలంలో ఆధిపత్య పోరులో భాగంగా వందలాది అణు పరీక్షలు జరిపాయి. ఈ పరీక్షలు కేవలం ఎడారులు, సముద్రాలు, భూమి గర్భానికే పరిమితం కాలేదు, వాటి ప్రభావం వాతావరణంలో రేడియోధార్మిక కణాలుగా వ్యాప్తి చెంది మానవ ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రెండు వేలకి పైగా అణుపరీక్షలు జరిగాయి. వీటిలో అమెరికా 1,030,సోవియట్ యూనియన్ 715, ఫ్రాన్స్ 210,బ్రిటన్ 45, చైనా 45, భారత్ 6, పాకిస్థాన్ 6, ఉత్తర కొరియా 6 పరీక్షలు జరిపాయి. ప్రతి పరీక్ష వాతావరణంలో విష రసాయనాలు, రేడియేషన్ విడుదల చేస్తూ జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురిచేసింది. సంవత్సరాలుగా అణు పరీక్షల వ్యతిరేకంగా ప్రజల నిరసనలు ఉధృతమయ్యాయి. జపాన్‌లో అణుబాంబు బాధితులు, శాంతి కార్యకర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపారు. ఈనేపథ్యంలో 1963లో



అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లు పాక్షిక అణు పరీక్షా నిషేధ ఒప్పందంపై సంతకం చేసి భూమి మీద, వాతావరణంలో, నీటిలో పరీక్షలను నిషేధించాయి. అయితే భూగర్భ పరీక్షలకు మాత్రం అవకాశం ఇచ్చారు.తదనంతరం 1996లో సమగ్ర అణుపరీక్షా నిషేధ ఒప్పందంరూపొందినా అది అమల్లోకి రాలేదు. ఎందుకంటే అణు శక్తివంతమైన కొన్ని దేశాలు దానిని ఆమోదించలేదు. అయినప్పటికీ, ఆ ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో అణు నియంత్రణకు ఒక ప్రధాన పునాది వేసింది.భారతదేశం 1974లో స్మైలింగ్ బుద్ధా పేరిట మొదటి అణుపరీక్ష,1998లో పోఖ్రాన్ పేరిట ఐదు అణుపరీక్షలు నిర్వహించింది.అయితే భారత్ ఎల్లప్పుడూ ప్రథమంగా అణ్వస్త్ర వినియోగం చేయమని స్పష్టంగా ప్రకటించింది. ఈ విధానం ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తుంది. అణు పరీక్షల ప్రభావం మానవ జీవితంలోఅనేక కోణాలలో ప్రతిఫలించింది. భూగర్భ పరీక్షల వల్ల భూకంపాలు, భూగర్భ జలాలకలుషితం, నేల పాడైపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సముద్ర పరీక్షలు సముద్ర జీవ సంపదపై ఘోర ప్రభావం చూపాయి.వాతావరణంలో వ్యాపించిన రేడియోధార్మిక కణాలు ఆహార శ్రేణిలోకి చేరి తరతరాలపాటు జన్యు వ్యాధులను సృష్టించాయి. వైద్యపరమైన పరిశోధనల ప్రకారం అణుపరీక్షల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలలో కేన్సర్, ల్యూకేమియా, థైరాయిడ్ వ్యాధులు అధికంగా కనిపించాయి. కజిఖస్తాన్‌లోని సెమిపాలటిక్స్ ప్రాంతం, పసిఫిక్ మహాసముద్రంలోని బికినీ అటోల్ దీవులు,నెవాడా ఎడారి లాంటిప్రాంతాలు ఈ విషాదానికి సాక్ష్యాలుగా నిలిచాయి. అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం నేడుమనిషి అనుభవించిన దుర్ఘటనల జ్ఞాపకమే కాక భవిష్యత్తుపట్ల మానవజాతికి ఒక హెచ్చరిక. ఈ రోజు దేశాలు పరస్పరం నమ్మకం పెంపొందించుకొని, ఆయుధ పోటీకి బదులుగా శాంతి సహకారం వైపు నడవాలని గుర్తుచేస్తుంది. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ శాంతి సంస్థలు, శాస్త్రవేత్తలు,పౌరసమాజం అన్నివర్గాలు ఈ రోజునాడు అణు పరీక్షల ముప్పును సవివరంగా చర్చించి ప్రత్యామ్నాయ భద్రతా మార్గాలను అన్వేషిస్తాయి. అణు నిరాయుధీకరణ దిశగా వియన్నా, జెనీవా వంటి నగరాల్లో అనేక చర్చలు జరుగుతాయి.ఇది కేవలం ప్రభుత్వాలకే కాక సాధారణ పౌరులకూ శాంతి పట్ల బాధ్య తను గుర్తు చేసే రోజు. అణుశక్తిశాంతి ప్రయోజనాలకోసం ఉపయోగపడే శక్తివంతమైన సాధనం కావచ్చు.విద్యుత్ ఉత్పత్తి, వైద్యరంగం, వ్యవసాయం వంటి రంగాల్లో అది సద్వినియోగం అవుతుంది. కానీ దాన్ని ఆయుధాలుగా వినియోగించడం మానవ జాతికి అస్తిత్వపరమైన ముప్పు.అందుకే అంతర్జాతీయ సమాజం అణు నిరాయుధీకరణ పట్ల కట్టుబాటుగా ఉండి అణు పరీక్షలు జరపకుండా నిబద్ధతతో ముందుకు సాగాలి.భవిష్యత్తు తరాలకు ఒక సురక్షితమైన, శాంతియుతమైన ప్రపంచాన్ని అందించాలంటే అణు ఆయుధాల రహిత భూగోళాన్ని సాధించడానికి ప్రయత్నాలు ఆగ కూడదు. మానవ జీవన విలువను కాపాడటం, ప్రకృతి సమతుల్యతను పరి రక్షించడం, శాంతిని నిలబెట్టడం అనే మూడు లక్ష్యాల కోసం ఈరోజుమానవ జాతి ఒకటిగా నిలబడి ఆత్మ పరిశీలన చేయాలి. ●

# ప్రజావాక్కు



## అన్యమతస్థుల ప్రవేశం

ఇటీవల కేరళలోని ప్రసిద్ధ గురువాయూర్ శ్రీకృష్ణ దేవాలయ కోనేరులో జాస్మిన్ జప్ఫర్ అనే అన్యమతస్థురాలు కాళ్లు కడుగుతూ వీడియో రీల్స్ చిత్రీకరించటం ఘోరమైన తప్పిదం. గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయంలోకి హిందువులకు తప్ప ఇతర మతస్థులకు ప్రవేశం లేదు. గురువాయూర్ దేవస్థానం కట్టుబాట్లను అతిక్రమించిన సదరుయువతిపై కోనేరును అపవిత్రం చేసిందని పోలీసులకు ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారు.కేరళ హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఆలయప్రాంగణంలోకి ఇతర మతాన్నిఆచరించే ఆ యువతి ఫొటోలు,వీడియోలు చిత్రీ కరించటం ఆలయ మర్యాదలను దెబ్బతీసే దురుద్దేశ ప్రయత్నంగా చెప్పవచ్చు. దేవాలయంలోకి అన్యమత స్థులకు ప్రవేశంలేనప్పుడు హిందువులు కాని వారువచ్చి వీడియోలు తీసుకోవటం ప్రతి హిందువు ఖండించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## విద్యార్థుల కిరాతకం

ఇటీవల ఏపిలో ఒక ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిపై సహచర విద్యార్థులు తోటి దళిత విద్యార్థిపైవ్యవహరించిన తీరువారి రాక్షసతత్వాన్ని, నిర్భయత్వాన్ని తెలుపుచున్నది.వారు పిల్లలా లేక రౌడీల అనిపిస్తోంది.ఆ విధమైన పనులు వారు ఎక్కడ చూస్తున్నారో ఆశ్చర్యం వాటిని ఆ చిన్న వయస్సులో ఎలా చేస్తున్నారో భయం కలుగుతోంది. ఉత్తమ బోధన, సదుపాయాలతో పాటువారి క్రమశిక్షణ,తీరుతెన్నులు వారుభవిష్యత్ రాణింపునకు మూలమవుతుంది. ఈ విషయం అధ్యాపకులు వారిపై నిఘాఉంచాలి.చిన్న విషయమైన యాజమాన్యానికి తెలియచేయాలి. లేనిచోట కొందరు ఉపాధ్యాయులపై కూడా తిరగబడే సంఘటనలు జరిగాయి.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## గ్రామీణ రహదారులకి మోక్షం ఎప్పుడు?

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాహదారులను పట్టించుకోకపోవడంతో పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండల పరిధిలోనిఊరదాళ్ళపాలెం గ్రామ ప్రధానరహదారి మీదుగా రహదారులు అధ్వాన్నంగా మారడంతోఏళ్ల తరబడి గుంతలు, తేలాడిన కంకరపై వాహనదారులు ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

- డి.వెంకటరెడ్డి, ప.గో జిల్లా

## సాంకేతికతతో పెరుగుతున్న నేర ప్రవృత్తి

ప్రపంచ వివాహ దినోత్సవం రోజునే ఓ దుర్మార్గపు భర్త అయిదు నెలలగర్భిణిని క్రూరాతి కూరంగా చంపి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికి తీసుకెళ్ళి మూసీ నది ప్రవాహంలో పడవేసి తన భార్య కనిపించడం లేదని అమాయకంగా పోలీసు రిపోర్టు యిచ్చాడు. పోలీసులు తమదైన రీతిలో ఆరా తీయగా నిజాన్ని వెళ్ళగక్కాడు. పురాణాల్లో రాక్షసులు కూడా యింత రాక్షసంగా ప్రవర్తించ లేదేమో. మరొక సంఘటనలలో భార్యలు భర్తలను అనేక నూతన పద్ధతులలో అంతమొందిస్తున్నారు. మొన్న ఒక 14 ఏళ్ళ బాలుడు పక్కింటి 12 ఏళ్ల అమ్మాయిని పదునైన కత్తితో అనేకసార్లు పొడిచి చంపేసాడు. సామాజిక వ్యవస్థలు రానురాను అస్తవ్యస్తం అవుతున్నాయి. పవిత్రమైన బంధాలు కలుషితం అవుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత, పిల్లలకు సెల్‌ఫోన్లకు అలవాటు చేయడం,అందులో వాళ్లేం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించకపోవడంవల్ల నేరప్రవృత్తి పెద్దలలోనూ పిల్లలలోనూ అలవడుతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చెయ్యాలి

కరీంనగర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని, కొద్దిమందికి మాత్రమే ఇస్తామని ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపించేసి లబ్ధిదారులకు ఇవ్వాలి.డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వకపోవడంతోలబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మూలంగా డబుల్ బెడ్ రూమ్ఇండ్లు శిథిలావస్థలోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు చింతకుంట, ఆరెపల్లి, ఎలగందుల ఖాజీపూర్ ఇవ్వాలని కోరారు.

- సింగు లక్ష్మీనారాయణ చింతకుంట, కరీంనగర్

## కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షే

రాష్ట్రాలలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయో అంతకంటే ఎక్కువ చిన్న పెద్దా ఆసుపత్రుల సంఖ్య ఉంది. కార్పొరేట్ హాస్పిటల్స్ అన్నీ ప్రతీరోజు రోగులతో కిటకిటలాడిపోతున్నాయి.ప్రతీ చిన్న నలతకు సవాలక్ష పరీక్షలు చేయించకు రమ్మని డాక్టర్లు రాస్తున్నారు. ఈపరీక్షలు, డాక్టర్ల, ఫీజులు అన్నీకలపి వేలు లక్ష ల్లో బిల్లులు చెల్లించవలసి వస్తోంది. డాక్టర్లు ఎంత బిజీగా ఉన్నారంటే పేషెంట్లతో ఓపిగ్గా మాట్లాడరు. అర నిముషం లోపలే మందుల చీటీ రాసిచ్చి పంపేసారు.

-ఎన్.రామారావు, నల్గొండ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ‘నోబెల్’ కోసం ట్రంప్ స్వయంగా లాబీయింగ్!

## ఆయనను శాంతి దూతగా చిత్రించేందుకు నడుం బిగించిన కేబినెట్ సభ్యులు



**వాషింగ్టన్, ఆగస్టు 28:** ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన కేబినెట్‌సభ్యులు మునుపెన్నడూ లేని విధంగా తీవ్రంగా ప్రయత్నిస్తుండటం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. బహుమతి కోసం ఏకంగా అధ్యక్షుడే రంగంలోకి దిగి బహిరంగంగా లాబీయింగ్ చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్‌లో విజేతను ప్రకటించేందుకు నోబెల్ కమిటీ చర్చలు జరుపుతున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.
ట్రంప్‌ను ఒక శాంతి దూతగా చిత్రీకరించేందుకు ఆయన కేబినెట్ సభ్యులు నడుం బిగించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మాట్లాడుతూ నోబెల్ బహుమతికి మీరే అత్యంత అర్హులైన అభ్యర్థిఅని ట్రంప్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మరోవైపు, లేబర్‌సెక్రటరీ లోరి ఛావేజ్ డి రేమర్ తన కార్యాలయంలో ట్రంప్ భారీ ఫ్లెక్సీని ఏర్పాటుచేసి ఆయనను అమెరికా కార్మికుల కోసం వచ్చిన పరివర్తనాత్మక అధ్యక్షుడని కొనియాడారు. ట్రంప్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించిందని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ పేర్కొన్నారు. ఈ ప్రశంసల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ లాబీయింగ్ మరో స్థాయికి చేరింది అనడానికి ట్రంప్‌స్వయంగా చేసిన ఫోన్ నిదర్శనం. గతనెలలో ఆయన నార్వే ఆర్థిక మంత్రికి ఫోన్ చేసి టారిఫ్ చర్చల మధ్యలో నోబెల్ నామినేషన్ గురించి నేరుగా ప్రస్తావించినట్లు నార్వేజియన్ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ట్రంప్ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ ఘాటుగా స్పందిస్తూ అమెరికన్ పౌరులపై మెరైన్లను ప్రయోగించిన వ్యక్తికి శాంతి బహుమతి ఇవ్వడం సరికాదు. ఆయన దేశానికి శాంతిని కాదు, యుద్ధ వాతావరణాన్ని తెచ్చారని ఆరోపించారు. ఇజ్రాయెల్ జర్నలిస్ట్ గిడియాన్ లేవీ మరో అడుగు ముందుకేసి ట్రంప్ స్థానం నోబెల్ అవార్డు వేదికపై కాదు, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులోనని ఎద్దేవాచేశారు. ఈ విమర్శలకు బలం చేకూరుస్తూ, నార్వే నోబెల్ కమిటీలోని ఐదుగురిలో ముగ్గురు సభ్యులు ట్రంప్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ తన రెండవ సారిపదవీకాలంలో అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు, మీడియాపై వందకు పైగా దాడులు చేశారని కమిటీచైర్మన్ జోర్గెన్ ఫ్రైడ్నెస్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్‌కు శాంతి బహుమతి దక్కే అవకాశాలు దాదాపు లేనట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఒక బహుమతి కోసం అధ్యక్ష పదవిలో ఉన్న వ్యక్తి, ఆయన కేబినెట్ ఇంత బహిరంగంగా లాబీయింగ్ చేయడం మాత్రం చరిత్రలో నిలిచిపోతుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.



# భారత్ సరే అంటే 25 శాతం సుంకాలే!

## రష్యానుంచి చమురు కొనుగోలును నిలిపివేయాలంటున్న అమెరికా

**వాషింగ్టన్, ఆగస్టు 28:** రష్యానుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సుంకాల మోత మోగిస్తున్న అమెరికా తన అక్కసు వెళ్లగక్కింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని శ్వేతసౌధం సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. దీనిని ‘మోడీ యుద్ధంగా’ అభివర్ణించారు. రాయితీపై భారత్ ముడిచమురు కొనుగోలు చేయడమే మాస్కో దూకుడుకు ఆజ్యం పోసిందని ఆయన విమర్శించారు. భారత్ చర్యల వల్ల అమెరికా పన్ను చెల్లింపుదారులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ నిలిపివేస్తే.. అమెరికా విధిస్తున్న సుంకాలను 25శాతం తగ్గించుకోవచ్చని చెప్పారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమలులోకి వచ్చిన నేపథ్యంలో బ్లూమ్‌బెర్గ్ టెలివిజన్‌తో పీటర్ నవారో మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించి ప్రస్తావిస్తూ.. ఇరు దేశాల మధ్య ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే.. భారత్ కూడా అందుకు సహకరించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఒకవేళ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును నిలిపివేస్తే.. 25 శాతం సుంకాలను పునరుద్ధరిస్తారా? అని ప్రశ్నించగా.. భారత్ ఆ దిశగా చర్యలు తీసుకున్న తర్వాతి రోజు నుంచే 25 శాతం సుంకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. భారత్ తీరు ఆశ్చర్యంగా ఉందని, ప్రధాని మోడీ వంటి పరిణతి చెందిన నాయకుడు ఎందుకలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.
ఉక్రెయిన్‌తో యుద్ధానికి రష్యాకు భారత్ పరోక్షంగా సాయం చేస్తోందని పీటర్ ఆరోపించారు. రాయితీపైపెద్ద మొత్తంలో ఇండియా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ మొత్తాన్ని మాస్కో ఉక్రెయిన్‌ను అణిచివేసేందుకు ఉపయోగిస్తోందని విమర్శించారు. పీటర్ భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం ఇదే తొలిసారి కాదు. రష్యా ముడి చమురును శుద్ధి చేస్తూ న్యూఢిల్లీ రిఫైనరీ భారీ లాభాలను ఆర్జించిందని గతవారం నవారో విమర్శించారు. భారత్ అమెరికాకు విక్రయిస్తున్న వస్తువుల ద్వారావచ్చిన సొమ్మును రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు వినియోగిస్తోందని తద్వారా భారీ లాభాలు ఆర్జిస్తోందని ఆరోపించారు. రష్యా ఆ సొమ్మును ఉక్రెయిన్ వినాశనానికి వాడుతోందని దుయ్యబట్టారు.

# 17వ బిడ్డకు జన్మనిచ్చిన రాజస్థాన్ మహిళ

**జైపూర్, ఆగస్టు 28:** ఒక మహిళ 55 ఏళ్ల వయస్సులో 17వ బిడ్డకు జన్మనిచ్చింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడ బిడ్డను ప్రసవించింది. ఆమెకు 17వ కాన్పు అని తెలుసుకుని డాక్టర్లు షాకయ్యారు. అయితే 17 మంది సంతానంలో పుట్టిన వెంటనే ఐదుగురు పిల్లలు మరణించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లీలావాస్ గ్రామానికి చెందిన కవారా రామ్ భార్య అయిన 55 ఏళ్ల రేఖ బుధవారం జాడోల్ బ్లాక్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 17వ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. కాగా, కవారా, రేఖ దంపతులు ఇప్పటి వరకు 17 మంది పిల్లలను కన్నారు. అయితే నలుగురు మగ, ఒక ఆడ బిడ్డపుట్టిన వెంటనేమరణించారు. ప్రస్తుతం ఈ దంపతులకు 12 మంది పిల్లలు ఉన్నారు. ఏడుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. 11 మందికి పెళ్లిళ్లు కావడంతోపాటు ఒక్కొక్కరికి ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీంతో 17వ బిడ్డకు రేఖ జన్మనివ్వకముందే ఆమెకు మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు.

# కీవ్‌పై 598 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా



**కీవ్, ఆగస్టు 28:** ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ఆగడం లేదు. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ఓ వైపు అమెరికా ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఫలితం పెద్దగా కనిపించడం లేదు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై గురువారం రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా 598 డ్రోన్లు, 31 తేలికపాటి క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్సు వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో 12మంది ప్రాణాలు కోల్పోగా.. 48 మందికి గాయాలైనట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మృతుల్లో 2, 14, 17 యేళ్ల వయసున్న ముగ్గురు చిన్నారులుకూడా ఉన్నట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయతానలు చేస్తున్నారు. ఇరు దేశాల అధ్యక్షులతో మంతనాలు సాగిస్తున్నారు. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్న క్రమంలో ఇటీవల రష్యా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదే. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. తాజా ఘటనను ఆదేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. చర్చలకు రాకుండా రష్యా బాలిస్టిక్ క్షిపణులను వినియోగిస్తోందని మండిపడ్డారు. ‘శాంతిని కోరుకునే యావత్ ప్రపంచం తాజా ఘటనపై స్పందించారు. గతంలో చాలామంది శాంతి మంత్రం జపించారు. ఇప్పుడు మాత్రం మిన్నకుండిపోతున్నారు.’ అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.
కీవ్ నగరంలోని దాదాపు 20 ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 100 భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. మరోవైపు 563 డ్రోన్లను, 26 క్షిపణులను విజయవంతంగా నేల కూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ వెల్లడించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపు సహా, మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ కూడా ప్రస్తావించారు. ‘యుద్ధాన్ని ముగించేందుకు ఇచ్చిన అన్ని గడువులను రష్యా ఇప్పటికే అతిక్రమించింది. ఇరు దేశాల మధ్య శాంతి కుదిర్చేందుకు చేసిన దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి’ అని అన్నారు. జెలెన్‌స్కీతో ప్రత్యక్షంగా శాంతి చర్చలు జరిపేందుకు అమెరికా చేసిన ప్రతిపాదనను పుతిన్ తిరస్కరించడంపై ఇటీవల ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రత్యక్ష చర్చలకు షెడ్యూలు ఖరారు కాకపోతే రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని గత శుక్రవారం ట్రంప్ వ్యాఖ్యానించారు.
మరోవైపు గురువారం రాత్రి ఉక్రెయిన్‌కు చెందిన 102 డ్రోన్లను నేల కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. రష్యాలోని నైరుతి భాగమే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగుతున్నట్లు పేర్కొంది. క్రాస్‌నోడార్ ప్రాంతంలోని అఫిప్‌స్కీ చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడికారణంగా మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమర రీజియన్‌లోని మరో చమురు శుద్ధి కేంద్రంపైనా ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసినట్లు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసేందుకు..చమురుశుద్ధి కేంద్రాలనే ఉక్రెయిన్ ప్రధానంగా ఎంచుకుంటోంది.


# స్కూటీపై పడిన కంటైనర్.. ముగ్గురు మృతి

**అహ్మదాబాద్, ఆగస్టు 28:** హైవేపై వేగంగా వెళ్తున్న కంటైనర్ ట్రాలీ అదుపుతప్పి అటుగా వెళ్తున్న స్కూటర్‌పై పడింది. దీంతో స్కూటర్‌పై ఉన్న ముగ్గురు యువకులు దానికింద నలిగి నుజ్జయి మరణించారు. గుజరాత్‌లోని కచ్‌జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం మధ్యాహ్నం ముంద్రా-అంజార్ హైవేలోని ఖేడోయ్ గ్రామం సమీపంలో వేగంగా వెళ్తున్న కంటైనర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీ వాహనంనుంచి ఊడిన కంటైనర్ అటుగావెళ్తున్న యాక్టివా స్కూటర్‌పై పడింది. దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు భారీ కంటైనర్ కింద నలిగి నుజ్జునుజ్జయై మరణించారు. కాగా, ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. క్రేన్‌ను రప్పించి కంటైనర్‌ను తొలగించారు. దాని కింద పడి నలిగి మరణించిన ఇద్దరిని నాయిక్తి, అభిషేక్‌గా గుర్తించారు.

# బీహార్ మంత్రిని వెంటాడిన గ్రామస్తులు!

**పాట్నా, ఆగస్టు 28:** మంత్రి తీరుపై జనం ఆగ్రహించారు. గ్రామ సందర్శనకు వచ్చిన ఆయనపై దాడికి ప్రయత్నించారు. తప్పించుకుని పారిపోయిన మంత్రిని కిలోమీటరు దూరం వరకు వెంబడించి తరిమారు.ఎన్డీయే పాలిత బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. గతవారం రోడ్డు ప్రమాదంలో 9 మంది వ్యక్తులు మరణించారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి బుధవారం ఉదయం జోగిపూర్ మలవాన్ గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపేందుకు వారి ఇళ్ల వద్దకు వెళ్లారు. కాగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేను వారు చుట్టుముట్టారు. గ్రామాన్ని ఆలస్యంగా సందర్శించడం, బాధిత కుటుంబాలపట్ల సానుభూతి చూపకపోవడం,ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంపై జనం ఆగ్రహించారు. అధికారజెడియూనేతలపై దాడికి ప్రయత్నించారు. జనందాడినుంచి మంత్రి తప్పించుకోగా ఆయన బాడిగార్డు గాయపడ్డాడు. అనంతరం మంత్రి శ్రావణ్ కుమార్ తన కాన్వాయ్ వరకు పరుగెత్తారు. వాహనాల్లో పారిపోతున్న మంత్రి, ఎమ్మెల్యేను కిలోమీటరు దూరం వరకు గ్రామస్తులు వెంబడించి తరిమారు. అప్రమత్తమైన పోలీసులు జనాన్ని చెదరగొట్టారు. భద్రతను కట్టుదిట్టం చేశారు.

# గల్వాన్ తర్వాత తొలిసారి జిన్‌పింగ్, మోడీ ద్వైపాక్షిక భేటీ!



**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసుకోనుంది. సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణల అనంతరం, ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. ఆదివారం ఈ ద్వైపాక్షిక భేటీ జరగనుంది. జపాన్‌లో తన రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ నేరుగా చైనాకు వెళ్లనున్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు మోడీ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) వెంబడి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, పెట్రోలింగ్ నిర్వహించడంపై ఇరు దేశాలు ఇటీవలే ఒక ఒప్పందానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సానుకూల వాతావరణంలో ఈ పర్యటన జరగనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఈ నెల 19న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయి, ఎస్సీఓ సదస్సుకు రావాల్సిందిగా జిన్‌పింగ్ పంపిన ఆహ్వాన పత్రాన్ని స్వయంగా అందజేశారు.
ఈ సమావేశం అనంతరం ప్రధాని మోడీ స్పందిస్తూ, గతేడాది అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల ప్రయోజనాలకు, సున్నితత్వాలకు పరస్పరం గౌరవం ఇచ్చుకుంటూ సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయి. టియాంజిన్‌లో జరగబోయే సమావేశం కోసం ఎదురుచూస్తున్నానని ‘ఎక్స్’ (ట్విట్టర్)లో పోస్ట్‌చేశారు. ప్రధాని మోడీ పర్యటన ఇరు దేశాల సంబంధాల మెరుగుదలకు, అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని భారత్‌లో చైనా రాయబారి జూఫెయిహాంగ్ ఈ నెల 21న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు దేశాల బృందాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతను కాపాడటం అత్యంత ముఖ్యమని, సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోడీ స్పష్టం చేసినట్లు పిఎంఓ వెల్లడించింది.

# సంక్షిప్తంగా..

## నేపాల్‌లో పెరుగుతున్న కలరా కేసులు



**ఖాట్మండు:** నేపాల్‌లోని పార్సా జిల్లాలో కలరా వ్యాధి వ్యాపిస్తున్నది. వారం నుంచి ఆ కేసులు ఎక్కువయ్యాయి. ఇప్పటి వరకు ముగ్గురు మృతిచెందారు. సుమారు 300 మంది అతిసారంతో ఆస్పత్రి పాలయ్యారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నది. శుక్రవారం నుంచి బిర్‌కుంజ్ మెట్రోపాలిటన్ సిటీ ఆస్పత్రిలో డయేరియా వ్యాధి లక్షణాలతో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ర్యాపిడ్ టెస్టుల ద్వారా కలరా వ్యాపిస్తున్నట్లు గుర్తించారు. యాంటీజెన్ పరీక్షలో విబ్రియో కలరా 01 పాజిటివ్‌గా వస్తున్నారు. కాఠ్మాండులోని సెంట్రల్ ల్యాబ్ కూడా ఈ వ్యాధిని ధ్రువీకరించింది. కలరాకు చెందిన సీరో టైప్ బ్యాక్టీరియా వల్ల బంగ్లాదేశ్‌లోనూ తీవ్ర స్థాయి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నట్లు బిర్‌గుంజ్ ఆస్పత్రి డాక్టర్లు అంచనా వేశారు. బిర్‌గుంజ్‌లోని కొన్ని వార్డుల్లో కేసులు అధికంగా ఉన్నాయి. కొందరు కిడ్నీ సంబంధిత వ్యాధికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

## అమెరికా ఉత్పత్తుల విక్రయాలపై పంజాబ్ వర్సిటీ బ్యాన్!

**అమృత్‌సర్, ఆగస్టు 28:** అమెరికా విధించిన భారీ దిగుమతి సుంకాలకు వ్యతిరేకంగా పంజాబ్‌కు చెందిన ఓ ప్రముఖ విశ్వవిద్యాలయం సంచలన నిర్ణయం తీసుకుంది. తమ క్యాంపస్‌లో కోకాకోలా, పెప్సీ వంటి అమెరికన్ శీతల పానీయాల అమ్మకాలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్ష వైఖరికి నిరసనగా దీనిని స్వదేశీ 2.0 ఉద్యమంగా అభివర్ణించింది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారతీయ వస్తువులపై అమెరికా ఏకంగా 50 శాతం సుంకాలను విధించింది. పెంచిన ఈ సుంకాలు నిన్నటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పియూ) ఈ నిరసనకు పిలుపునిచ్చింది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ వర్సిటీలలో ఒకటైన ఎల్‌పియూ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వర్సిటీ ఛాన్సలర్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ స్పందించారు. అమెరికా చర్యను ఆర్థిక దౌర్జన్యంగా ఆయన అభివర్ణించారు.

## కిడ్నాప్ కేసులో కేరళ నటికి ఊరట!

**తిరువనంతపురం, ఆగస్టు 28:** కిడ్నాప్, దాడి కేసులో ప్రముఖ నటి లక్ష్మీ మీనన్‌కు కేరళ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఓ ఐటీ ఉద్యోగిని అపహరించి, దాడి చేశారన్న ఆరోపణలపై ఆమెతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 17 వరకు ఆమెను అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశిస్తూ ఉన్నత న్యాయస్థానం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొచ్చిలోని వెలాసిటీ అనే పబ్‌లో లక్ష్మీమీనన్ స్నేహితులకు, ఓ ఐటీ ఉద్యోగికి మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం పబ్ నుంచి బయటకు వచ్చిన ఆ ఉద్యోగి కారును రైల్వే బ్రిడ్జి సమీపంలో అడ్డగించి, వాహనంలో నుంచి బలవంతంగా బయటకు లాగారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనను దుర్భాషలాడుతూ వారి కారులోకి ఎక్కించుకుని, దాడికి యత్నించి, ఆ తర్వాత అర్ధరాత్రి వదిలిపెట్టారని ఆరోపించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు లక్ష్మీమీనన్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అదే సమయంలో ఈ గొడవకు సంబంధించిందంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## బిక్షాటనను నిషేధించిన మిజోరం

**ఐజ్వాల్, ఆగస్టు 28:** మిజోరం రాష్ట్రాన్ని యాచకులు లేని ప్రాంతంగా మార్చే దిశగా అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భిక్షాటనను పూర్తిగా నిషేధిస్తూ రూపొందించిన మిజోరం యాచక నిషేధ బిల్లు, 2025ను అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేవలం నిషేధించడమే కాకుండా, యాచకులకు పునరావాసం కల్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న సైరంగ్‌సిహ్ము రైల్వే లైన్ ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సెప్టెంబర్ 13న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలు మార్గాన్ని ప్రారంభించనున్నారు. కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే ఇతర రాష్ట్రాల నుంచి యాచకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ముందస్తు చర్యగా ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ కొత్త చట్టం ప్రకారం, ప్రభుత్వం ఒక రిలీఫ్ బోర్డును, ఒక రిసీవింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుంది. భిక్షాటన చేస్తూ పట్టుబడిన వారిని ఈ కేంద్రంలో తాత్కాలికంగా ఉంచి, 24 గంటల్లోగా వారి స్వస్థలాలకు లేదా వారి కుటుంబ సభ్యుల వద్దకు పంపిస్తారు. పునరావాసం కల్పించి, రాష్ట్రాన్ని యాచక రహితంగా మార్చడమే తమ లక్ష్యమని వివరించారు.

# విదేశీ విద్యార్థులకు నాలుగేళ్లవరకే అనుమతి!

## స్టూడెంట్ వీసాలపై ఆంక్షలు పెంచిన అమెరికా

**వాషింగ్టన్, ఆగస్టు 28:** అమెరికాలో చదువుకుంటున్న, ఉన్నత చదువుల కోసం వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న విద్యార్థులకు ట్రంప్ సర్కారు మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే వీసాలపై పలు ఆంక్షలు అమలు చేస్తున్న అమెరికా తాజాగా మరో కీలక సవరణకు ప్రతిపాదనలు చేసింది. విదేశీ విద్యార్థులు తమ దేశంలో ఎక్కువ కాలం ఉండిపోకుండా కట్టడి చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతినిధులకు జారీచేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. స్టూడెంట్ వీసాపై వచ్చిన వారు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా నిబంధనలకు సవరణ చేయనుంది. ప్రస్తుతం ఎఫ్1, జే-1 వీసాలకున్న ‘డ్యూరేషన్ ఆఫ్ స్టే’ వెసులుబాటును కుదించనున్నట్లు సమాచారం. ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్‌వీసాలకు కూడా గడువు విధించేలా ‘పరిమిత కాల నివాస అనుమతి’తో కూడిన వీసాలను మంజూరు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదించింది. విదేశీ విద్యార్థులకు డ్యూరేషన్ ఆఫ్ స్టే వెసులుబాటు వల్ల భద్రతాపరమైన ఇబ్బందులు, అమెరికన్ల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని పేర్కొంది.

# భారత్‌పట్ల ట్రంప్ వైఖరిపై డెమొక్రాట్ల ఫైర్!

**వాషింగ్టన్, ఆగస్టు 28:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై స్వదేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న చైనా వంటి దేశాన్ని వదిలేసి, కేవలం భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడంపై డెమొక్రాటిక్ పార్టీకి చెందిన హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ తీవ్రంగామండిపడింది. ట్రంప్‌నిర్ణయాలు అమెరికా ప్రయోజనాలకు, భారత్‌తో దశాబ్దాలుగా నిర్మించుకున్న సంబంధాలకు హానికరమని ఆరోపించింది. భారత దిగుమతులపై ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లు అమెరికన్లనే నష్టపరుస్తున్నాయని, రెండు దశాబ్దాలుగా ఇరు దేశాలు నిర్మించుకున్న బలమైన సంబంధాలను దెబ్బతీస్తున్నాయని డెమొక్రాట్లు ఆరోపించారు. ఇదంతా చూస్తుంటే అసలు సమస్య ఉక్రెయిన్ కాదేమో అనిపిస్తోందంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఒక ప్రకటనలో విమర్శించారు. రష్యా నుంచి అత్యధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న చైనాను వదిలేసి, కేవలం భారత్‌పైనే దృష్టి పెట్టడం గందరగోళ విధానమని వారు వెల్లడించారు. చైనా ఇప్పటికీ రాయితీధరలకు రష్యా చమురును కొనుగోలు చేస్తూనే ఉందని, కానీ ఆ దేశంపై ఎలాంటి చర్యలు లేవని వారు గుర్తుచేశారు. రష్యా చమురు వాణిజ్యానికి ముడిపెడుతూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై అదనంగా 25 శాతం సుంకాలను విధించడంతో మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరాయి.
ఈ నిర్ణయంతో సుమారు 48.2 బిలియన్‌డాలర్ల విలువైన భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని మోదీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ చర్య వల్ల అమెరికాకుజరిగే ఎగుమతులు వాణిజ్యపరంగా లాభదాయకం కావని, ఇది దేశంలో ఉద్యోగ నష్టాలకు, ఆర్థిక వృద్ధి మందగమనానికి దారి తీయవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్ వస్తువుల వంటి కొన్ని కీలక రంగాలకు ఈ అదనపు సుంకాల నుంచి అమెరికా మినహాయింపు ఇవ్వడం భారత్‌కు కొంత ఊరటనిచ్చేఅంశం. గత కొన్నేళ్లుగా భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాలు విస్తరిస్తున్నప్పటికీ, మార్కెట్ యాక్సెస్ వంటి అంశాలపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, డెయిరీ రంగాల్లో తమకు మరింత ప్రాధాన్యత కల్పించాలని అమెరికా డిమాండ్ చేస్తుండటంతో వాణిజ్య ఒప్పంద చర్చలు నిలిచిపోయాయి.

# ఓట్లను దొంగిలిస్తే బీహార్ ప్రజలు సహించబోరు

## ‘ఓటర్ అధికార్ యాత్ర’లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



**పాట్నా, ఆగస్టు 28:** ‘ఓట్ చోర్ - గద్దీ ఛోడ్’ అనే నినాదంతో ‘ఓటర్ అధికార్‌యాత్ర’ చేపట్టిన కాంగ్రెస్‌అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపి, ఎన్నికల సంఘంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తమ ఓట్లను దొంగిలిస్తే బీహార్ ప్రజలు సహించబోరన్నారు. ఓటర్ల జాబితా నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆక్షేపించారు. అందులో ఎక్కువ మంది బడుగు బలహీన వర్గాల వారే ఉన్నారని అన్నారు. సీతామఢీలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో ఆయన మాట్లాడుతూ ‘ఓట్ చోరీ’ గురించి రానున్న రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని అన్నారు. ఎన్నికల సంఘం, బిజెపి కుమ్మక్కైఓట్లను దొంగిలించాయి. గతంలో మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటకలో ఇదే పంథా కొనసాగించారు. ఇప్పుడు బీహార్ వంతు. కానీ, ఇక్కడి ప్రజలు దీన్ని సహించరు అని అన్నారు. యాత్రలో భాగంగా స్థానిక సీతాదేవి ఆలయాన్ని రాహుల్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు.



గురువారం మూసీ రివర్ డెవలప్‌మెంట్‌పై జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

# వందేళ్ల అవసరాల దృష్ట్యా మూసీ పరీవాహక అభివృద్ధి

## గాంధీసరోవర్ అభివృద్ధిపై పలు డిజైన్లను పరిశీలించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28:** గేట్ వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధితోపాటు జంక్షన్ల ఏర్పాటు, రోడ్ల అభివృద్ధిపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుసూచనలు చేశారు. సిగ్నల్‌రహిత జంక్షన్లను ఏర్పాటు చేయాలని వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూసీనదీ పరీవాహక అభివృద్ధి జరగాలని చెప్పారు. మూసీరివర్ డెవలప్‌మెంట్‌పై జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతా ధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను సిఎం పరిశీలించారు. అభివృద్ధి పర్యావరణ హితంగా ఉండేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. మీరాలం చెరువు అభివృద్ధి, ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రణాళికలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వీలైనంత త్వరగా డీపీఆర్ సిద్ధంచేసి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సిఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, సెక్రటరీ (హెచ్ఎండీఏ ఏరియా) ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశాంక, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి ఎండి అశోక్‌రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, జెఎండి పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# వ్యవసాయ అధికారుల పొలం బాట

## డిజిటల్ సర్వే ప్రారంభం, అక్టోబరుకల్లా పూర్తి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖాధికారులు పొలం బాట పట్టనున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేశారనే విషయమై డిజిటల్ సర్వే చేయనున్నారు. దీనికి సంబంధించి ఈ నెల గురువారం నుంచి సర్వే ఆరంభించారు. ప్రస్తుత వానాకాలం సీజనుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సర్వేతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా డిజిటల్ క్రాప్ సర్వే చేయిస్తున్నది. డిజిటల్ క్రాప్ సర్వే చేయాలంటే తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. పొలాల వద్దకు వెళ్లి పంటలను రైతుతో కలిసి ఫొటోలు తీసి రైతు వివరాలు, సర్వే నంబర్, పట్టాదారు పాసు పుస్తకం నంబర్, సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం వివరాలు నమోదు చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సర్వే వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. పంటల సాగు వివరాలు నమోదు చేయడం వల్ల రైతులకు ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలు, పంట ఉత్పత్తుల విక్రయాల వివరాలతో పాటు, కేంద్రం అమలు చేసే రైతు పథకాలు దుర్వినియోగం కాకుండా అర్హులైన వారికి అందిం చే వీలుంటుంది. డిజిటల్ క్రాప్ సర్వేలో ఒక రైతు తాను పండించిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఎంత విస్తీర్ణంలో సన్నరకం వరి పంట వేశారో, తద్వారా ఎంత దిగుబడి వస్తుందో, అంతకు మాత్రమే బోనస్ చెల్లిస్తారు. అలాగే పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకునేందుకు దోహద పడనున్నది. అక్టోబర్ నెలాఖరు వరకు సర్వేను పూర్తి చేయనున్నారు.

# వర్ధమాన్ మహిళ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా మహేందర్‌కుమార్‌జైన్ గోలేచా ఏకగ్రీవం



మహేందర్ కుమార్‌జైన్ గోలేచా

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వర్ధమాన్ మహిళ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్‌గా మహేందర్ కుమార్‌జైన్ గోలేచా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఆయననకు ఏకగ్రీవంగా ఎనుకున్నారు. 1987 నుంచి చార్టర్డ్ అకౌం ట్‌లో ఉన్న అనుభవం ఉన్న ఆయన 2015 నుంచి బోర్డులో డైరెక్టర్‌గా సేవ లందించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా బోర్డు ఆఫ్ మేనేజ్ మెంట్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

# భారీ వర్షాలు, వరదల నష్టాలపై ప్రాథమిక నివేదికను సమర్పించండి

## వివిధ శాఖల కార్యదర్శులతో సిఎస్ రామకృష్ణారావు సిఎస్ టెలీకాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో నేడు సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్ , పోలీస్ శాఖ డిజిపి అడిషనల్ డిజి మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు.

ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సిఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్‌గ్రేషియాను అందచేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో సమీక్షించనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

# తగ్గిన విద్యుత్.. గరిష్ట అంచనా 277 గిగావాట్లు

## సీజనులో 242 గిగావాట్ల డిమాండ్

## గత యేడాది కంటే తగ్గిన 8 గిగావాట్లు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ప్రస్తుత 2025-26 సంవత్సరానికి అంచనా వేసిన డిమాండ్ కంటే తక్కువగా రికార్డు అయింది. ప్రస్తుత సీజనులో 277 గిగావాట్ల గరిష్ట స్థాయికి విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. అయితే అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ వినియోగంలో తగ్గుదల చోటు చేసుకుంది. వచ్చే నెల సెప్టెంబర్ నాటికి గరిష్టంగా 277 గిగావాట్ల మేర విద్యుత్ వినియోగం జరుగుతుందని అంచనా వేసిన మంత్రిత్వ శాఖ అందుకు అనుగుణంగా స్వల్పకాలిక, దృక్పథ ప్రణాళికలను రూపొందించింది. అయితే ఈ అంచనా కంటే తక్కువగా 242 గిగావాట్ల మేర విద్యుత్ డిమాండ్ రికార్డయింది. గత ఏడాది ఇదే కాలానికి 250 గిగావాట్ల చొప్పున విద్యుత్ వినియోగం జరిగి. అది ఆల్ టైమ్ హైగా కేంద్రం గుర్తించింది. ఈ లెక్కన ప్రస్తుత సంవత్సరం అంచనా వేసిన విద్యుత్ కాదుకదా, గత ఏడాది డిమాండ్ కంటే 8 గిగావాట్ల విద్యుత్ తక్కువగా నమోదు కావడం విశేషం. అంతకు ముందు ఏడాది 2023 సెప్టెంబర్ వరకూ 243.27 గిగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలైతో పాటు, ఈ నెలలో ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 427 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన కేంద్రాలు ఉండగా, దాన్ని 2030 నాటికి 900 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచేందుకు ప్రతిపాదనలు చేస్తోంది. వీటితో పాటు, 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని వ్యవస్థాపించే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గత నెలాఖరు నాటికి 187.5 గిగావాట్ల మేర నాన్ ఫాసిల్ ఇంధన వనరుల నుండి విద్యుత్ ఉత్పత్తి సాధించింది. ఇదే సమయంలో విద్యుత్ రంగాన్ని సంస్కరించే లక్ష్యంతో గ్రీన్ హైడ్రోజన్ తయారీ వంటి ఇటెన్సివ్ పరిశ్రమలకు ఇంధన భద్రతను పెంచే లక్ష్యంతో కొత్త నిబంధనలు అమల్లోకి తెస్తోంది. అలాగే విద్యుత్ మెరుగుదలను పెంపొందించే విస్తృత వ్యూహంలో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

# భారీ వర్షాల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు రాకుండా చర్యలు

## నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

## మంత్రి రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత జిల్లాల వైద్యాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో టెలిఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలలో వర్షాలు అధికంగా కురుస్తున్న మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, సిరిసిల్లా, సిద్దిపేటలతో పాటు ఇతర జిల్లాలలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. స్నేక్ బైట్‌లు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వచ్చే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, ఫార్మా సిస్ట్‌లు, ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారిన నేఫథ్యంలో ప్రజలకు తక్షణ వైద్య సాయం అందించటంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిరంతరం జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వర్ష ప్రభావానికి గురైన ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, అంటు వ్యాధులు ప్రభలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు తీసుకోవటానికి పురపాలక, పంచాయితీరాజ్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయితీ, డిజాస్టర్ మెనేజ్మెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని అధిక వర్షా ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి రాజనర్సింహ ఆదేశించారు.

# వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

## జిల్లాకు రూ. కోటి వరద సహాయం

## మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 28 ప్రభాతవార్త :** వరద బాధితులను అన్ని విధాల ఆదుకుం టామని వరద సహాయక చర్యలపై ఇప్పటికే కోటి రూపాయలు మంజూరు చేశామని అత్యధిక నిధుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ప్రత్యేక అధికారి డాక్టర్ హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర శాఖల జిల్లా అధికారులతో మెదక్ జిల్లా భారీ వర్షాలు వరదలు సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒడిశాలో ఏర్పడిన ఉపరితల ద్రోని వలన మెదక్ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్నాయన్నారు. 40 యేళ్లలో మెదక్ జిల్లాలో ఇంత మేరకు అత్యధిక భారీ వర్షపాతం చూడలేదన్నారు.

పునరావాస కేంద్రాల్లో వరద బాధి తులకు జిల్లా యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వరద నీరుచేరి బిల్డింగ్‌పైకి చేరుకున్న ప్రజలను హెలికాప్టర్ ద్వారా తరలించాలని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యుడు మైనపల్లి రోహిత్‌రావు విజ్ఞప్తి చేసినప్పటికీ వాతావరణ ప్రతికూల ప్రభావంతో హెలికాప్టర్ వెళ్లలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు నిమగ్నమై వారిని పునరావస కేంద్రాలకు తరలించామన్నారు. అనంతరం ఇరిగేషన్ వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి శాఖలవారీగా వరద నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.




వరదప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రకృతి విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జిల్లా పాలన యంత్రాంగం అప్రమత్తంగా ఉంద న్నారు. మెదక్ జిల్లా భారీ వర్షాలు వరద ఉధృతిపై హావేలి ఘనపూర్ మండ లం జలదిగ్బంధంలో చిక్కుకుందని అత్యధికంగా 300 మిల్లీమీటర్లు మీటర్స్ వర్షపాతం నమో దయిందని తెలిపారు. రామాయం పేటలో వరద ఉధృతి వలన మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కాగా వెంటనే పునరుద్ధరిం చామన్నారు. అనంతరం మంత్రి పునరావాస కేంద్రాలలో ప్రజల సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు, హెల్త్ క్యాంపును సందర్శించి ఎటు వంటి అనారోగ్య పరిస్థితి తలెత్తకుండా చికిత్సలు అందించా లన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

## పోలీసులు సహకరించాలి

## 2,000 మందిని రక్షించాం: డిజిపి జితేందర్



**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ కుండపోత వర్షాలపై పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు డిజిపి జితేందర్ అన్నారు. వరదల సహాయక చర్యలకై డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. సుమారు 10మంది మృతి చెందినట్లు భావిస్తున్నాం. అయితే ఇంకా పక్కా సమాచారం లేదు. ప్రజందరూ సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీసాయంతో ఇప్పటికి రెండు వేలమందిని కాపాడామని పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు వేలమంది సిబ్బందితో ఎస్డిఆర్ఎఫ్ ఏర్పాటు చేసి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన్నట్లు వివరించారు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి చర్యలు తీసుకుంటుందన్నారు. ఓవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ వరదలపై పోలీస్ శాఖ పోరాటం సాగిస్తుందని చెప్పారు. సహాయక చర్యలకై డిజిపి కార్యాలయంలో అత్యవసర బృందా లను సిద్ధంగా ఉన్నట్లు, ఎలాంటి విపత్తు వచ్చిన ఎదుర్కొంటాం. ఎక్కడ కూడా ప్రజల ప్రాణాలు పోకుండా రెస్క్యూ చేస్తున్నామని వెల్లడించారు. గత ఏడాది నుంచి ఎస్డీఆర్ఎఫ్ మంచి ఫలితాలు ఇచ్చిందని, అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని జితేందర్ తెలిపారు.

# సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినంగా నిరసన

## తెలంగాణ ఎంప్లాయీస్ జెఏసి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మిక పెన్షనర్స్ అందరూ కలిసి సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబరు 1న పాత పెన్షన్ సాధన సభను నిర్వహించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జెఏసి నిర్ణయించింది.

గత 20 సంవత్సరాలుగా ఉద్యోగ వర్గాన్ని నాశనం చేస్తూ వారిని పారిశ్రామికవేత్తలకు పెట్టుబడిదారులుగా మార్చి ఉద్యోగుల భవిష్యత్తును దళారీ మార్కెట్‌కి తాకట్టు పెట్టిన సిపిఎస్,యుపిఎస్ స్కీములను అంతమొందించి, పాత పెన్షన్ పునరుద్ధరణపై ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయుటకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా 15 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, గెజిటెడ్ అధికారుల పెన్షనర్ల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేతృత్వంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటిస్తూ, 'పాత పెన్షన్ సాధన సభ' నిర్వహించనున్నారు. పాత పెన్షన్ సాధన కోసం నల్లబ్యాడ్జీలు ధరించి హైదరాబాదులోని ఆర్‌టిసి కళాభవనంలో సభను నిర్వహించనున్నారు.

# రాజ్యాంగ రక్షణ కోసమే ఉపరాష్ట్రపతి ఎన్నికలు

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామ్య పరిరక్షకుడు

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతి రేకులకు మధ్య జరుగుతున్న పోరు అని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రజాస్వామ్య పరిరక్షకుడని కొనియాడారు. ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నారాయణ మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల కూటమి నుంచి ఉపరాష్ట్ర పతి అభ్యర్థిగా ఎంపిక చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి కింది స్థాయి నుండి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా, అభ్యుదయ వాదిగా, రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా పేరు గడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును ప్రతిపాదించిన వెంటనే ఎన్డీఏ కూటమిలో తీవ్రమైనటువంటి భయం, వణుకు నెలకొందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని మావోయిస్టు అంటూ వ్యాఖ్యానించడాన్ని నారాయణ తప్పు పట్టారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి పట్ల బిజెపిలోని భయాన్ని వ్యక్తం చేస్తున్నదని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో సుదర్శన్ రెడ్డిని అంతమొందిస్తారా అంటూ అమిత్ షా వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఇప్పటిదాకా ఉపరాష్ట్ర పతిగా ఉన్న జగదీప్ ధనకర్ ఏమైపోయారో, అసలు ఉన్నారో లేరో కూడా అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపికి వ్యతిరేకంగా ఉన్నందునే జగదీప్ ధన్కర్‌ను అర్ధాంతరంగా ఆ పదవి నుండి వైదొలిగేలా చేశారని విమర్శించారు. ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో విపక్ష పార్టీలన్నీ కలిసి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించామని, ఆయన అభ్యర్థిత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని స్పష్టం చేశారు. సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఇండియా కూటమికి దూరంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వాగతించిందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేసే ఆయన్ని గెలిపించుకోవడం చాలా అవసరమన్నారు. ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రతిపక్షనేత జగన్ ఈ విషయంలో ఆలోచించాలని, తెలుగువాడైన సుదర్శన రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు.

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిపిన అభ్యర్థి అంటూ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. తెలుగువాడైన జస్టిస్ సుదర్శనరెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని అన్నీ పార్టీలు తమ రాజకీయాలను పక్కన పెట్టి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు.

# వినాయకసాగర్‌లోనే 6న గణేశ విగ్రహాల నిమజ్జనం

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 28, ప్రభాతవార్త:** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవార ం భాగ్యనగర్ గణేశఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో సిద్ధియంబర్‌బజార్‌లోని బహెతిభవన్‌లో వినాయకపూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధానకార్యదర్శి డాక్టర్ రవినూత శశిధర్, సలహాదారులు నర్సింగ్ పూరియా, మాజీ కార్పొరేటర్, ఉపాధ్యక్షులు మెట్టు వైకుంఠం, రామరాజు, కె.మహేందర్, గోవింద్‌రాఠి, శ్రీరామ్‌వ్యాస్, ఉత్సవ సమితి ప్రతినిధులతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ హిందువులలో వస్తున్న ఐక్యత, ధర్మరక్షణ కోసం ఉపయోగపడాలని అందుకోసం ప్రతి హిందువు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానకార్యదర్శి డాక్టర్ రవి నూతల శశిధర్ మాట్లాడుతూ వచ్చే నెల 6న వినాయకసాగర్‌లోనే నిమజ్జన కొనసాగుతుందన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. విదేశీ వస్తువులను బహిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో 24 నియో జకవర్గాల గణేశ ఉత్సవ సమితి ప్రతినిధులు తదితరులు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ పాల్గొన్నారు.



బస్తీబాటలో పాల్గొన్న తెలంగాణ సదరన్ డిస్కం సిఎండి ముషార్రఫ్ ఫరూఖీ

# విద్యుత్ సమస్యల పరిష్కారంతోపాటు ప్రమాదాల నివారణకు చర్యలు

## సదరన్ డిస్కం సిఎండి ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెలంగాణ సదరన్ డిస్కం సిఎండి ముషర్రఫ్ ఫరూకీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా వైట్‌ఫీల్డ్ సెక్షన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ వడ్డేర బస్తీని సందర్శించారు. స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి విద్యుత్ సంబంధిత సమస్యలను ఆరాతీశారు. విద్యుత్ ప్రమాదాల నివారణకుగాను అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు సీఎండీ తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింలు, సిఇ పాండ్యా నాయక్, ఎస్ఇ చంద్రశేఖర్, డిఇ శ్యాంకుమార్, ఎడిఇ కమలాకర్, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై కేంద్రం ఆరా

## కాంగ్రెస్‌కు రాష్ట్రంలో దిక్కూ, మొక్కూ లేని పరిస్థితి

## అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్



**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో దిక్కూ, మొక్కూ లేని పరిస్థితి కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో ఒకవైపున ప్రకృతి వైపరీత్యం కారణంగా కాలువలు పొంగిపోతున్నాయి, వాగులు నిండిపోతున్నాయి, చెరువులు పూర్తి స్థాయికి చేరుకున్నాయి. మరొకవైపు అనేక నగరాల్లో మోకాళ్ల లోతు నీళ్లు నిల్వ ఉండటం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కార్యకర్తలను, ప్రజా ప్రతినిధులను అప్ర మత్తం చేశారు. సహాయక చర్యల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఎప్పటి కప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులపై బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాష్ట్ర మంత్రులతో, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితో చర్చలు జరిపారు. బిజెపి కార్యకర్తల యంత్రాంగాన్ని కూడా అప్రమత్తం చేసి సహాయక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ అధిష్టానం హైదరాబాద్ - ఢిల్లీ మధ్య ముఖ్యమంత్రిని ఫుట్‌బాల్‌లా తిప్పుతుందన్నారు. ఇది కొత్త విషయం కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు తెలంగాణ - రెండింటిలోనూ ముఖ్యమంత్రులను ఫుట్‌బాల్‌లా ఆడుకోవడం తరచుగా చూసిన సంగతే.ప్రస్తుతం ఈ ముఖ్యమంత్రి కూడా అదే పరిస్థితికిలోనై హైదరాబాద్ - ఢిల్లీకి చక్కర్లు కొడుతూ, రాజకీయంగా నలిగిపోతున్నారు. ఇది కాంగ్రెస్‌లోని అంతర్గత విభజనకు, రేవంత్ రెడ్డి పరిస్థితికి నిదర్శనం. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డిని బీహార్ ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని, తెలంగాణ నుంచి బీహార్ ట్యాక్స్ వసూలు చేయాలని చూస్తుందన్నారు. ఆయనను ఒక పావులా తిప్పుతూ వ్యవహరిస్తున్నారు.ఒకవైపున ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు ఎదురవుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటు చోరీ గురించి కొత్తగా మాట్లాడుతున్నారు. కానీ అసలు ఓటు చోరీ ఎవరు చేస్తున్నారో ప్రజలకు బాగా తెలుసు.కొత్తగా పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్ ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నాయకుడు. ఒకసారి కూడా ధైర్యంగా పోటీ చేయని ఆయనను కేవలం అధిష్ఠానం నిర్ణయంతో పదవిలోకి తీసుకురావడం జరిగిందన్నారు.



వినాయకచవితి సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి గణనాథుడికి పూజ నిర్వహించిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క దంపతులు

# ఏ చిన్నసమస్య వచ్చినా తక్షణమే స్పందించాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### భారీ వర్షాలు, వరదలపై జిల్లా యంత్రాంగం చేపట్టిన సహాయకచర్యలను వివరించిన కలెక్టర్ రాహుల్

### మెదక్ జిల్లాలో గంటపాటు సాగిన సిఎం పర్యటన

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 28, ప్రభాతవార్త :** భారీ వర్షాలు వరదల కారణంగా ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని సహాయక చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని అధికారులతో జిల్లాలో భారీ వర్షాలు వరదలపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా సంభవించేవే ప్రకృతి విపత్తులు అని, అటువంటి విపత్తుల సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి నష్టం పంట నష్టం ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం ఆస్తి నష్టం ప్రాణనష్టాన్ని అంచనాలకు అనుగుణంగా నష్టపరిహారానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. మెదక్ జిల్లాలో భారీగా



మెదక్ ఎస్పీ కార్యాలయంలో సమీక్ష జరుపుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

వర్షాలు వరదలు ముంచెత్తుతున్న కారణంగా వాగులు చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ లో భాగంగా వరద నష్టాలను అంచనాలు వేస్తూ శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జిలు కట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాల యూరియా కొరత విషయంలో బఫర్ స్టాక్ డిస్ట్రి చేస్తూ ఉన్నామని రైతులు రాబోవు పంటలకు కూడా ఇప్పటి నుండే యూరియా కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని, నానో యూరియా పై రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. అనంతరం ఫ్లడ్ ఎఫక్టెడ్ ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు పౌరసరఫరాల శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అదనపు కలెక్టర్ నగేష్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 5.20 నిమిషాలకు మెదక్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో హెలికాప్టర్ ద్వారా చేరుకుని అధికారులతో సమీక్షి ంచిన అనంతరం ఫ్లడ్ ఎఫెక్టెడ్ ఫోటో ఎగ్జిబిషన్ తిలకించి 6.20కు తిరుగు ప్రయాణమయ్యారు.



వినాయకచవితి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి గణనాథుడికి అభిషేకం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు

# ఒరిజినల్ సర్టిఫికెట్ల నిరాకరణపై కళాశాలపై హెచ్‌ఆర్‌సి ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఒర్జినల్ సర్టిఫికేట్లు ఇవ్వడంలేదని తొమ్మిది మంది బి.ఫార్మసీ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నల్గొండలోని వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ యజమాన్యం ప్రభుత్వం నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ రావలసి ఉందనే కారణంతో అక్రమంగా నిలిపివేశారని విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు కమిషన్ చైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ స్పందిస్తూ గురువారం సంబంధిత కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్‌ను వచ్చే నెల2న కమిషన్‌ను ముందు హాజరుకావాలని ఆదేశించింది. అలాగే ఉత్తర్వుల కాపీని జిల్లా కలెక్టర్, తెలంగాణ ఉన్నత విద్యా మండలికి పంపించాలని వెల్లడించింది.

# రోడ్లు, కల్వర్టులు తెగినచోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గురువారం ఆర్‌అండ్‌బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్‌అండ్‌బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షి ంచిన మంత్రి, కాజువేలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. కామారెడ్డి, నిర్మల్ వద్ద వరద ప్రవాహానికి ఎన్‌హెచ్ 44పై రాకపోకలకు ఏర్పడిన అంతరాయం, ట్రాఫిక్ క్లియరెన్స్‌పై మంత్రి ఆరా తీసి, నేషనల్, స్టేట్ హైవేల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్‌లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టుల, ముఖ్యంగా ఇంకా రెడ్ అలెర్ట్ ఉన్న జిల్లాల రోడ్ల వివరాలు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్లు తెగిన చోట, కల్వర్టులు పొంగిపొర్లుతున్న చోట, వాగులు ఉధృతంగా ప్రవహించే మైనర్ బ్రిడ్జిల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాణ నష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పాడైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్‌అండ్‌బి ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా స్టేట్ రోడ్స్ సి.ఈ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి గత రివ్యూలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్‌అండ్‌బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని, 24 గంటలు అలెర్ట్‌గా ఉంటున్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలోని 37 డివిజన్లలో 794 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని, అందులో 1039 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 31 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 10 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 356 చోట్లలో కాజువేలు, కల్వర్టులు వరద ప్రవాహం ఉంటే అందులో 289 దారి మళ్లింపు చేసినట్లు పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 305 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 236చోట్ల క్లియర్ చేశామని, మిగతా చోట్ల వేగంగా క్లియర్ చేస్తున్నామని అన్నారు. మొత్తంగా 206 చోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు, కాజువే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు 53.76 కోట్లు వరకు ఖర్చు అవుతుందని, శాశ్వత పునరుద్ధరణ కోసం 1157.46 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పని తీరును అభినందించిన మంత్రి, అలసత్వం వహించకుండా.. అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు అధిక వర్షాలు ఉన్న ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తూ..పరిస్థితులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, ఏ రోజుకు ఆరోజు వివరాలు ఉదయం, సాయంత్రం తనకు రిపోర్ట్ చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# ఈ సమయంలో ఒలింపిక్స్ క్రీడల గురించి సమీక్ష చేస్తారా?

## సిఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు28:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలు భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ముఖ్యమంత్రి మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. రోమ్ నగరం అగ్నికి ఆహుతవుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించిన చందంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి పట్టణానికి రోడ్డు మార్గాలన్నీ మూసుకుపోయి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇటువంటి కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి, ఇతర అంశాలపై దృష్టి పెట్టడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా, ప్రభుత్వంలో మాత్రం ఎలాంటి చలనం లేదని కేటీఆర్ ఆరోపించారు. క్లిష్ట సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించడం విస్మరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒలింపిక్స్ నిర్వహణ, మూసీ నది సుందరీకరణ వంటి అంశాలపై సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని, రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# విధులకు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగులపై మంత్రి తుమ్మల ఆగ్రహం

## ఉద్యోగులంతా ఉదయం 10.30లోపే రిపోర్టు చేయాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28:** గురువారం సచివాలయంలో తన మంత్రిత్వ శాఖ పరిధిలోని శాఖలు, కార్పోరేషన్ల ఉద్యోగుల హాజరుపై మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.40 వరకు కూడా తమ విధులకు హాజరుకాకపోవడంపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని ఉద్యోగుల నుండి వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం నుండి ఉద్యోగులంతా ఉదయం 10.30 గంటలకు వరకు విధులకు హాజరుకావాలని, హాజరుకాని ఉద్యోగులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యోగులంతా రైతులకు అందుబాటులో ఉండేవిధంగా పనిచేయాలని, రైతులకు కావాల్సిన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని, పంటలు తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. యూరియా పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన మంత్రి.. రాష్ట్రానికి వస్తున్న యూరియాను డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాల వారిగా కేటాయించాలని, అలాగే నిన్న జిల్లాలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలు త్వరగా సేకరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు.

# తెలుగు రాష్ట్రాల రైల్వే ఆస్పత్రుల్లో సిబిఐ దాడులు


## అదుపులో ఇద్దరు రైల్వే ఉద్యోగులు.. మరో వ్యక్తి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 28, ప్రభాతవార్త:** కేంద్ర అవినీతి నిరోధక సంస్థ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సిబిఐ) తెలుగు రాష్ట్రాలతో ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని విజయవాడలోని సిబిఐ కోర్టులో హాజరు పరిచింది. విశాఖపట్నం సిబిఐ ఏసిబికి విశ్వస నీయ వర్గాల ద్వారా అందించిన సమాచారం మేరకు సిబిఐ ప్రత్యేక బృందం విజయవాడ డివిజనల్ ఆసుపత్రిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హస్మత్ అలీ, దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో సీనియర్ పాసింజర్ ట్రైన్ మేనేజర్(గార్డు)గా పనిచేస్తున్న శివనాగ ప్రసాద్‌లతో పాటు మరో ప్రైవేటు వ్యక్తిని అదుపులోకి తీసుకుంది. తనను మెడికల్ డీ-క్యాటగిరైజ్డ్ చేసేందుకు లక్ష రూపాయలు, ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ముందుగా రూ.90వేలు నగదు, మరో రూ.10వేలను ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ సమయంలో నింధితులతో పాటు ఇద్దరు కూడా ఆర్థో డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణతో సికింద్రాబాద్‌లోని రైల్వే సెంట్రల్ ఆసుపత్రి రూం.నెం. 7లో విచారించారు. మెడికల్ డీ-క్యాటగిరైజేషన్ నిమిత్తం ఇద్దరు కూడా డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు అభిజ్ఞ వర్గాల సమాచారం. ఈ వ్యవహారానికి హస్మత్‌అలీ బావమరిది షేక్ రసూల్(ప్రైవేటు వ్యక్తి)ఇతను రైల్వేడాక్టర్లకు , రైల్వే ఉద్యోగులకు మధ్య సిక్‌నెస్, అన్‌ఫిట్, డీ-క్యాటగిరైజేషన్ వంటి లావాదేవీల వ్యాపకాలకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి.

# 75 యేళ్లకే రిటైర్ కావాలని నేనెప్పుడూ చెప్పలేదు!

## బిజెపితో మంచి సంబంధాలే ఉన్నాయి

## రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ 100 యేళ్ల సభలో మోహన్‌భగవత్



**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** రాజకీయాల్లో, సంస్థల్లో 75 యేళ్లకు పదవీ విరమణ చేయాలని తాను వ్యాఖ్యానించినట్లుగా జరుగుతున్న ప్రచారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ స్పష్టతనిచ్చారు. తాను గానీ, మరే ఇతర రాజకీయ నాయకులు గానీ 75 ఏళ్లకు రిటైర్ అవ్వాలని ఎన్నడూ చెప్పలేదని తేల్చి చెప్పారు. వచ్చే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ 75వ ఏట అడుగుపెడుతున్న నేపథ్యంలో, గతంలో భగవత్ చేసిన వ్యాఖ్యలు ఆయనను ఉద్దేశించినవేనని జరుగుతున్న ప్రచారానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ చెక్‌పెట్టారు. గురువారం ఢిల్లీలో జరిగిన "100 వర్ష్ కీ సంఘ్ యాత్ర' కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ, 'నేను రిటైర్ అవుతానని గానీ, ఇంకెవరైనా రిటైర్ అవ్వాలని గానీ ఎప్పుడూ చెప్పలేదు' అని స్పష్టం చేశారు.

గతంలో తాను ఆర్ఎస్ఎస్ మాజీ నేత మోరోపంత్ పింగళికి సంబంధించిన ఒక చమత్కారమైన సంఘటనను ఉదాహరించానని, దానిని చాలామంది తప్పుగా అన్వయించుకున్నారని వివరించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పింగళి జీవిత చరిత్ర పుస్తకా విష్కరణ సందర్భంగా ఆయనకు సంబంధించిన మూడు, నాలుగు సరదా సంఘటనలను పంచుకున్నానని గుర్తుచేశారు. మోరోపంత్ చాలా చమత్కారి. ఆయన మాటలతో కుర్చీలోంచి ఎగిరి గంతేసేలా చేసేవారని భగవత్ అన్నారు. పింగళికి 75 ఏళ్లు వచ్చినప్పుడు, మరో సీనియర్ నేత హెచ్.వి. శేషాద్రి ఆయనకు శాలువా కప్పి ఇక బాధ్యతల నుంచి తప్పుకోవాలని సున్నితంగా సూచించిన సంఘటనను తాను సరదాగా చెప్పానని, అంతేకానీ దానిని ఒక నిబంధనగా పరిగణించరాదని ఆయన తెలిపారు. సంఘ్ కార్య పద్ధతిని వివరిస్తూ, సంఘ్‌లో మేమంతా స్వయంసేవకులం. మాకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఒక పని అప్పగిస్తారు. నాకు 80 ఏళ్లు వచ్చినా సరే, శాఖను నడపమంటే నడపాల్సిందే. మాకు ఏది చెప్పారో అది చేస్తామని ఆయన అన్నారు. ప్రస్తుతం తాను సర్ సంఘ్‌చాలక్‌గా ఏకైక వ్యక్తిని అయినప్పటికీ, తన తర్వాత ఆ బాధ్యతలు చేపట్టేందుకు కనీసం 10 మంది సిద్ధంగా ఉన్నారని భగవత్ పేర్కొన్నారు.

# భారీ వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతర సమీక్ష

## భారీగా నష్టపోయిన జిల్లాకు అదనంగా నిధులు

## యుద్ధప్రాతిపదికన రవాణా సౌకర్యం పునరుద్ధరణ

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరద పరిస్థితులు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షి స్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, హౌసింగ్, సమా చార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొద్ది సమయంలోనే ముఖ్యంగా మెదక్, కామారెడ్డి ఆదిలాబాద్ జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో వర్షపాతం నమోదైందన్నారు. అయినా కూడా ప్రాణ నష్టం, ఆస్తినష్టం వీలైనంత మేరకు తగ్గించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచే పరిస్థితిని సమీక్షి ంచామని వెల్లడించారు. వరదల్లో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. సిరిసిల్ల జిల్లాలోని నర్మల గ్రామం వద్ద బుధవారం మానేరు వాగు వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షి ంచామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వారం రోజుల క్రితమే కోటి రూపాయిల చొప్పున నిధులు విడుదల చేశామని, ప్రస్తుతం అతి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న జిల్లాలకు అదనంగా ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని తెలిపారు. భారీ వర్షాలతో స్థంబించిన జాతీయ రహదారితోపాటు పంచాయితీరాజ్,




ఆర్‌అండ్‌బి రోడ్లను క్లియర్ చేశామని, దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా పునరుద్ధరి స్తున్నామని తెలిపారు. పలు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు రహదారి సౌకర్యాలు దెబ్బతిన్నాయని వీటిని వెంటనే పునరుద్ధరించేలా ఆదేశించామన్నారు. జిల్లాల్లో రెవెన్యూ. పోలీసు యంత్రాంగం చిత్తశుద్ధితో 24గంటలు పనిచేస్తున్నా యని తెలిపారు. గురువారం విపత్తుల నిర్వహణా శాఖ అధికారులతో మంత్రి సమీక్షించడంతో పాటు మెదక్ కామారెడ్డి సిరిసిల్ల నిర్మల్ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

వర్షాలు వరదలపై ఆయా జిల్లాల యంత్రాంగంతో నిరంతరం మానిటరింగ్ చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్షాలతో చనిపోయిన వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో వర్ష బీభత్సం దృష్ట్యా ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు పని చేస్తున్నాయని, అవసరాన్ని బట్టి హెలికాప్టర్‌ల ద్వారా బాధితులను ఆదుకోవడానికి సిద్ధం చేశామని వివరించారు. కూలి పోయిన ఇండ్లు, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి ప్రకటించారు. ఒక్క మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవలం ఒక గంట వ్యవధిలో 700 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నీటి వనరులు పూర్తిగా నిండిపోయాయని, వాటని నుంచి ఉధృతంగా నీరు బయటకు వెళ్లడంతో గట్లు దెబ్బతిని తీవ్ర నష్టాన్ని కలిగించిందని వివరించారు. మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని తండాలు మరీ ఎక్కువగా వర్ష బీభత్సానికి గురయ్యాయని, ఈ తండాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించేలా అధికారులను ఆదేశించామన్నారు. వర్షాల తర్వాత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖకు సూచించామన్నారు. రాష్ట్రంలో ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. ప్రతిపక్షమైన బిఆర్ఎస్ రాజకీయ లబ్దికోసం మాట్లాడడం సరికాదన్నారు. వారి పాలనలో వరదలొస్తే నాడు ఏం చేశారో నేడు ఏం జరుగుతుందో కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు. శవాల మీద చిల్లర ఏరుకునే వ్యవహారం చేయవద్దని, ఉపయుక్తమైన సలహాలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# మేడిపల్లి అడవుల్లో యువతి మృతదేహం!

## 6న చిట్యాలలో మిస్సింగ్ కేసు

**కాటారం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మేడిపల్లి అటవీ ప్రాంతంలో ఓ యువతి మృతదేహం లభ్యం అయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాల మేరకు..జిల్లాలోని చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణి అలియాస్ సోని(22) అనే యువతి హత్యకు గురైనట్లు తెలిసింది. వర్షిణి తల్లి కవిత ఈనెల 6న చిట్యాల పోలీస్ ఠాణాలో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. కాగా వర్షిణి తండ్రి కుమారస్వామి గత రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈతరుణంలోనే గురువారం యువతి వర్షిణి మృతదేహం కాటారం మండలంలోని మేడిపల్లి అడవుల్లో లభ్యం అయ్యింది. కాగా యువతి సమీప మండల వ్యక్తితో ప్రేమ వ్యవహారం కారణంగానే గత కొన్నాళ్ల క్రితం వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ప్రేమ వ్యవహారంతోనే వర్షిణి హత్యకు గురైందా..లేక వేర ఇతర కారణాలతోనేనా అని తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.




వరధలో చిక్కుకున్న రైతులను కాపాడిన దృశ్యం

# పొలం పనులకు వెళ్లి వరద ప్రవాహంలో చిక్కిన రైతులు

## వారిని కాపాడిన రెవెన్యూ సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

**దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), ఆగస్టు 28, ప్రభాతవార్త :** అధికంగా కురుస్తున్న వర్షాలకు చెరువు మత్తడి ఒక్కసారిగా పోటెత్తడంతో పోలం పనుల కోసం వెళ్లిన రైతులు వరద ప్రవహాంలో చిక్కుకుపోయారు, రాత్రంతా నీటి ఒడ్డున బిక్కుబిక్కుమంటూ గడిపిన సంఘటన అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధి లోని చిన్ననిజాంపేట గ్రామంలో బుధవారం జరిగింది. రాష్ట్రంతో పాటుగా జిల్లాలో, గ్రామాల్లో వర్షాలు అధికంగా కురుస్తున్న క్రమంలో చిన్న నిజాంపేట గ్రామానికి చెందిన రైతులు శేర్ల రాజు, శేర్ల గోపాల్, చింతల సుదర్శన్‌లు పొలం పనులకై తమ పొలాలకు వద్దకు వెళ్లగా పోతారెడ్డిపేట చెరువులో నీటి మట్టం అధికం కావడంతో మత్తడి ఉవ్వెత్తున దుంకడంతో చెరువుకి మత్తడికి ఆవతల వైపున ఉన్న ఈ ముగ్గురు రైతులు వరద ప్రవాహంలో అక్కడే చిక్కుకు పోయారు. ఇట్టి విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను గమనిం చారు. ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ హైమవతి తెలుపగా అక్బర్‌పటేభూంపల్లి తహశీల్ధార్ మల్లికార్జున్‌రెడ్డి, దుబ్బాక సిఐ శ్రీనివాస్, మండల ఎస్ఐ హరిష్ గౌడ్ రాత్రంతా చిన్న నిజంపేట గ్రామాంలో ఉండి జలదిగ్బంధంలో చిక్కుకున్న రైతులను తీసుకు రావాడానికి ప్రయత్నించగా వాతావరణం సహకరించక పోవడంతో జల దిగ్బంధంలో ఉన్న రైతులకు అహార పొట్లలు, వసతి సౌకర్యాలు సమకుర్చారు. బాధితుల యోగక్షేమాలు ఎప్పటికి కప్పుడు జిల్లా కలెక్టర్ డాక్టర్ హైమవతి సమిక్షించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ హైమవతి ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఎస్‌డిఆర్‌ఎఫ్ బృంధం సహకారంతో వరద ప్రవహాంలో చిక్కుకు పోయిన రైతులను పడవ సహాయంతో ఒడ్డున చేర్చారు. రైతులు క్షేమంగా ఒడ్డుకు రావడంతో కుటుంబీకులు భావోద్వేగానికి లోనయ్యారు. రైతులను క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బందికి, ఎస్‌డీఆర్‌ఎఫ్‌కి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# మినియాపొలిస్ చర్చిలో కాల్పులు

## ముగ్గురు మృతి, 20 మందికి తీవ్రగాయాలు

**మినియాపొలిస్(యుఎస్), ఆగస్టు 28:** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. ఈసారి మిన్నెసోటా నియాపోలిస్ నగరంలో ఉన్న ఒక స్కూల్‌ను లక్ష్యంగా చేసుకున్నారు ఓ దుండగుడు. సౌత్ మినియాపొలిస్‌లో ఉన్న అనన్సియేషన్ చర్చ్ అనే స్థలంలో జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ చర్చ్‌లో ఒక గ్రామర్ స్కూల్ కూడా ఉండటం వల్ల పిల్లలే ఎక్కువగా గాయపడినట్టు తెలుస్తోంది. దాడి సమయంలో స్కూల్‌లో పిల్లలు, టీచర్లు ఉన్నారు. కాల్పులు ప్రారంభమైన వెంటనే అక్కడ హడావుడి వాతావరణం నెలకొంది. స్థానికులు, పాఠశాల సిబ్బంది వెంటనే పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించారు. మిన్నియాపోలిస్‌లోని సౌత్ సైడ్‌లో ఉన్న అన్నున్సియేషన్ చర్చ్‌లో ఈ ఘటన జరిగింది. షూటర్ కూడా మరణించిన ముగ్గురిలో ఒకరిగా ఉన్నట్లు తెలుస్తోంది. అతను సెమీ ఆటోమేటిక్ గన్ ఉపయోగించి, చివరికి తనకు తానే ఫైరింగ్ చేసుకుని మరణించాడట. కానీ అతని గురించి ఇంకా ఎక్కువ వివరాలు అందుబాటులో లేవు. ఈ ఘటన స్కూల్‌లో చదువుతున్న పిల్లలు, పేరెంట్స్, టీచర్లు, స్టాఫ్‌ని భయాందోళనకు గురిచేసింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఘటనపై పూర్తి సమాచారం అందినట్లు సోషల్ మీడియా ట్రూత్ వేదికగా స్పందించారు. ఘటనా స్థలంలో ఉందని, వైట్ హౌస్ ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తోందన్నారు. దీంతోపాటు బాధితుల తరఫున విచారం వ్యక్తం చేశారు. మిన్నియాపోలిస్‌లో ఇలాంటి హింసాత్మక ఘటనలు జరగడం ఇదే మొదటిసారి కాదు. మంగళవారం మధ్యాహ్నం ఒక హైస్కూల్ బయట జరిగిన షూటింగ్‌లో ఒక వ్యక్తి మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. అదే రోజు రాత్రి, నగరంలో మరో రెండు షూటింగ్‌లలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ ఘటనలు అమెరికాలో గన్ కల్చర్ ఎంత వ్యాపిస్తుందో మరోసారి గుర్తు చేస్తుంది.

# 'మెగాస్టార్ ట్రెడిషనల్ పోస్టర్ రిలీజ్'

మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ 'మన శంకరవరప్రసాద్ గారు' వినాయక చవితి స్పెషల్ ట్రెడిషనల్ పోస్టర్ రిలీజ్ మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవెయిటింగ్ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకరవరప్రసాద్ గారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ ఆధ్వర్యంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. అర్చన సగర్వంగా సమర్పిస్తున్నారు. టైటిల్, ఫస్ట్ లుక్ గ్లింప్స్‌తో సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. పండగకి వస్తున్నారు అనే ఆకట్టుకునే ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రం వస్తుంది. ఈ రోజు, వినాయక చవితి శుభ సందర్భంగా, మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. చిరంజీవి ఒక గొప్ప సాంప్రదాయ అవతార్ లో పట్టు చొక్కా, పట్టు పంచె, కండువా ధరించి, స్టైలిష్ షేడ్స్‌తో ఓ షిప్ డెక్కి మీద గ్రాండ్ ట్రెడిషనల్ లుక్‌లో అలరించారు. కల్చరల్ టచ్, మెగాస్టార్ స్టైల్ రెండూ మిక్స్ అయి పోస్టర్ ఫ్యాన్స్‌కు ఫెస్టివ్ ట్రీట్ అందించింది.



మెగాస్టార్‌కి డైహార్డ్ ఫ్యాన్ అయిన అనిల్‌రావిపూడి, ఫ్యాన్స్ ఎలాగైతే చిరంజీవిని చూడాలనుకుంటారో అలాంటి అద్భుతైన క్యారెక్టర్‌లో చూపిస్తున్నారు. హీరోయిన్‌గా నయనతార నటిస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ సమీర్ రెడ్డి, సంగీతం భీమ్స్ సిసిరోలియో అందిస్తున్నారు. ఎడిటింగ్ తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్షన్ ఏఎస్ ప్రకాష్. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలుగా, ఎస్. కృష్ణ కూడా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు మన శంకరవరప్రసాద్ గారు 2026 సంక్రాంతి కానుకగా థియేటర్స్‌లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వీటీవీ గణేష్‌సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం అనిల్ రావిపూడినిర్మాతలు సాహుగారపాటి సుస్మిత కొణిదెలబ్యానర్లు: షైన్ స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్‌సమర్పణ: అర్చన, సంగీతం : భీమ్స్ సిసిరోలియో.

# 'అందరూ చూడదగ్గ సినిమా మిరాయ్' హీరో తేజా సజ్జా



సూపర్ హీరో తేజ సజ్జా, రాకింగ్ స్టార్ మనోజ్ మంచు, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్'స్పెక్టాక్యులర్ ట్రైలర్ లాంచ్ సూపర్ హీరో తేజ సజ్జా మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, బిటిఎస్ వీడియో వైబ్ ఉంది సాంగ్ మ్యాసీవ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. మరింత ఎక్సయిట్మెంట్ ని పెంచుతూ మేకర్స్ అద్భుతమైన ట్రైలర్ ని లాంచ్ చేశారు.

నిస్వార్థంగా సాయం చేసే ఓ యువకుడి పరిచయంతో ట్రైలర్ ప్రారంభమోతుంది. తొమ్మిది విలువైన గ్రంథాలను పొందడం, బ్లాక్ స్వోర్డ్ అనే విధ్వంసక శక్తి నుండి మానవాళిని రక్షించడం అతని విధి. ఒక మ్యాజికల్ స్టిక్ కనుగొన్న తర్వాత కూడా శక్తులు విఫలమైనప్పుడు, అతను దైవిక బలాన్ని పొందుతాడు. కార్తిక్ ఘట్టమణి ఈ కథను భారీ కాన్వాస్‌పై రూపొందించి, భారతీయ సినిమా అరుదుగా చూసిన స్థాయిలో ప్రజెంట్ చేశాడు. స్క్రీన్‌ప్లే, డైలాగ్, విజువల్స్ అద్భుతంగా వున్నాయి. శ్రీ రాముని ఫైనల్ ఫ్రేమ్స్ చూసినప్పుడు గూజ్ బంప్స్ వచ్చాయి. తేజ సజ్జా యంగ్ స్టర్ నుంచి సూపర్ యోధ వరకు అతని క్యారెక్టర్ ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతంగా వుంది. అతని ఇంటెన్స్ ప్రిపరేషన్, ఫిజికల్ మేకోవర్, యాక్షన్ సీక్వెన్స్‌లో చూపించి యీజ్.. ట్రూ ఎపిక్ అడ్వెంచర్ హీరోగా నిలిపాయి. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు ఫెరోషియస్ బ్లాక్ స్వోర్డ్‌గా అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టారు. రితికా నాయక్ తేజను మిరాయ్ వైపు నడిపించే కీలక పాత్ర పోషించింది. సాధువుగా జగపతి బాబు అద్భుతంగా నటించారు. తేజ తల్లిగా శ్రియ శరణ్ ఆకట్టుకుంది. జయరామ్ పాత్ర ఆసక్తికరంగా వుంది. గౌరీ హారి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నెక్స్ట్ లెవల్ లో వుంది ముఖ్యంగా రాముని దర్శన సమయంలో ఉన్న మంత్రోచ్చారణలు, అనుభూతిని ఆధ్యాత్మికంగా మార్చేస్తాయి. మిరాయ్ ప్రపంచాన్ని శ్రీనాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైన్ అద్భుతంగా చూపింది. ఎక్సిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుజిత్ కుమార్ కొల్లి. పీపుల్ మీడియా ఫాక్టరీ ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ విలువలతో పాథ్‌బ్రేకింగ్ కాన్సెప్ట్ అందించింది. విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా ఉన్నాయి. గ్రాం సీక్వెన్స్‌తో కథనాన్ని మరొక స్థాయికి తీసుకెళ్తుంది. మైథాలజీ గ్రాండ్యూర్‌తో ట్రైలర్ మిరాయ్ పై భారీ అంచనాలు పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో సూపర్ హీరో తేజ సజ్జా మాట్లాడుతూ,. మీ సపోర్ట్ వల్లే నేను ఈరోజు ఇక్కడ ఉన్నాను. మీకు ట్రైలర్లో టీజర్‌లో రేపు పొద్దున్న సినిమాలో కూడా కనిపిస్తుంది. కార్తీక్ గొప్ప డివోపినే కాదు గొప్ప స్టోరీ టెల్లర్. ఆయనతో ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఫ్యూచర్లో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. హరి ఎక్స్ట్రార్డినరీ మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో ఎలివేషన్స్ మూమెంట్స్ మామూలుగా ఉండవు. చాలా గూస్ బంప్స్ మూమెంట్స్ వున్నాయి. విశ్వప్రసాద్ చాలా పాషనేట్ ప్రొడ్యూసర్. ఆయన ఈ సినిమాకి చూపించిన కమిట్మెంట్ నేను మర్చిపోలేను. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. రితిక ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేసింది. శ్రీయ రితో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కొన్ని సినిమాలు చేశాను. ఈ సినిమా కథ నచ్చడం వల్లే ఆమె క్యారెక్టర్ చేశారు. సెప్టెంబర్ 12న చాలా క్లీన్ ఫిలిం తీసుకొస్తున్నాం. పిల్లలు ఫ్యామిలీ అందరు కలిసి చూసే సినిమా ఇది. డైరెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. చాలా సిన్సియర్‌గా తీసిన సినిమా ఇది. మీ అందరికీ సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను.

# సువ్విసువ్వి 2వ గీతం విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'ఓజీ' చిత్రం నుంచి రెండవ గీతం 'సువ్వి సువ్వి' విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరిప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఓజాస్ గంభీర అనే శక్తివంతమైన పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. సంగీత సంచలనం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న 'ఓజీ' చిత్రం నుంచి ఇటీవల విడుదలైన మొదటి గీతం 'ఫైర్ స్టార్మ్'కి విశేష స్పందన లభించింది. సంగీత తుఫాను లాంటి ఈ పాట అభిమానుల రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. తాజాగా 'ఓజీ' నుంచి రెండవ గీతం 'సువ్వి సువ్వి' విడుదలైంది. 'ఫైర్ స్టార్మ్'కి పూర్తి భిన్నంగా హృదయాలను హత్తుకునేలా 'సువ్వి సువ్వి' గీతం సాగింది. విడుదలైన క్షణాల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రోతల మనసులన గెలుచుకుంటోంది. తమన్ అద్భుతమైన సంగీత ప్రయాణంలో గొప్ప పాటలలో ఒకటిగా ప్రశంసలు అందుకుంటోంది. 'సువ్వి సువ్వి' అనే ఈ ప్రేమ గీతాన్ని తమన్ ఎంత అందంగా స్వరపరిచారో.. గాయని శృతి రంజని అంతే మధురంగా ఆలపించారు. ఇక కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొని వచ్చింది. తక్షణమే శ్రోతల హృదయాలను దోచేలా ఉన్న ఈ పాట ఒక ఆత్మీయమైన లోతును కలిగి ఉంది. ప్రేమ పాటలను స్వరపరచడంలో దిట్టగా తమన్ ఎందుకు రాజ్యమేలుతున్నారో ఈ గీతం మరోసారి రుజువు చేసింది. 'సువ్వి సువ్వి'పాటలో పవన్ కళ్యాణ్, ప్రియాంక అరుళ్ మోహన్ జంట చూడ ముచ్చటగా ఉంది. ఈ జోడీ తెరపై సరికొత్తగా కనిపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ గంభీరాన్ని సమతుల్యం చేసేలా కన్మణిగా ప్రియాంక మోహన్ కనిపిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఓజీ చిత్రానికి ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా పవన్, ప్రియాంక జోడి నిలుస్తోంది. ఈ జంటను వెండితెరపై ఎప్పుడెప్పుడు చూస్తామా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఓజీ' చిత్రంలో ఇమ్రాన్ హాష్మీ, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రతిభగల సాంకేతిక నిపుణుల సహకారంతో ప్రేక్షకులకు వెండితెరపై గొప్ప అనుభూతిని అందించే చిత్రంగా 'ఓజీ' రూపుదిద్దుకుంటోంది. ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రాలలో ఒకటి 'ఓజీ' అనడంలో సందేహం లేదు. సెప్టెంబర్ 25, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రం నుండి వచ్చిన ప్రతి అప్‌డేట్ సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. ఇప్పుడు మాస్‌ను శ్రావ్యతతో మిళితం చేస్తూ స్వరపరిచిన 'సువ్వి సువ్వి' గీతం కూడా



# 'గప్‌చుప్ గణేశా' ఫస్ట్‌లుక్

వినాయక చవితి సందర్భంగా 'గప్ చుప్ గణేశా'చిత్ర ఫస్ట్ లుక్ ట్రైలర్ లాంచ్ చేసిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ కేఎస్ ఫిలిం వర్క్స్ బ్యానర్ పై సూరి ఎస్ దర్శకత్వంలో కేఎస్ హేమ్రాజ్ నిర్మాతగా రోహన్, రిదా జంటగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'గప్ చుప్ గణేశా'. ఈ చిత్రానికి శ్రీతరుణ్ సంగీతాన్ని అందించగా అంగత్ కుమార్ సినిమాటోగ్రాఫర్ గా పని చేశారు. అంతేకాక ఈ చిత్రంలో అంబటి శ్రీనివాస్, గడ్డం నవీన్, అశోక్ వర్ధన్, సోనాలి పాణిగ్రహి, కిషోర్ మారిశెట్టి తదితరులు కీలకపాత్రలో పోషించారు. వినాయక చవితి సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ ఈ చిత్ర ఫస్ట్ లుక్ , ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ చిత్ర టైటిల్ గప్ చుప్ గణేశా చాలా బాగుంది. ప్రేక్షకులకు చాలా క్యాచీ టైటిల్ ను చిత్ర బృందం అందించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా నా చేత ఫస్ట్ లుక్, ట్రైలర్ లాంచ్ చేయించిన ఈ చిత్ర బృందానికి ఆల్ ద బెస్ట్ తెలుపుతున్నాను. గతంలో కూడా కేఎస్ ఫిలిం వర్క్స్ బ్యానర్పై రిచ్చిగాడి పెళ్లి అనే చిత్రం హేమ్రాజ్ దర్శకత్వంలో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు హేమ్రాజ్ ఈ చిత్రానికి నిర్మాతక వ్యవహరిస్తున్నారు. ఇటువంటి చిన్న సినిమాలు మంచి విజయం సాధించాలని కోరుకుంటూ మరొకసారి ఈ చిత్ర బృందానికి ఆల్ ద బెస్ట్ తెలుపుతున్నానుఅన్నారు. చిత్ర నిర్మాత హేమ్రాజ్ మాట్లాడుతూ. మా చిత్ర ఫస్ట్ లుక్, ట్రైలర్ లాంచ్ చేసిన ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. చిత్ర దర్శకుడు సూరి ఎస్ మాట్లాడుతూ, 'మమ్మల్ని సపోర్ట్ చేస్తూ ఆయన సమయాన్ని కేటాయించి మాకు అండగా నిలబడిన ఛాంబర్ సెక్రెటరీ దామోదర్ ప్రసాద్‌కి మా చిత్ర బంధం తరఫున ధన్యవాదాలు' అన్నారు. నటుడు రోహన్ మాట్లాడుతూ, మమ్మల్ని మా చిత్ర బృందాన్ని సపోర్ట్ చేస్తూ మా చిత్ర ట్రైలర్ లాంచ్ ఇంకా ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్‌కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ప్రేక్షకులంతా మా చిత్రాన్ని ఆదరించి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను' అంటూ ముగించారు. ఈ చిత్రం త్వరలో ఒక ప్రముఖ ఓటిటి ప్లాట్ఫారం ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర బృందం తెలిపింది.



# 'హరిహర శంకర సాంగ్ రిలీజ్'

'మటన్ సూప్' మూవీ విజయవంతం అవ్వాలని ఆ పరమేశ్వరుడ్ని ప్రార్థిస్తున్నాను.. 'హర హర శంకర' సాంగ్ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ నటుడు తనికెళ్ళ భరణి. రామకృష్ణ వట్టికూటి సమర్పణలోఅలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిఎస్) బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటితెరకెక్కించిన చిత్రం.'మటన్ సూప్' .విట్‌నెస్ ది రియల్ క్రైమ్ ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు ఇటీవలె విడుదల చేయడం, సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడం అందరికీ తెలిసిందే.

ఇక (ఆగస్ట్ 26) 'మటన్ సూప్' నుంచి 'హర హర శంకర' సాంగ్‌ను ప్రముఖ నటుడు తనికెళ్ళ భరణి విడుదలైంది. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ, ఆ విఘ్నేశ్వరుడి దయతో ఏ విఘ్నాలు లేకుండా 'మటన్ సూప్' చిత్రం పెద్ద విజయం సాధించాలి. ప్రస్తుతం ఇండస్ట్రీలోకి కొత్త రక్తం వస్తోంది. నలభై ఏళ్లుగా ఈ ఇండస్ట్రీలో ఉన్నాను. ఓ సినిమా తీయాలంటే ఎంత కష్టపడాల్సి వస్తుందో నాకు తెలుసు. ఈ మూవీ తీసిన వారి, చూసిన వారి జీవితాలు మారిపోవాలి. 'హర హర శంకర'పాటలో సమాజంలో జరుగుతున్న ఘోరాల్ని చూపించారు. మటన్ సూప్‌టీం పడిన కష్టానికి తగ్గ ప్రతిఫలంరావాలి.



ఈ మూవీ విజయవంతం అవ్వాలని ఆ పరమేశ్వరుడ్ని ప్రార్థిస్తున్నాను అని అన్నారు. రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ, మా మటన్ సూప్ చిత్రంలోని హర హర శంకర పాటను రిలీజ్ చేసిన తనికెళ్ల భరణికి ధన్యవాదాలు.

నాకు ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల కి థాంక్స్. నన్ను ముందుండి నడిపిస్తున్న మా పర్వతనేని రాంబాబుకి ధన్యవాదాలు. అడిగిన వెంటనే సాయం చేసిన శివకి థాంక్స్. త్వరలోనే మా చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్లు ఇస్తాం. సెప్టెంబర్‌లో మూవీని విడుదల చేసేదుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ, తనికెళ్ల భరణి మా పాటను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఆయన రావడంతో మాకు స్వయంగా ఆ శివుడే వచ్చినట్టుగా అనిపిస్తోంది. ఇక్కడే మేం విజయం సాధించినట్టుగా అనిపిస్తోందిఅని అన్నారు.

# కృష్ణారెడ్డి43 వ చిత్రం

తెలుగు చిత్ర పరిశ్రమలో హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ తో ఎన్నో ఘన విజయాలను అందించిన దిగ్దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి 43వ సినిమా 'వేదవ్యాస్' ఈ రోజు హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్ లో ప్రముఖ నిర్మాత దిల్ రాజు, బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ వీవీ వినాయక్, అనిల్ రావిపూడి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని కె.అచ్చిరెడ్డిసమర్పణలో సాయిప్రగతి ఫిలింస్ బ్యానర్ పై ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో సౌత్ కొరియా నటి జున్ హ్యున్ జీ హీరోయిన్ గా పరిచయం చేస్తున్నారు ఎస్వీ కృష్ణారెడ్డి. చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా హీరోయిన్ జున్ హ్యున్ జీని ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్ డి సి చైర్మన్ దిల్ రాజు హాలో కంగ్రాట్యులేషన్స్ అండ్ వెల్కమ్ టు టాలీవుడ్ అంటూ బొకే అందించగా ఆమె థాంక్యూ సర్ అనటాన్ని ముహూర్తపు షాటుగా చిత్రీకరించారు. కాగా ఈ ముహూర్తపు షాట్ కు దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇవ్వగా మరో ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా ప్రముఖ నిర్మాత జెమినీ కిరణ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు.. ఆద్యంతం వినూత్నంగా జరిగిన ఈ ప్రారంభోత్సవంలో ప్రముఖ నటులు మురళీ మోహన్, అలీ, జుబేదా అలీ, సాయికుమార్, కెమెరామెన్ శరత్ ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మా కడలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, ఎస్వీ కృష్ణారెడ్డి , అచ్చిరెడ్డి గురించి మనందరికీ తెలిసిందే. కృష్ణారెడ్డి తన 43వ సినిమా చేస్తుండటం, ఆ సినిమా ప్రారంభోత్సవానికి నేను గెస్ట్‌గా రావడం సంతోషంగా ఉంది. మీ 'వేదవ్యాస్' సినిమా ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.



# ఏవిఎం ఆర్ట్స్ బ్యానర్ పై 'తొలి కిరణం'

పీడీ రాజు, అభినయ, సాయి కిరణ్, భానుచందర్, సుమన్, సురేఖావాణి కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమా ఈ చిత్రాన్ని ఏవీఎం ఆర్ట్స్ బ్యానర్ పై మేరీ విజయ సమర్పణలో జె. జాన్ బాబు నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. హార్ట్ టచింగ్ స్టోరీ, స్క్రీన్ ప్లేతో, హై క్వాలిటీ టెక్నికల్ వ్యాల్యూస్ తో తెరకెక్కిన 'తొలి కిరణం' మూవీ అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని డిసెంబర్ 14న కిస్మస్ పర్వదినం సందర్భంగా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 'తొలి కిరణం' సినిమా ప్రేక్షకులకు ది బెస్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత జె. జాన్ బాబు తెలిపారు. దర్శక, నిర్మాత జె. జాన్ బాబు మాట్లాడుతూ ,మా తొలి కిరణం..సినిమా సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సినిమాను క్రిస్మస్ పర్వదినం సందర్భంగా డిసెంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా రికార్డ్ స్థాయిలో అన్ని దేశాల్లో విడుదల చేయబోతున్నాం. హై క్వాలిటీ టెక్నికల్ వ్యాల్యూస్ తో ఈ రోజు వరల్డ్ సినిమాతో పోటీ పడే విధంగా 'తొలి కిరణం' చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాం. సీజీ, గ్రాఫిక్స్ హాలీవుడ్ మూవీ రేంజ్ లో ఉంటాయి. పీడీ రాజు, అభినయ, సుమన్, భానుచందర్ తమ నటనతో ప్రేక్షకుల్ని కట్టిపడేస్తారు. పిల్లలు, పెద్దలు, ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఆద్యంతం ఆకట్టుకునేలా మా సినిమా ఉంటుంది. చంద్రబోస్ సాహిత్యంతో ఆర్పీ పట్నాయక్ మ్యూజిక్ అందించిన పాటలు ఇప్పటికే లక్షలాది సీడీలు అమ్ముడయ్యాయి. మ్యూజిక్ పరంగా సెన్సేషన్ క్రియేట్ చేసిన 'తొలి కిరణం' సినిమా థియేటర్స్ లోనూ అంతే స్థాయి ఘన విజయాన్ని దక్కించుకుంటుందని ఆశిస్తున్నాం. అన్నారు. నటీనటులు భాను చందర్, సుమన్, సాయి కిరణ్, పీ.డీ రాజు, అభినయ, సురేఖ వాణి, ప్రభావతి, రాఘవ తదితరులు. టెక్నికల్ టీమ్: కెమెరా :మురళీ కృష్ణ కథ : రెవరెండ్ టి.ఏ . ప్రభు కిరణ్‌మాటలు :ప్రవీణ్ పాటలు : చంద్రబోస్‌సంగీతం :ఆర్పీ పట్నాయక్ పీఆర్ఓ: లక్ష్మీ నివాస్‌స్క్రీన్ ప్లే, నిర్మాత, దర్శకత్వం: జె. జాన్ బాబు .




# సోల్జర్స్ గాడ్స్ అండ్ టీజర్ విడుదల

గోలీసోడా దర్శకుడు విజయ్ మిల్టన్ తాజా ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్' టైటిల్ టీజర్ విడుదల గోలీసోడా, గోలీసోడా2 చిత్రాల దర్శకుడు, ప్రముఖ కెమెరామెన్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో గోలీసోడా ఫ్రాంచైజీ లో భాగంగా గోలీసోడాలోని స్పిరిట్‌ను.. ఆ లెగసీని కంటిన్యూ చేస్తూ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ద్వి భాషా చిత్రగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో రాజ్ తరుణ్ కథానాయకుడు. ఆయన చిత్రంతో తమిళంలోకి ఎంట్రీ ఇస్తున్నారు. సునీల్, వేదన్, భారత్, అమ్ము అభిరామి, కిషోర్, జెఫ్రీరి, భరత్ శ్రీని, పాల డబ్బా, విజిత తదితరులు ఈ చిత్రంలో ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మాణంలో జరుపుకుంటోన్న ఈ చిత్రానికి వినాయక చవితి పర్వదినాన గాడ్స్ అండ్ సోల్జర్‌ఖిగా టైటిల్‌ని ఫిక్స్ చేసి ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ప్రముఖ తమిళ కథానాయకులు విజయ్ సేతుపతి, విజయ్ ఆంటోని, ఆర్యలతో పాటు మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ తమ ఎక్స్ అకౌంట్ వేదికగా టైటిల్‌ను ట్వీట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ, గోలీసోడాలోని రఫ్‌నెస్‌ను, న్యూ చాప్టర్‌లో ఈ సినిమాలో ఆడియన్స్ చూడబోతున్నారు. ఈ టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ టీజర్‌తో మా సినిమాపై ఆడియన్స్‌లో ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. తప్పకుండా మా చిత్రం తెలుగు, తమిళ భాషల్లో అందరి అంచనాలను అందుకుంటుంది. ఈ సందర్భంగా మా టైటిల్ టీజర్‌ను తమ సోషల్ మీడియాలో షేర్ చేసి మమ్ములను సపోర్ట్ చేసిన అందరికి ధన్యవాదాలు అన్నారు. రాజతరుణ్, సునీల్, వేదన్, భారత్, అమ్ము అభిరామి, కిషోర్, జెఫ్రీరి, భరత్ శ్రీని, పాల డబ్బా, విజిత తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం శ్యామ్ సీఎస్, ఫోటోగ్రఫీ విజయ్ మిల్టన్, ఎడిటర్: పాపన్ జేఆర్, యాక్షన్: కలై కింగ్‌సన్, విక్రమ్ మోర, రచనఫోటోగ్రఫీదర్శకత్వం: విజయ్ మిల్టన్.



# ఆనందం మెరిపిస్తుంది..

**అందమైన మెరిసే చర్మం కోసం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాం కదా! ఆ తనిఖీలో ఆనందం ఉందా? చర్మ ఆరోగ్యంపై దాని ప్రభావమూ ఎక్కువే అంటున్నారు నిపుణులు.**



పాత ఫొటోలను తిరిగేయండి. చాలా ఆనందంగా ఉన్నవాటిని గమనించారా? దుస్తులు, మేకప్ సంబంధం లేకుండా అందంగా కనిపిస్తారు. ఆ మాయ ఆనందానిదే అంటారు స్కిన్ స్పెషలిస్టులు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు సెరటోనిన్, ఆక్సిటోసిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. వీటిలో ఆక్సిటోసిన్ చర్మంపై చూపే సానుకూల ప్రభావం చాలానే. ఇది ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి, చర్మం మెరవడంలోనూ సాయపడుతుందట. అదే దీనికి భిన్నంగా ఒత్తిడితో సతమవుతున్నారనుకోండి. ఈ హ్యాపీ హార్మోన్లు తగ్గి, ఒత్తిడి కలిగించే కార్టిసాల్ విడుదలవుతుంది. దీంతో మొటిమలు, ఎగ్జిమా... అంటూ బోలెడు సమస్యలు.

ఇంతకీ రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? ఇది చేసే మాయ తక్కువ కాదు. ఎరుపెక్కిన అమ్మాయి బుగ్గలు అని చాలాసార్లే వింటాం. నచ్చినవాళ్ల పక్కన ఉన్నప్పుడు, బాగా ఆనందంగా ఉన్నప్పుడు బుగ్గల్లో రక్త ప్రసరణ పెరుగుతుంది ఆ మాయే ఇలా కెంపు రంగు అద్దుకుంటుంది. పెళ్లి, ప్రేమ.. తొలిరోజుల్లో కొత్త అనుభూతులను పంచడమే కాదు, కాస్త ఒత్తిడికి గురిచేస్తుంది కదూ! అవునుమరి... నచ్చేలా కనిపించ దానికి, మెప్పించడానికి ఎన్నెన్ని తిప్పలు పడాలో. ఆ ప్రభావమూ యాక్నే రూపంలో ముఖాన్ని పలకరిస్తుంది. కంగారొద్దు లెండి... కాస్త ఒకరికొకరు అర్థమై సాన్నిహిత్యం పెరిగాక ఇవన్నీ దూరమవుతాయి. అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమే కాదు... కుటుంబ సభ్యుల ఆత్మీయత కూడా చర్మంపై ప్రభావం చూపుతుంది. అందుకే చుట్టూ ఆనందకర వాతావరణం ఉండాలంటారు. వాళ్లిచ్చే ఆత్మీయ కౌగిలీ ఒత్తిడిని దూరం చేసేదే. అన్నట్టూ.. ఆత్మీయులతో గడిపేస్తోంటే సమయమే తెలియదు కదూ! నచ్చినవన్నీ లాగించేస్తాం. కబుర్లలో పడి ఏ అర్థరాత్రో నిద్రలోకి జారతాం. ముఖ్యంగా అలిసిపోతాం. దీంతో మేకప్ తీయడం మర్చిపోతాం. కానీ ఇవన్నీ చర్మానికి హాని చేసేవే. ఏదో ఒకసారి అంటే పర్లేదు. కానీ తరచూ జరుగు తోంటే మాత్రం చర్మం పద్దు రాసుకుంటుంది. ఆ అసంతృప్తిని పొడి, నిర్జీవమైన చర్మం, మొటిమల రూపంలో ప్రదర్శిస్తుంది కాబట్టి, జాగ్రత్త. క్రీములు, ఆహారం అంటూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం కానీ.. ఆనందమూ అందానికి ముఖ్యమే! ఎంత ఆనందం, సంతృప్తితో ఉంటే చర్మం అంత హైడ్రేటెడ్‌గా కనిపిస్తుంది. అంతే కళగానూ కనిపిస్తారు. కాబట్టి, ప్రశాంత వాతావరణం, నవ్వులు, ఆత్మీయ కౌగిలింతలు మీ దినచర్యలో ఉండేలా చూసుకోండి మరి.

# మురికివాడ ప్రజల జీవితాల కోసం..

**గుప్పెడు మెతుకుల కోసం... పోరాటం చేసే పిల్లల్ని చూసి చలించిపోయింది. పిన్నమనేని శ్రీలక్ష్మి ఆకలితో అలమటిస్తూ... తప్పుదోవ పడుతున్న వాళ్ల బతుకుల్ని మార్చుకుంది. అందుకామె ఏం చేసిందంటే...**



విద్య అర్హత మాత్రమే కాదు... గౌరవం, ఎవరి కాళ్లమీద వారు నిలబడే అవకాశం. అలాంటి దానికి దూరమవుతూ దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు మురికివాడల్లోని ప్రజలు. పెద్దల సంగతి సరే... పిల్లలదీ అదే పరిస్థితి. చిన్నవయసులోనే డ్రగ్ పెడ్లర్లుగా మారుతున్నారు. 14 ఏళ్లకే పెళ్లిళ్లు... ఏడాది తిరిగేలోపే పిల్లలు... ముప్పై ఏళ్లు నిండక ముందే మరణాలు. ఇవన్నీ ఏ మారుమూలలలో చోటు చేసుకుంటున్న సమస్యలు కాదు. విజయవాడ స్లమ్స్ కనిపిస్తోన్న దృశ్యాలు. దీన్ని మార్చాలంటే ఓం శాంతి ఛారిటబుల్ ట్రస్టు స్థాపించా. నేను పుట్టి పెరిగిందంతా విజయవాడ. నాన్న పిన్నమనేని పరంధామయ్య, ఆడిటర్. అమ్మ శాంతిశ్రీ పదో తరగతి వరకూ నిర్మల కాన్వెంట్‌లో చదువుకున్నా. చిన్నప్పట్నుంచే సామాజిక సేవలో ఆసక్తి చూపించే దాన్ని. సిఎ పూర్తయ్యాక, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాను. తిరిగొచ్చి ఇక్కడే ఆడిటింగ్ సంస్థను స్థాపించారు. అమెరికాలోని పలు కంపెనీలకు సేవలు అందిస్తున్నాయి. ఆ ఒక్క ఘటనే... కావాలనే ఓ రోజు పనిమీద వెళ్తూ... రోడ్డు పక్కన ఇద్దరు పిల్లలు ఆహారం కోసం కొట్టుకోవడం చూశాను. ఇంటికి వెళ్లాక అవే దృశ్యాలు కళ్లముందు కదిలాయి. మరుసటి రోజు వాళ్లను వెతుక్కుంటూ పక్కనే ఉన్న మురికివాడకు వెళ్లాను. అక్కడి పరిస్థితులు చూశాక, నా బాధ మరింత ఎక్కువైంది. దాదాపు సగానికి పైగా పిల్లలు కనీస సౌకర్యాలు లేని అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తున్నారు. అప్పుడే నిర్ణయించుకున్నా.. వారికి చేతనైనంత సాయం చేయాలని. విద్య ఒక్కటే వారి పరిస్థితుల్ని మార్చగలదు అనిపించింది. అప్పుడే మురికివాడల్లో పిల్లలకు అండగా నిలుస్తున్న సామాజిక కార్యకర్త జోన్స్ మానికొండతో పరిచయమైంది. ఆమె అక్కడి సమస్యలు, తీసుకురావాల్సిన మార్పుగలదు అనిపించింది. అప్పుడే మురికివాడల్లో పిల్లలకు అండగా నిలుస్తున్న సామాజిక కార్యకర్త జోన్స్ మానికొండతో పరిచయమైంది. ఆమె అక్కడి సమస్యలు తీసుకురావాల్సిన మార్పు మీద కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారు. దాంతో 2016 నుంచి జోన్స్‌తో కలిసి పనిచేయడం మొదలు పెట్టా. అవసరమైన మొత్తాన్ని విరాళంగా ఇచ్చేదాన్ని.

**కొట్టడానికి వచ్చారు....** మీ పిల్లల్ని మాతో పంపండి, చదివిస్తాం అంటే.. 'మా పొట్ట కూటికి ఆటంకం కలిగిస్తున్నారంటూ.. మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. ఆదాయ మార్గాలు లేక .. పిల్లల్ని చెత్త కాగితాలు ఏరడానికి, బిక్షాటనకు, ఎలుకలు పట్టడానికి తీసుకెళ్లే వారే ఎక్కువ. వీళ్లకి ఉపాధి ఆదాయ మార్గాలు చూపిస్తే.. పిల్లల్ని ట్యూషన్ సెంటర్లకు పంపిస్తారు అనిపించింది.



నెలవారీ సరకులు ఇచ్చాం. కొందరితో తోపుడు బండ్లు పెట్టించాం. మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశాం. పిల్లలకు పోషకాహారం ఇచ్చేవాళ్లం. దాంతో తల్లిదండ్రులకు మాపై నమ్మకం పెరిగింది. పిల్లలు ట్యూషన్ సెంటర్లకు రావడం మొదలు పెట్టారు. ప్రస్తుతం 13 చోట్ల ఈ సెంటర్లు నడుస్తున్నాయి. ఒక్కో సెంటర్‌లో 20మందికి పైగా పిల్లలు ఉన్నారు. ఇక్కడ విద్యతోపాటు వ్యక్తిగత శుభ్రతకు సంబంధించిన పాఠాలూ చెబుతాం. చదువుకుని వీళ్లంతా పెద్ద పెద్ద అధికారులు కాలేకపోవచ్చేమో కానీ మేము నేర్పుతున్న విలువలతో వాళ్ల జీవితాన్ని తీర్చిదిద్దుకుంటారనే మా ఈ ప్రయత్నం.

# కుంగిపోతున్న 'శాండ్విచ్ కేరర్లు'

**కుటుంబ బాధ్యతలు, పనుల్లో** పడి తమ గురించి పట్టించుకోకుండా అనారోగ్యాన్ని తెచ్చిపెట్టుకుంటున్నవాళ్లే. ఉద్యోగం చేసినా, గృహిణిగా ఉన్నా సరే వాళ్లపై ఉండే పనులభారం ఎక్కువే కదా! ఇక ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నప్పుడు మనకంటూ దొరికే సమయం కూడా తగ్గిపోతుంది. దానికితోడు మనపై ఆధారపడిన వృద్ధులు ఉంటే మరింత భారమవుతుంది. ఇలా అటు పిల్లల్నీ ఇటు వృద్ధుల్నీ ఒకే సమయంలో సంరక్షణ చేసే వాళ్లు కాలంలో అనేక శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని యూనివర్సిటీ కాలేజ్ డన్ చేసిన అధ్యయనాలు చెబుతున్నాయి.

ఇలాంటివారిని 'శాండ్విచ్ కేరర్లు' అంటున్నారు. నిపుణులు. అంటే పిల్లలూ, పెద్దలూ ఇద్దరి బాధ్యతల నడుమ వీళ్ల శాండ్విచ్ వెలిగిపోతారన్నమాట. ఈ పరిస్థితిని తల్లిదండ్రులిద్దరూ ఎదుర్కొంటున్నా... మహిళలు మరింత ఎక్కువగా ప్రభావితమవుతున్నారట.

ఈ పరిశోధన కోసం వాళ్లు 4వేల మందిని ఎంపిక చేసుకున్నారు. అందులో సగం మంది శాండ్విచ్ కేరర్లు, మరో సగంమంది నాన్ శాండ్విచ్ కేరర్లు. తొమ్మిదేళ్లకాలంలో ఈ రెండు గ్రూపుల్లో ఉన్నవారి శారీరక, మానసిక ఆరోగ్యాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో తెలుసుకున్నారు. ముఖ్యంగా శాండ్విచ్ కేరర్ అవ్వక ముందు, అయ్యాక వచ్చిన మార్పులను స్టాటిస్టికల్ మోడల్ ద్వారా కనుగొన్నారు. శాండ్విచ్ కేరర్లు కానివారితో ప్రస్తుత వీళ్ల మానసిక ఆరోగ్యం ఎక్కువగా క్షీణించిందట. కుంగుబాటు, ఆందోళన, బరువు పెరగడం లాంటి అనేక సమస్యలు ఎదుర్కొన్నారట. 30-49 మధ్య వయసున్న వాళ్లు ఎక్కువగా దీని బారిన పడ్డారట. అంతేకాదు, అప్పుడు వచ్చిన మానసిక సమస్యలు ఏళ్లపాటు కొనసాగాయి. మరీ ముఖ్యంగా రోజుకి 20గంటల పాటు ఈ సంరక్షణ బాధ్యతల్లోనే ఉండేవారు మరింతగా కుంగిపోతున్నారట. అందుకే, ఇలాంటి వారిని గుర్తించి కుటుంబ సభ్యులు, సమాజమూ సహకరించాలని, వర్క్ ప్లేస్ ఫ్లెక్సిబిలిటీ, అవసరమైన సాయం అందించాలని, బాధితులు కూడా తమ ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని పరిశోధకులు సూచిస్తున్నారు. మరి మీరూ శాండ్విచ్ కేరర్లేనా?



# రాగి పాత్రల్ని మెరిపిస్తాయి !

**రాగి పాత్రలు మనందరి ఇళ్లలో ఉండేవే! పూజగదిలో వెండి తర్వాత స్థానం రాగిదే.. ఈ కాలంలో కాపర్ కోటింగ్ ఉన్న పాత్రలో కొలువుదీరాయి. అయితే వాటిని శుభ్రం చేయడం కాస్త కష్టమైన పనే. కానీ వంటింట్లో దొరికే కొన్ని పదార్థాలతో సులభంగా మెరిపించచ్చంటున్నారు నిపుణులు.**






**ఉప్పు, వెనిగర్:** ఉప్పు, వెనిగర్ మిశ్రమాన్ని రాగి పాత్రల మీద అప్లై నెమ్మదిగా రుద్దాలి. ఆపై కుళాయి నీటితో కడిగి మెత్తని గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది. ఉప్పు, వెనిగర్ తో మరో విధంగా రాగి పాత్రల్ని శుభ్రం చేయాలి. ఒక పెద్ద గిన్నెలో నీళ్ల తీసుకొని, అందులో టేబుల్ స్పూన్ ఉప్పు, ఒక కప్పు వెనిగర్ వేసి బాగా కలపాలి. అవి కనిగిపోయాక అందులో రాగి పాత్రల్ని వేసి, ఈ గిన్నెను స్టౌ మీద పెట్టాలి. నీళ్లు మరిగే వరకు అలాగే ఉంచాలి. ఈ సమయంలో వాటి మురికి క్రమంగా వదలడం గమనించవచ్చు. ఆ తర్వాత సబ్బుతో మరోసారి రుద్ది.. కడిగేస్తే పాత్రలు తళతళ మెరిసిపోతాయి.

**నిమ్మకాయతో...** నిమ్మకాయతో రాగి పాత్రల్ని సులభంగా శుభ్రం చేసేయచ్చు. నిమ్మకాయను సాగానికి కట్ చేసి, ఒక ముక్కతో రాగి వస్తువులపై రుద్దాలి. లేదంటే నిమ్మ చెక్కకు ఉప్పు అది కూడా పాత్రల్ని రుద్దచ్చు. ఫలితంగా అవి శుభ్రపడతాయి. అంతే కాదు.. నిమ్మరసాన్ని గిన్నెలో పిండి.. అందులో ఉప్పు వేసి కలపాలి. ఈ మిశ్రమంలో ఒక మెత్తని గుడ్డని ముంచి దానితో రాగి పాత్రల్ని క్లీన్ చేయడం వల్ల కూడా ఫలితం ఉంటుంది. ఈ రాగి పాత్రలపై గీతలు పడకుండా కూడా జాగ్రత్తపడచ్చు.



**కెచప్ కూడా!** కెచప్ కూడా రాగి పాత్రల్ని శుభ్రం చేయచ్చు. వాటిపై పడిన కఠినమైన మొండి మరకల్ని సైతం ఇది తొలగి స్తుంది. నమూనా కెచప్ని ఓ పొరల రాగి పాత్రలపై పూయాలి. పది నిమిషాలయ్యాక మెత్తటి గుడ్డతో బాగా రుద్దాలి. ఆపై పాత్రల్ని వేడి నీటితో కడిగి.. పొడిగుడ్డతో తుడిచేస్తే అవి తళతళ లాడతాయి.

# ఆల్ఫా జనరేషన్‌కి ఇవి నేర్పాల్సిందే..

'మాలో మేమెప్పుడూ సొంత నిర్ణయం తీసుకోలేదు. అమ్మానాన్నలు ఏం చెబితే అది చేసేవాళ్లం' అంటే ఈతరం తల్లిదండ్రులు చాలామందినే చూస్తుంటాం. అయితే, ఇప్పటి తరమూ అలానే ఉండాలని కోరుకోవడం మాత్రం అత్యాశే. సామాజిక వ్యవస్థ, ఆర్థికాంశాలు, కుటుంబ వాతావరణం... వంటివాటిపై ఆధారపడిన పిల్లల పెంపకం ఉండేదంటున్నారు నిపుణులు. ఇప్పుడు ఆ పరిస్థితులు మారిపోయాయి. అందుకు తగ్గట్లే తల్లిదండ్రులు కూడా తమ పేరెంటింగ్ స్టైల్ మార్చాల్సిందేనని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆల్ఫా జనరేషన్ (2010-2025) పిల్లల్ని పెంచడంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. అదేలాగంటే... స్క్రీన్ సమయాన్ని నిషేధించే బదులు... వారు ఉపయోగించే యాప్‌లు, ఆడే ఆటలు, వీడియోలు చూస్తే మీరూ తెలుసుకుంటే మేలు. అప్పుడు చిన్నారులూ నియంత్రణలో ఉంటారు. మీరు వద్దనుకున్న వాటి నుంచి... వాళ్లని మళ్లించడమూ సులువవుతుంది. దీంతోపాటే పిల్లలకు ఆన్‌లైన్ భద్రత, సైబర్ బుల్లీయింగ్ ఎదుర్కోవడం, స్క్రీన్ సమయాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం నేర్పించండి. అలానే వాళ్ల టెక్నాలజీని కేవలం కంటెంట్ చూడటానికి మాత్రమే ఉపయోగించనివ్వొద్దు. బదులుగా వీడియోలు రూపొందించడం, కథలు రాయడం, కోడింగ్ నేర్చుకోవడం... వంటివాటిపై శ్రద్ధపెట్టేలా చేయండి. అలానే, వాళ్లకెదైనా సమస్య ఎదురైతే... వెంటనే తీర్చేయకుండా వాళ్లం తట వారుగా పరిష్కారాలు వెతుక్కునేలా చేయండి. రోజువారీ జీవితంలో వాళ్ల వయసుకి తగ్గ పనులు, ప్రత్యామ్నాయాలూ చూపించండి. పిల్లలు కూడా మాట్లాడితే మీరు ఓపిగ్గా వినాలి. సమయం ఇవ్వాలి. అప్పుడే వాళ్ల భావోద్వేగాలను అర్థం చేసుకోగలరు.



# తెలుసుకుందాం..

మన చేతివేళ్లలో కుడిచేయి మధ్య వేలి గోరు వేగంగా పెరుగుతుందట. అదే ఎడమచేయి వాటం ఉన్నవారి కైతే ఎడమచేతి మధ్యవేలు వేగంగా పెరుగుతుందట. మనం ఆ చేయిని ఎక్కువగా ఉపయోగించడమే అందుకు కారణం.



# జ్ఞానభక్తి, ప్రేమభక్తి

**ముగ్గురు స్నేహితులు అడవిలో నడుస్తున్నారు.** హఠాత్తుగా పెద్దపులి ఎదురు పడింది. మొదటి వ్యక్తి భయపడి పోతూ 'మిత్రులారా? మనకు కాలం తీరిపోయింది. ఇక బతికి బట్టకట్టటం అసాధ్యం' అని నీరుగారి పోయాడు. రెండో వ్యక్తి భయపడాల్సిన పనిలేదు, భగవంతుడున్నాడు. ఆయన్ని ప్రార్థిస్తే తప్పకుండా మనల్ని రక్షిస్తాడు అని భరోసా ఇచ్చాడు. మూడో వ్యక్తి జోక్యం చేసుకుని ఇంత చిన్న విషయానికి భగవంతుణ్ణి ఎందుకు ఇబ్బంది పెట్టాలి? ఇదిగో ఈ చెట్టునెక్కి ప్రాణాలు కాపాడు కుందాం! అన్నాడు. గృహస్థభక్తులకు ఈ కథను చెప్పిన రామకృష్ణ పరమహంస కాలం తీరిపోయింది. అని ప్రాణాలపై ఆశలు వదులుకున్న వ్యక్తి నాస్తికుడు. అతడికి భగవంతుడి ఉనికే తెలియదు. ప్రార్థించి రక్షణ కోరదామన్న వ్యక్తి జ్ఞానభక్తి భగవంతుడు ఉన్నాడని, సర్వవ్యాప్తి అయిన ఆయనే మనల్ని కాపాడతాడని తెలిసినవాడతను. పరమాత్మను ప్రేమిస్తూ, తనను రక్షిస్తాడన్న నమ్మకం ఉన్నప్పటికీ, ఆయన్ను కష్టపెట్టకూడదన్న భావనతో స్వప్రయత్నానికి కూడా ప్రాధాన్యం ఇచ్చేవాడిది ప్రేమభక్తి అంటూ వివరించారు. సాధారణ భక్తుల్లో చాలామంది జ్ఞానభక్తుల విభాగంలోకి, బృందావన గోపికల వంటివారు ప్రేమభక్తుల వర్గంలోకి వస్తారని ప్రవచించారు. జ్ఞాన భక్తులు పరమాత్మ రాజ ప్రాసాదం వరకు వెళ్లగలరు. కానీ ప్రేమభక్తి ఉన్నవాళ్లు ఆయన అంతఃపురంలోకి కూడా ప్రవేశించగలరని పరమహంస స్పష్టం చేశారు.



ఆధ్యాత్మికం

# నవ్వుని నటించొద్దు !

నవ్వు ఆరోగ్యానికి మంచిదేనని వినడమే కాదు, లాఫింగ్ యోగాలంటూ దానికోసం సమయాన్ని కేటాయించుకుని మరీ సాధన చేస్తున్నాం. ఒక్కోసారి కొంతమంది మాట్లాడే మాటలు మనకి తెప్పిస్తున్నా నవ్వుతూనే సమాధానం చెబుతుంటాం. మనసు బాగోకపోతే ఆ బాధ బయటకు కనిపించకుండా చిరునవ్వుని చిందిస్తూ మోహంలో ఆ లోటు కనపడకుండా దాచేస్తాం. ఒక్కోసారి కొంతమంది వేసే జోక్స్‌కి మనకి నవ్వు రాదు కానీ మొహమాటం కొద్దీ నవ్వాల్సిన పరిస్థితి, అంతేకాదు, చేసే పనిలో ఒత్తిడికి గురైతే ఆ భయం కనిపించకుండా ఉల్లాసంగా కనిపించేందుకు నకిలీ చిరునవ్వుల్ని ప్రదర్శిస్తాం. ఈ నవ్వునే 'ప్లాస్టిక్ స్మైల్' అంటున్నారు. నిపుణులు. ఇలాంటి నవ్వు ఆరోగ్యానికి మేలు చేయకపోగా అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆక్యుపేషన్ హెల్త్ సైకాలజీ నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇలా నకిలీ నవ్వుని ప్రదర్శించే వారు వ్యక్తిగత భావోద్వేగాలను మనసులోనే దాచుకుంటున్నారు. దీనివల్ల ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది.



# బరువు తగ్గాలంటే డైట్‌లో..

**బరువు తగ్గడానికి ఆహార నియమాలు పాటించడం, వ్యాయామాలు చేయడం కామన్.** ఈ ఎవరైనా రోజూ చపాతీ తింటారు. మరి, సాధారణంగా చపాతీ అంటే గోధుమ పిండితో చేసుకునే వారే ఎక్కువ. కానీ ఇదొక్కటే కాదు.. వివిధ రకాల ధాన్యాలతో చేసిన పిండి కూడా అధిక బరువును తగ్గించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఇలా ఒక్కోసారి ఒక్కో రకమైన పిండితో చపాతీ చేసుకోవడం లేదంటే ఇతర వంట కాలు ప్రయత్నించడం వల్ల విభిన్న రుచుల్ని ఆస్వాదించొచ్చు. అలాగే వాటిలోని పోషకాలూ శరీరానికి అందుతాయి.. మరల బరువు తగ్గాలన్న లక్ష్యాన్నీ చేరుకోవచ్చు:



**ఓట్స్ పిండి :** బరువు తగ్గాలంటే వారి డైట్‌లో ఇది తప్పకుండా ఉంటుంది. అయితే చాలామంది ఓట్స్‌ను పాలలో ఉడికించి తీసుకోవడం, ఓట్స్‌తో ఉప్మా, దోసె. చూస్తుంటాం. వీటితో పాటు ఓట్స్ పిండితో మెత్తని, రుచికరమైన చపాతీలు కూడా తయారుచేసుకోవచ్చు. ఇంట్లో ఉన్న ఓట్స్‌ని మెత్తగా గ్రైండ్ చేసుకోవచ్చు లేదంటే మార్కెట్లో దొరికే ఓట్స్ పిండిని ఎంచుకోవచ్చు. ఓట్స్‌లో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి.. పైగా ఇది గ్లూటెన్ రహిత పదార్థం.. ఇందులోని పోషకాలు చక్కెర స్థాయుల్ని క్రమబద్ధీకరించడంతో పాటు గుండెను మెరుగుపరుస్తాయి. అలాగే శరీరంలో కొవ్వుల్ని కరిగించి బరువు తగ్గడంలోనూ ఓట్స్ సహకరిస్తాయని పలు అధ్యయనాల్లో తేలిది.



**పజ్జ పిండి..** ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఐరన్, సోడియం..వంటి పోషకాలు పుష్కలంగా లభించే సజ్జలు బరువు తగ్గాలంటే వారికి చక్కటి ఆహారం. ఇక వీటిలో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచుతుంది. రక్తంలో కొవ్వును కరిగించడంతో పాటుగా చక్కెర శరీరంలో స్థాయుల్ని అదుపులో ఉంచితే ఈ చిరుధాన్యాలు మధుమేహానికి మంచివంటున్నారు నిపుణులు. కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పునూ ఇవి దూరం చేస్తాయి. కాబట్టి సజ్జ పిండితోనూ రోటీ తయారు చేసుకొని.. కాయగూరలు/ పప్పుతో తీసుకోవచ్చు. అయితే పూర్తిగా సజ్జ పిండి ఉపయోగించి తయారుచేసిన రోటీలు గోధుమపిండి చపాతీతో పోల్చితే కాస్త గట్టిగా, మందంగా వస్తాయి. ఇలా ఇష్టపడని వారు గోధుమ పిండి, సజ్జ పిండి సమపాళ్లలో కలుపుకొని కూడా చపాతీలు తయారుచేసుకోవచ్చు.



**జొన్న పిండి..** జొన్న రొట్టె మనకు తెలిసిన విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే జొన్నల్లో క్యాలరీలు చాలా తక్కువ మొత్తంలో ఉంటాయి. కాబట్టి వీటిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల బరువు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే ఇందులోని విటమిన్ 'బి' కణజాల వృద్ధికి తోడ్పడుతుంది. ఇక ప్రొటీన్లు, క్యాల్షియం, కాపర్, జింక్, పొటాషియం.. వంటి పోషకాలు అధికంగా ఉండే జొన్నలు.. రక్తంలో చక్కెర స్థాయుల్నీ అదుపు చేస్తాయంటున్నారు నిపుణులు. అందుకే బరువు తగ్గాలనుకునే వారు, మధుమేహులు జొన్న పిండితో చేసిన రొట్టెను రోజూ ఒక పూట తీసుకోవాలంటున్నారు. రొట్టెల్ని ఎక్కువగా తినే మరాఠీయులు.. గోధుమ రొట్టెల కంటే జొన్న పిండితో, చేసిన రొట్టెలకే ప్రాధాన్యమిస్తారట!

# కొత్తిమీర తిందాం..

**కొత్తిమీరను ఇష్టపడని వాళ్లు దాదాపుగా ఉండరు.** ఆ పరిమళం అలాంటిది. కూర, చారు, పచ్చడి.. ఎండులో వేసినా.. దాని రుచి రెట్టింపైపోతుంది. ఇది రుచికే కాదండోయ్, ఆరోగ్యానికీ మంచిదే. కొత్తిమీర మంచి పోషకాహారం. విటమిన్లు, ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, భాస్వరం విస్తారంగా ఉన్నాయి. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తుంది. కడుపుబ్బరం, మలబద్ధక సమస్యలను నివారిస్తుంది. ఇందులోని 'ఎ' విటమిన్ కళ్లకు మేలుచేస్తే, 'సి'విటమిన్ రోగనిరోధకశక్తిని పెంచుతుంది. 'ఇ' విటమిన్ కంటి కింది నల్లటి వలయాలను పోగొడుతుంది. రోజూ కాస్త కొత్తిమీర తినడం వల్ల మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. దంతాలు, ఎముకలు దృఢంగా ఉంటాయి. ఓస్టియో పొరాసిస్ లాంటి సమస్యలు తలెత్తుతాయి. ఇది ఒంట్లో వేడిని తగ్గిస్తుంది, ఆకలిని పెంచుతుంది. పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. కీళ్ల జబ్బులు తగ్గుతాయి. కొత్తిమీర నరాలకు, కాలేయానికి, ఊపిరితిత్తులకు మంచిది. ఇది నోటిపూతను, మూత్రపిండాల్లో రాళ్లను నిరోధిస్తుంది. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. రక్తప్రసరణ బాగుంటుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దాంతో గుండెజబ్బులు వచ్చే అవకాశం తక్కువ. ఇది మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. మతిమరపును రానివ్వదు. క్యాన్సర్‌ని సైతం నివారించే ఔషధ గుణాలు ఇందులో ఉన్నాయి. ఇన్ని సుగుణాలున్న కొత్తిమీరను ఏదో రూపంలో తిందాం, ఆరోగ్యంగా ఉందాం.

## బాక్సింగ్ టోర్నమెంట్‌లో.. మెరిసిన భారత్ బాక్సర్లు

# ధృవ్, ఉదయ్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ యూత్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత జూనియర్ బాలురు తమ సత్తాను చాటారు. చైనాలోని జిన్జియాంగ్‌లో జరుగుతున్న 3వ "బెల్ట్ అండ్ రోడ్" ఇంటర్నేషనల్ యూత్ బాక్సింగ్ గాలా-అండర్



17/19/23 టోర్నమెంట్‌లో రెండో రోజు గురువారం జరిగిన నాలుగు బౌట్లలో భారత యువ బౌలర్లు క్లీన్ స్వీప్ చేయడం ఈ రోజు హైలైట్. ఉజ్బెకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మరియు అజర్‌బైజాన్ నుండి వచ్చిన ప్రత్యర్థులను భారత యువ బౌలర్లు ఓడించారు. ధ్రువ్ ఖర్బ్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన యార్కింజోనోవ్ అబ్దుగానిపై 5:0 తేడాతో ఆధిపత్య విజయం సాధించాడు. ఉదయ్ సింగ్ కూడా అదే బాటలో నడిచాడు, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన హబీబీ మొహమ్మద్ జాకిపై మరో క్లినికల్ 5:0 తేడాతో గెలుపొందాడు. అజర్‌బైజాన్‌కు చెందిన మెహతీవ్ తునార్‌పై నాకౌట్ విజయంతో ఉధమ్ సింగ్ రాఘవ్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఆశిష్ ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన సలాంగి ఫర్హాద్‌పై 5:0 తేడాతో ఆధిక్యం సంపాదించాడు. ఈ ఎడిషన్‌లో భారత్ 59 మంది సభ్యుల బృందాన్ని రంగంలోకి దించింది. ఇందులో 20 మంది బాలురు మరియు 20 మంది బాలికలు ఉన్నారు.

# ఆసియా కప్‌లో బ్యాట్స్‌మెన్ దండయాత్ర




## రికార్డులు బద్దలు కొట్టిన టీమ్స్

**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్‌లో పరుగుల వర్షం కురుస్తుండటం సర్వసాధారణం. ఏసియా కప్ టీ20 టోర్నీలోనూ బ్యాట్స్‌మెన్ తమ సత్తా చాటుతూ తమ టీమ్‌లకు భారీ స్కోర్‌లు అందిస్తున్నారు. ఏసియా కప్ టీ20 చరిత్రలో 2022లో నమోదైన టాప్5 భారీ స్కోర్లలో భారత్ రికార్డు సృష్టించింది. ఆఫ్ఘానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ సాధించిన స్కోరు ఏసియా కప్ టీ20 చరిత్రలో అత్యధిక స్కోరుగా నిలిచింది. కేవలం రెండు వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 212 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీ సాధించి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ భారీ లక్ష్యం ముందు ఆఫ్ఘానిస్తాన్ జట్టు పూర్తిగా చేతులెత్తేసింది. అలాగే షార్జాలో పాకిస్తాన్ కూడా హాంకాంగ్‌పై భారీ స్కోరు సాధించింది. ఈ పోరులో పాకిస్తాన్ కేవలం 2 వికెట్లు నష్టపోయి 193 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ భాగస్వామ్యంతో పాకిస్తాన్ 193 పరుగుల భారీ లక్ష్యం నిర్మించింది. ఈ స్కోరు హాంకాంగ్‌కు చాలా కష్టమైంది. పాకిస్తాన్ సునాయాసంగా గెలిచి తమ బలాన్ని నిరూపించుకుంది. ఇది పాకిస్తాన్ జట్టుకు ఏసియా కప్ టీ20 చరిత్రలో అత్యధిక స్కోరుగా నమోదైంది. ఇక భారత్, హాంకాంగ్ మధ్య 2022లో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అత్యధిక స్కోరు 192/2. ఆసియా కప్‌లో అత్యధిక స్కోరు చేసిన ఈ జాబితాలో భారత జట్టు మరోసారి చేరింది. 2022లో హాంకాంగ్‌పై భారత జట్టు మరోసారి అద్భుత ప్రదర్శన చేసింది. సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత్ 20 ఓవర్లలో 192 పరుగులు చేసింది. ఇది ఏసియా కప్ టీ20 చరిత్రలో మూడవ అత్యధిక స్కోరుగా రికార్డయింది. ఇక అదే ఏడాది దుబాయ్ వేదికగా శ్రీలంక, బంగ్లాదేశ్ జరిగిన మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన శ్రీలంక కేవలం 19.2 ఓవర్లలోనే 8 వికెట్లు కోల్పోయి 184 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. శ్రీలంక బ్యాట్స్‌మెన్ ఓపికతో ఆడుతూనే దూకుడు ప్రదర్శించి ఈ విజయం సాధించారు. అత్యధిక స్కోరు సాధించిన జట్లలో టాప్ 5లో బంగ్లాదేశ్-శ్రీలంక ఉంది. అదే ఏడాది దుబాయ్ వేదికగా జరిగిన అదే మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ కూడా అద్భుతంగా ఆడింది. వారు 20 ఓవర్లలో 183 పరుగులు చేశారు. కానీ, శ్రీలంక చివరి ఓవర్లలో విజృంభించి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్ ఏసియా కప్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది.

## ఉమెన్ ఛాంపియన్‌షిప్‌లో..

# టీమిండియా డబుల్ గోల్ఫ్

## 5-0తో భూటాన్ చిత్తు

ఆట




**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్17 మహిళల ఛాంపియన్‌షిప్-2025లో తమ నాలుగో మ్యాచ్‌లో టీమిండియా భూటాన్‌ను 5-0 తేడాతో ఓడించింది. థింపులోని చాంగ్లీమితాంగ్ స్టేడియంలో గురువారం ఆట ప్రారంభమయ్యే సమయానికి యంగ్ టైగ్రెస్సెస్ 3-0 ఆధిక్యంలో ఉంది. నాలుగు రోజుల వ్యవధిలో ఇరు జట్ల మధ్య ఇది రెండవ మ్యాచ్.

మొదటిది భారత్ 8-0 తేడాతో విజయం సాధించింది. గత ఆటలో హ్యాట్రిక్ సాధించిన అనుష్క కుమారి రెండుసార్లు గోల్స్ చేసి, ఐదవ గోల్స్‌కు సహాయం చేసింది. టోర్నమెంట్ లో ఇప్పటివరకు ఆమె వ్యక్తిగత గోల్స్ సంఖ్యను ఏడుకు చేర్చి గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో నిలిచింది. ఇతర గోల్స్‌ను శ్వేతా రాణి (24 నిముషం), జులన్ నోంగ్మైథెమ్ (77 నిముషం), నీరా చాను లాంగ్జామ్ (90+5 నిముషం) సాధించారు. ఈ అద్భుతమైన విజయంతో భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌లలో నాలుగింటిలోనూ విజయాలు సాధించింది, 22 గోల్స్ మాత్రమే వదులుకోకుండా గోల్స్ చేసింది.

దీంతో తొమ్మిది పాయింట్లతో రెండవ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ కంటే 12 పాయింట్లతో భారత్ ఇప్పుడు గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంది. నేపాల్ మూడు పాయింట్లతో రెండవ స్థానంలో ఉండగా, భూటాన్ ఇంకా ఒక్క పాయింట్ కూడా సాధించలేదు. మూడు మ్యాచ్‌ల్లో 13 గోల్స్ చేసిన తర్వాత భూటాన్ లోపాలను పూడ్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నించింది. కానీ 16వ నిమిషంలో అనుష్క ఫ్రీకిక్‌తో తప్పును సరిదిద్దుకుంది. చివరికి 77వ నిమిషంలో నాల్గవ గోల్ వచ్చింది.

## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్..

# అనిష్‌కు రజతం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత్ జట్టు రజతం గెలుచు కుంది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో గురువారం జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో అనిష్ భన్వాలా రజతంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్‌లో ఎక్కువ భాగం ఫీల్డ్‌ను నడిపించి ఆరుగురు ఫైనలిస్టులలో అగ్రస్థానంలో నిలిచి 35 హిట్‌లతో రజతం గెలుచుకున్నాడు. ఫైనల్‌లో మరో భారతీయుడు ఆదర్శ్ సింగ్, కొరియాకు చెందిన సియోయాంగ్ యూన్‌పై షూట్‌ఆఫ్ తర్వాత 15 హిట్‌లు సాధించి మొత్తం మీద ఐదవ స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన లియాన్‌బోఫాన్ సు (36 హిట్స్) స్వర్ణం గెలుచుకోగా, కొరియాకు చెందిన జేక్యూన్ లీ (23 హిట్స్) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. 2023లో అనిష్ ఇదే ఈవెంట్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఫైనల్స్ సగం దశలో, అనిష్ 18 హిట్‌లతో అగ్రస్థానంలో ఉండగా, ఆదర్శ్ సింగ్ 13 హిట్‌లతో నాల్గవ స్థానంలో ఉన్నాడు. ఆదర్శ్ సింగ్ (585), అనిష్ (583), నీరజ్ కుమార్ (570)లతో కూడిన భారత త్రయం 1738 పాయింట్లతో జట్టు విభాగంలో రజతం గెలుచుకుంది. కొరియా 1748 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా, చైనా 1733 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది.

## షియోమికి యాపిల్ శాంసంగ్ నోటీసులు!

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఆగస్టు 28:** చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీకి టెక్ దిగ్గజాలైన యాపిల్, శాంసంగ్ గట్టి షాక్ ఇచ్చాయి. తమ ప్రీమియం ఫోన్లను లక్ష్యంగా చేసుకుని, వాటిని పోలుస్తూ షియోమీ ప్రకటనలపై ఈ రెండు కంపెనీలు వేర్వేరుగా లీగల్ నోటీసులు జారీ చేశాయి. తమ బ్రాండ్ ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా ఉన్న ఈ చర్యలు వెంటనే నిలిపివేయాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో షియోమీ తన ఫ్లాగ్‌షిప్ మోడల్ షియోమీ 15 అల్ట్రాను ప్రమోట్ చేస్తూ కొన్ని వాణిజ్య ప్రకటనలు చేసింది.



ముఖ్యంగా ఏప్రిల్ ఫూల్స్ డే రోజున వార్తాపత్రికల్లో పూర్తి పేజీ యాడ్స్ ఇచ్చి, యాపిల్ ఐఫోన్ 16 ప్రో మాక్స్ కెమెరా తమ ఫోన్ ముందు సరిపోదంటూ ఎగతాళి చేసింది. అంతకుముందు మార్చిలో జరిగిన ఇండియా లాంచ్‌లో కూడా ఐఫోన్ కెమెరాను "క్యూట్" అంటూ వ్యాఖ్యానించింది. శాంసంగ్ ప్రీమియం ఫోన్లను ఉద్దేశించి కూడా ఇలాంటి ప్రచారమే చేసింది. ఈ తరహా ప్రకటనలు వ్యాపార పోటీ పరిధిని దాటి, తమ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని యాపిల్, శాంసంగ్ ఆరోపిస్తున్నాయి. పోటీదారుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ, వారి ఉత్పత్తులను కించపరిచేలా ప్రచారం చేయడాన్ని 'యాంబుష్ మార్కెటింగ్' అంటారు. ఈ విధానంపైనే ఆ రెండు కంపెనీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "సాధారణంగా స్పెసిఫికేషన్లను పోల్చుకోవచ్చు. కానీ, ప్రత్యర్థి కంపెనీ పేరును నేరుగా వాడకూడదు. దానికి బదులుగా పోటీదారుల ఫోన్లు అని చెప్పాలి" అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక వ్యక్తి తెలిపారు. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో బడ్జెట్ బ్రాండ్‌గా పేరున్న షియోమీ, ఇటీవలి కాలంలో ప్రీమియం సెగ్మెంట్‌లో పట్టు సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఐడీసీ నివేదిక ప్రకారం, 2025 రెండో త్రైమాసికంలో భారత మార్కెట్లో శాంసంగ్ 14.5 వాటాతో అగ్రస్థానంలో ఉండగా, షియోమీ 9.6, యాపిల్ 7.5%తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈనేపథ్యంలో ప్రీమియం మార్కెట్లో తన వాటాను పెంచుకోవడానికే షియోమీ ఈ దూకుడు ప్రచార వ్యూహాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.




## జన్‌ధన్ డిపాజిట్లు రూ.2.68 లక్షలకోట్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. గత 11 ఏళ్లలో ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 56 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు, వాటిలో జమ అయిన మొత్తం డిపాజిట్లు రూ.2.68 లక్షల కోట్లకు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా తెరిచిన ఖాతాల్లో 67 శాతానికి పైగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లోనే ఉండటం విశేషం. అంతేకాకుండా మొత్తం ఖాతాదారుల్లో 56 శాతం మహిళలే ఉండటం ఈ పథకం విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడానికి (డీబీటీ), రుణ సౌకర్యాలు, సామాజిక భద్రత కల్పించడానికి జన్‌ధన్ యోజన ఒక ప్రధాన మాధ్యమంగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 38 కోట్ల రూపే కార్డులను జారీ చేశారని, ఇవి దేశంలో డిజిటల్ లావాదేవీల పెరుగుదలకు కీలక పాత్ర పోషించాయని ప్రభుత్వం పేర్కొంది. 201718 ఆర్థిక సంవత్సరంలో పీఓఎస్, ఈకామర్స్ ద్వారా 67 కోట్ల రూపే కార్డు లావాదేవీలు జరగగా, 2024-25 నాటికి ఆ సంఖ్య 93.85 కోట్లకు పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా, ప్రతి వయోజనుడికి బీమా, పింఛను సౌకర్యం ఉండాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. జన్‌ధన్ పథకం పరిధిని మరింత విస్తరించేందుకు సెప్టెంబర్ 30 వరకు ఈకార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన వివరించారు. దేశంలోని 2.7 లక్షల గ్రామ పంచాయతీల్లో కనీసం ఒక క్యాంపు అయినా ఏర్పాటు చేస్తాం. అర్హులైన వారు జన్‌ధన్ ఖాతాలు తెరవడం, జన్ సురక్ష పథకాల్లో చేరడం, కేవైసీ అప్‌డేట్ చేసుకోవడం వంటివి ఈ క్యాంపుల్లో పూర్తి చేయవచ్చని మంత్రి తెలిపారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాల విషయంలో దాదాపు సంతృప్త స్థాయికి చేరుకున్నామని, బీమా, పింఛను కవరేజీ కూడా నిరంతరం పెరుగుతోందని ఆయన అన్నారు. గడచిన 11 ఏళ్లలో జన్‌ధన్ ఖాతాల సంఖ్య మూడు రెట్లు పెరగగా, డిపాజిట్లు సుమారు 12 రెట్లు పెరగడం గమనార్హం.

# 50% ట్యారిఫ్‌లు భారత్‌కు మేలుకొలుపు!

## ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్

వాణిజ్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, అమెరికా ప్రభుత్వం భారత్‌పై విధించిన 50 శాతం టారిఫ్‌లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్య భారత్‌కు ఒక మేల్కొలుపు లాంటిదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయనడానికి ఇదే నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామం మన కళ్లు తెరిపించాలి. మనం ఏ ఒక్క దేశంపై అతిగా ఆధారపడకూడదు. తూర్పు దేశాలు, ఐరోపా, ఆఫ్రికా వైపు కూడా దృష్టి సారించాలి. అమెరికాతో వాణిజ్యం కొనసాగిస్తూనే, మన యువతకు ఉద్యోగాలు కల్పించడానికి అవసరమైన 8 నుండి 8.5 శాతం వృద్ధిని సాధించేందుకు సంస్కరణలను వేగవంతం చేయాలని రఘురామ్ రాజన్ సూచించారు. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే భారత్ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆయన వివరించారు. ఇతర ఆసియా దేశాలకు చాలా తక్కువ బేస్ టారిఫ్‌లు ఉండగా, భారత్‌కు మాత్రం 25 శాతం బేస్ టారిఫ్ నిర్ణయించారు. ఇది మనకు నష్టదాయకమైన అంశం. దీనిని బట్టే ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎంతగా క్షీణించాయో అర్థం చేసుకోవచ్చని రాజన్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనా విధానాన్ని విశ్లేషిస్తూ, వాణిజ్య లోటు ఉంటే, ఇతర దేశాలు అమెరికాను మోసం చేస్తున్నాయని ఆయన భావిస్తారు. తక్కువ ధరలకు వస్తువులు పంపడం వల్ల అమెరికా వినియోగదారులకు మేలు జరుగుతుందనే విషయాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోరని అన్నారు. టారిఫ్‌ల విషయంలో ట్రంప్ ప్రభుత్వం ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌ను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుందని ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై ఎలాంటి చర్యలు తీసుకోని అమెరికా, కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడంపై రాజన్ ప్రశ్నలు లేవనెత్తారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను కొనసాగించడం వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనేది మనం ఆలోచించుకోవాలి. రిఫైనరీలు లాభాలు గడిస్తున్నా, ఎగుమతిదారులు మాత్రం ఈ టారిఫ్‌లతో తీవ్రంగా దెబ్బతింటున్నారు. ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉంటే, ఈ కొనుగోళ్లపై పునరాలోచించాలని ఆయన సూచించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఏ ఒక్క దేశంపైనా అతిగా ఆధారపడటం ప్రమాదకరమని రాజన్ హితవు పలికారు. అమెరికా, చైనా, జపాన్ లేదా యూరప్.. ఇలా అన్ని దేశాలతోనూ సమానంగా వాణిజ్య సంబంధాలు నెరపడం ద్వారా మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందంటూ వైట్‌హౌస్ సలహాదారు పీటర్ నవర్రో చేసిన ఆరోపణలను కూడా ఆయన తోసిపుచ్చారు. ఈ టారిఫ్‌ల వల్ల దేశంలోని చిన్న ఎగుమతిదారుల జీవితాలు అతలాకుతలమవుతాయని రాజన్ హెచ్చరించారు. ముఖ్యంగా రొయ్యల రైతులు, టెక్స్‌టైల్ పరిశ్రమపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. దీనివల్ల కేవలం మన ఎగుమతిదారులే కాకుండా, 50 శాతం అధిక ధరలు చెల్లించాల్సి రావడంతో అమెరికన్ వినియోగదారులు కూడా నష్టపోతారని విశ్లేషించారు. వాణిజ్య లోటును దోపిడీగా భావించడం, విదేశీ విధానంలో కక్ష సాధింపులకు పాల్పడటం వంటి కారణాలతోనే అమెరికా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, దేశ ప్రజల ప్రయోజనాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తామని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. తమ విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ, ఇతర దేశాల విషయంలో ఉదాసీనంగా ఉండటాన్ని వివక్షగా పేర్కొంది.

## ట్యారిఫ్ అమలుతో మళ్లీ నష్టాల్లోకి సూచీలు!




**ముంబయి, ఆగస్టు 28:** భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు అమల్లోకి రావడంతో మంగళవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కూడా అదే తరహాలో పయనించాయి. వరుసగా రెండో రోజూ కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు కూడా అమ్మకాలకు దిగుతుండడం మదుపర్లను మరింత కలవరపెడుతోంది. మంగళవారం విదేశీ మదుపర్లు 6, 516 కోట్లు విలువైన షేర్లను విక్రయించారు. గత మూడుసెషన్లలోకూడా ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపించారు. ఆ ప్రభావంతో గురువారంకూడా సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలను చవిచూశాయి మంగళవారం ముగింపు 80,786 పాయింట్లతో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ రోజుంతా నష్టాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. గురువారం సెన్సెక్స్ 80, 013-80,775 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు సెన్సెక్స్ 705 పాయింట్ల నష్టంతో 80, 080 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 211 పాయింట్ల నష్టంతో 24, 500 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో కల్యాణ్ జువెల్లర్స్, యూనో మిండా, జిందాల్ స్టెయిన్‌లెస్, టైటాన్ కంపెనీ, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ షేర్లు లాభాలను ఆర్జించాయి. అదానీ టోటల్ గ్యాస్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్, సీఈఎస్‌సీ షేర్లు నష్టాల బాటలో నడిచాయి.




# పింఛన్‌దార్ల కోసం మరింత మెరుగైన సేవలు

## ఇపిఎఫ్ఓ 3.0 వెర్షన్‌ను అప్‌గ్రేడ్ చేసిన ఇపిఎఫ్ఓ

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** పెన్షనర్లు తమ పింఛన్ ఖాతాలను మరింత సులువుగాయాక్సెస్‌చేసుకునేందుకు పిఎఫ్ విభాగం మార్పులుచేస్తోంది. కొత్తగా ఇపిఎఫ్ఓ 3.0ను తీసుకువస్తోంది. దీనిని మరికొన్ని రోజుల్లో విడుదల చేయనున్నారు. ముందుగా ఇపిఎఫ్ఓ 2.0 వర్షన్ వస్తుంది. దానికి మోడర్న్ టచ్ ఇస్తూ, మరింత వేగవంతంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఇది కూడా రానుంది. ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్ లాంటి ప్రముఖ ఐటీ సంస్థలు దీన్ని అభివృద్ధి చేస్తున్నాయి. కొత్త పిఎఫ్ 3.0లో సులువుగా విత్‌డ్రా చేసుకునే సౌకర్యం లభిస్తుంది. ఇపిఎఫ్ఓ 3.0తో మీరు మీ పిఎఫ్ డబ్బు పేమెంట్ గేట్‌వే ద్వారా కూడా విత్‌డ్రా చేసుకోవచ్చు. అందుకోసం మీరు యుఎఎన్ (యూనివర్సల్ అకౌంట్ నెంబర్) యాక్టివేట్ చేసుకొని, మీ ఆధార్, బ్యాంక్ ఖాతాతో లింక్ చేసుకుని ఉండాలి. ఆ తర్వాత మీ కార్డుతో యుపిఐకి వెళ్లి, అవసరమైన మేరకు డబ్బు తీసుకోవచ్చు. ఇది ప్రత్యేకంగా అత్యవసర సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది. ఇపిఎఫ్ఓ 3.0ద్వారా కూడా విత్‌డ్రా చేసుకోవచ్చు. డిజిటల్ యుగానికి తగ్గట్లు యుపిఐ పేమెంట్ గేట్‌వే ద్వారా కూడా పిఎఫ్ మనీ తీసుకోవచ్చు. ఇకపై మీ ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం లాంటి యాప్స్ ద్వారా కూడా మీ పిఎఫ్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. దీంతోపాటు మీ పేరు, డేట్ ఆఫ్ బర్త్ మార్చుకోవాలని చూసినా, బ్యాంక్ డీటెయిల్స్ అప్‌డేట్ చేసుకోవాలన్నా ఈజీ అవుతుంది. ఇకపై ఇలాంటి మార్పులకోసం పింఛను ఆఫీసుకు వెళ్లాల్సిన పని లేదు. ఇపిఎఫ్ఓ3.0తో వెరిఫై చేసి ఆన్లైన్లోనే మార్చుకోవచ్చు. ఒక వ్యక్తి మృతి చెందినప్పుడు, కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడతారు. కానీ, కొత్త పిఎఫ్ 3.0లో ఈ క్లెయిమ్స్ ప్రాసెస్ విధానాన్ని చాలా ఈజీగా మార్చారు. మైనర్ల కోసం గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ అవసరం లేదు. అవసరమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటే చాలు. క్లెయిమ్ త్వరగా సెటిల్ అయిపోతుంది. ఇది వారి కుటుంబాలకు ఆర్థికంగా ఉపయోగపడుతుంది. ఇపిఎఫ్ఓ 3.0లో కొత్తగా డిజైన్ చేసిన మొబైల్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్ ఉంటుంది. మీరు ఎప్పుడైనా మీ పిఎఫ్ స్టేటస్, కాంట్రిబ్యూషన్స్, క్లెయిమ్స్ ట్రాక్ చేసుకోవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.